


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




హైదరాబాద్ 18-02-2026 బుధవారం | సంపుటి : 26 | సంచిక : 339 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal
Follow us on

# చెత్తపై సిఎం బెత్తం



## ఏమాత్రం కనిపించినా స్పాట్‌లోనే సస్పెన్షన్

- హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి పురపాలక సంస్థల పరిధిలో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి
- ప్రతిజోన్ లోనూ నేను ప్రత్యక్షంగా తనిఖీ చేస్తాను
- పురపాలక సంస్థల కమిషనర్లు తెల్లవారు జాము ఆరు గంటలకే క్షేత్ర పర్యటన చేయాలి
- ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేలా వ్యవహరిస్తున్న ప్రకటనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- మల్టీలెవల్ పార్కింగ్, స్కైవాక్ మార్కెట్లపై అధ్యయనం చేయండి
- పురపాలక సమీక్షలో సిఎం రేవంత్

2



**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి):** నగరంలో ఉన్న మూడు నగర పాలక సంస్థల పరిధిలో పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి జోన్ లో తాను ప్రత్యక్ష పరిశీలనకు వస్తానని చెప్పారు. ఎక్కడైనా చెత్త కనపడితే సహించబోనన్న సీఎం.. స్పాట్ లోనే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి నగర పాలక సంస్థల కమిషనర్లు తెల్లవారుజామున ఆరు గంటలకే క్షేత్ర పర్యటనలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలపై సీఎం... రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఇందులో ప్రకటనల ఆదాయం పెంపు పాలసీపై ఆరా తీశారు. ఆదాయం పెంపునకు తీసుకోవాల్సిన పలు అంశాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. నగరంలో కూడళ్లు, ఇతర ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలక్ట్రిక్, ఇతర కేబుళ్లు, సీసీ కెమెరాలు, ప్రకటనల బోర్డులు వాటిపై ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రైవేటు భూముల్లోనూ మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పా టుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నెక్లెస్ రోడ్డు పక్కన పలు ప్రాంతాల్లో మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పా టుకు ఉన్న అవకాశాలనుపరిశీలించాలన్నారు. ప్రకటనలకు సంబంధించి పెద్ద మొత్తంలో వివిధ రకాల బోర్డులు కనిపిస్తున్నా ఆశించిన ఆదాయం రాకపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ప్రశ్నించారు.

---

కాంగ్రెస్ సంచిలో

**హస్త బలం 88**

# మరి 7 పురాలు

## 11 మున్సిపాలిటీల్లో 8 చోట్లే ఎన్నికలు

ఇల్లందు, కాగజ్‌నగర్, డోర్నకల్, తొర్రూర్, సుల్తానాబాద్, జహీరాబాద్, జనగామలలో కాంగ్రెస్

ఇద్రేశంలో బీఆర్ఎస్

కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల ఆందోళనలతో దద్దరిల్లిన 'పురా'లు

తొర్రూరులో ఎర్రబెల్లి అరెస్ట్, కంటతడి



---

# 4 వారాల్లో లొంగిపోవాలి

## ప్రత్యూష కేసులో సిద్ధార్థరెడ్డికి సుప్రీం కోర్టు ఆదేశాలు ● తుది తీర్పు వెల్లడి



**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఎఎంఎస్) :** 24 ఏళ్ల క్రితం సంచలనం సృష్టించిన ప్రత్యూష కేసులో సుప్రీంకోర్టు తుది తీర్పు వెల్లడించింది. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ నిందితుడు గుడిపల్లి సిద్ధార్థరెడ్డి నాలుగు వారాల్లో లొంగిపోవాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది.



మిగతా 2లో

---



2

## జీవవైజ్ఞానిక హైదరాబాద్

- రాష్ట్ర రాజధానిని జీవవైజ్ఞానిక రంగానికి ప్రపంచ రాజధానిని చేద్దాం
- ఇందులో భాగస్వాములు కండి, ఇప్పటికే హైదరాబాద్ ప్రపంచ వ్యాక్సిన్ రాజధాని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు ప్రధాన గమ్యస్థానం
- మూడో బయోఏషియా అంతర్జాతీయ సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి

---

# విజయోత్సవ వేళ ఢిల్లీ పిలుపు

19న ఉదయం 10 గంటలకు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కీలక సమావేశం?

ఈ భేటీకి రావాలని సిఎం, మంత్రులు, ఇతర ముఖ్య నేతలకు ఎఐసిసి ఆహ్వానం

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి):** మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలతో పాటు రాజకీయ చతురతతో అధిక సంఖ్యలో మున్సిపాలిటీలను కైవసం చేసుకున్న కాంగ్రెస్ రాష్ట్రంలో మరింత బలోపేతమయ్యేలా ప్రణాళికలు రచిస్తున్నది. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్నా.. పలు వురు కీలక నేతల మధ్య విభేదాలు, అంతర్గత పొరపచ్చాలతో భవిష్యత్తులో ఇతర పార్టీల విమర్శలకు ఆస్కారం ఇవ్వొద్దని భావిస్తోన్న అధిష్టానం దీనికి చెక్ పెట్టాలని యోచిస్తున్నది. నేతల మధ్య సమ న్వయం, పార్టీ బలోపేతంపై దృష్టి సారించిన ఏఐ సీసీ.. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, కీలక నేతలను ఈ నెల 19వ తేదీన ఢిల్లీకి రావాలని ఆహ్వానించింది.



మిగతా 2లో

---

**100 రోజుల తరువాత**

# ఐబొమ్మ రవికి బెయిల్

- దేశం విడిచి వెళ్లరాదు
- పాస్ పోర్టు కోర్టులో అప్పగించాలి
- ప్రతిరోజు ఉదయం పోలీసుల ముందు హాజరవ్వాలి
- రవి పైరసీ వల్ల సినిమా పరిశ్రమకు రూ. వేలకోట్లు నష్టం వాటిల్లినట్లు నిర్ధారణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి):** పైరసీ సినిమాల వెబ్ సైట్ నిర్వాహకుడు రవికి ఎట్టకేలకు బెయిల్ మంజూరైంది. పైరసీ కేసులో గతేడాది నవంబర్ 16న అరెస్ట్ అయి.. వంద రోజుల నుంచి జైలులో ఉన్న ఆయనకు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బెయిల్ మంజూరు సమయంలో హైకోర్టు రవికి కీలక సూచనలు చేసింది. ఎలాంటి పరిస్థితుల్లోనూ భారతదేశం విడిచి బయ టికి వెళ్లొద్దని ఆదేశించింది. ఈ క్రమంలోనే తన పాస్‌పోర్టును కోర్టు లో అప్పగించాలని ఆదేశాలు జారీ చేసింది.



మిగతా 2లో

---

# మార్చి 16 నుంచి ఒంటిపూట బడులు

- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు
- రంజాన్ సందర్భంగా ఉ. 8 నుంచి 1.30 వరకు ఉర్దూ స్కూళ్లు



**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఎఎంఎస్) :** ఒంటిపూట బడులపై పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 16 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఒంటిపూట బడులు ప్రారంభించనున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకే బడులు నడపాలని అన్నియాజమాన్యాలను ఆదేశించింది. ప్రభుత్వ పాఠశాలల్లో 12:30 గంటల సయమంలో మధ్యాహ్న భోజనం అందజేయాలని సూచించింది. పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఉన్న స్కూళ్లలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది.

మిగతా 2లో

---

# కోడ్ ఎత్తివేత



- మున్సిపల్ ఎన్నిక ప్రక్రియ పూర్తవడంతో ఎన్నికల సంఘం ప్రకటన
- నిలిచిపోయిన అభివృద్ధి పనులపై ఆంక్షలు రద్దు
- రాష్ట్రవ్యాప్తంగా సాధారణ పరిస్థితులు

2

---

# ఈ బంధానికి హద్దులు లేవు

## ముంబై లోక్ భవన్ భేటీలో మోడీ, మాక్రాన్



**ముంబై, ఫిబ్రవరి 17 (వుదయం) :** భారత్-ఫ్రాన్స్ బంధానికి సరిహద్దులు లేవు అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. మంగళవారం నాడు ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో సమావేశం తర్వాత మాట్లాడుతూ, ద్వైపాక్షిక భాగస్వామ్యం లోతు, ఆశయాన్నిఆయన నొక్కి చెప్పారు. దానిని ప్రజల మధ్య భాగస్వామ్యంగా, వ్యూహాత్మక సాధేదారీగా అభివర్ణిస్తూ, ముఖ్యంగా సాంకేతికత, అధునాతన సామగ్రికి సంబంధించిన ప్రతి రంగంలో సంబంధాలను బలోపేతం చేయడానికి, సహకారాన్ని విస్తరించడానికి కట్టుబడి ఉన్నాఇరు దేశాలూ కట్టుబడి ఉన్నాయని ఆయన అన్నారు.

మిగతా 2లో

---

# రూ.300 కోట్ల ఒప్పందం

## రూ.వెయ్యి కోట్లు పెట్టేందుకు ముందుకు వచ్చిన ఆర్‌ఎక్స్ ప్రొపెల్లంట్ : మీడియాతో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఎఎంఎస్) :** ప్రజా ప్రభుత్వ పాలనలో అభివృద్ధిలో దూసుకువెళ్తున్న తెలంగాణకు పెట్టుబడులు రాకుండా కొందరు కుట్రలు పన్నుతున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆరోపించారు. అయినా ప్రభుత్వ విధానాలు, సంకల్పంతో పెట్టుబడులు వెల్లువెత్తున్నాయని చెప్పారు. తాజాగా యూఎస్‌కు చెందిన ట్రైడెంట్ ఏఐ కంపెనీ రూ.300 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకుందన్న మంత్రి... ఆర్‌ఎక్స్ ప్రొపెల్లంట్ రూ.వెయ్యి కోట్లు, ఫ్రాజెన్స్ కు చెందిన గ్లోబల్ హెల్త్ కేర్ కంపెనీ ఒపెల్లా వంటి సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. ఇది రాష్ట్రానికి శుభ సూచకం అన్నారు. ఈ



పెట్టుబడులతో స్థానికంగా ఉపాధి అవకాశాలను పెరుగుతాయన్నారు. మంగళవారం హైటెక్స్ లో బయో ఆసియా సదస్సు-2026 ప్రారంభం అనంతరం శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. బయో ఆసియా 2026 సదస్సులో పారిశ్రామిక వేత్తలు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు ఎంతో ఉత్సాహం పాల్గొన్నారని చెప్పారు.

మిగతా 2లో



# జీవవైజ్ఞానిక హైదరాబాద్

**హైదరాబాద్‌ను సమగ్ర జీవవిజ్ఞాన రంగానికి ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దుదాం**
**ప్రపంచంలోని అగ్రగామి క్లస్టర్లతో పోటీ**
**ఇప్పటికే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు ప్రధాన గమ్యస్థానంగా భాగ్యనగరం**
**3వ బయో ఏషియా అంతర్జాతీయ సదస్సులో సీఎం**




**హైదరాబాద్, (వుదయం ప్రతినిధి) :**

వ్యాక్సిన్ తయారీలో ప్రపంచ రాజధానిగా ఉన్న హైదరాబాద్ జీవవైజ్ఞానిక రాజధానిగా ఎదగడంలో భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రపంచ దిగ్గజ కంపెనీలు, శాస్త్రవేత్తలు, నిపుణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ.. దేశంలోని మిగతా రాష్ట్రాలతో కాకుండా ప్రపంచంలోని అగ్రగామి క్లస్టర్లతో పోటీ పడుతోందన్న ఆయన ఇప్పటికే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు ప్రధాన గమ్యస్థానంగా మారిందని వెల్లడించారు. అలాంటి హైదరాబాద్‌ను అందరం కలిసి సమగ్ర జీవవిజ్ఞాన రంగానికి ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దుదామని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ హైటెక్స్‌లో ప్రతిష్ఠాత్మకమైన 23వ బయో ఏషియా అంతర్జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ప్రధానంగా 'టెక్‌బయో అన్‌లీష్డ్ – ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు' ఇతివృత్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రపంచస్థాయి సదస్సులో మాట్లాడిన సీఎం.. తెలంగాణలో పెట్టుబడులకు ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. "ప్రపంచ వ్యాక్సిన్ రాజధానిగా ఉన్న స్థితి నుంచి ప్రపంచ జీవవైజ్ఞానిక రాజధానిగా హైదరాబాద్ ఎదుగుతుంది. అందుకు తెలంగాణ ఉంది. తెలంగాణ అంటే వ్యాపారం. తెలంగాణ ఎదుగుతోంది. ఈ ఎదుగుదలలో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. జీవవైజ్ఞానిక రంగంలో ప్రస్తుతం వస్తున్న ఆధునిక మార్పులను గమనిస్తే, పరిశోధన సంస్థలు, కార్పొరేట్లు, స్టార్టప్‌లు, చిన్న మధ్య తరహా సంస్థలు, ప్రభుత్వం మధ్య బలమైన భాగస్వామ్యం అవసరం ఉంది. ఆయా సంస్థలు, కార్పొరేట్లు విశ్వసనీయమైన, స్థిరమైన, భవిష్యత్తు కోసం మంచి వాతావరణాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. ఆ వాతావరణాన్ని తెలంగాణ అందిస్తుందన్నారు. అందుకు హైదరాబాద్ అనుకూలమైందని చెప్పారు. బల్క్‌డ్రగ్స్ నుంచి బయాలజిక్స్ వరకు, తయారీ నుండి ఆవిష్కరణ వరకు,



భారతదేశం నుండి ప్రపంచస్థాయి వరకు తెలంగాణ ముందుకు సాగుతోందని వివరించారు. తెలంగాణలో ఉన్న వనరులు, అనుకూల పరిస్థితుల దృష్ట్యా ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని కోరారు. జీసీసీలను స్థాపింపి.. ఆవిష్కరణ కేంద్రాలు నిర్మించాలన్నారు. మాలిక్యూల్స్ , ఔషధాలను డిజైన్, క్లినికల్ అనలిటిక్స్‌ను ప్రారంభించామన్నారు. ఏఐ ప్లాట్‌ఫామ్‌లను, డిజిటల్ తయారీ రంగాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. అందుకు ప్రభుత్వం, యంత్రాంగం, శాస్త్రవేత్తలు, నైపుణ్యంతో కూడిన యువత మీ విజయంలో భాగస్వాములుగా ఉంటారని సీఎం హామీ ఇచ్చారు. 23 ఏళ్ల క్రితం బయోఏషియా ప్రారంభమైనప్పుడు హైదరాబాద్ అంటే చార్మినార్, బిర్యానీ, ఔషధ తయారీ, సాఫ్ట్ వేర్ నగరంగా గుర్తింపు ఉండేదని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి... ఇప్పుడు హైదరాబాద్ ప్రపంచ వ్యాక్సిన్ తయారీ కేంద్రంగా కూడా నిలిచిందని హర్షించారు. దూరదృష్టి కలిగిన నాయకత్వం, స్పష్టమైన విధానాలు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు, ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థలు ఉండటంతో హైదరాబాద్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు, పరిశోధన, డిజైన్ రంగాల్లో ప్రపంచ కేంద్రంగా ఎదిగిందని చెప్పారు.

**రూ.73 వేల కోట్లకు పైగా పెట్టుబడులు...**

గడిచిన రెండేళ్లలో తెలంగాణలో జీవవిజ్ఞాన రంగంలో రూ. 73 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని సీఎం తెలిపారు. ఇటీవల దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు సందర్భంగా తెలంగాణ నూతన లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించామన్న ఆయన. జినోమ్ వ్యాలీని విస్తరిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో పాటు ప్రపంచ స్థాయి పరిశోధనలు, ఆవిష్కరణల కోసం వన్–బయోను ప్రారంభించామన్నారు. ఇటీవలే "తెలంగాణ రైజింగ్ 2047" విజన్‌ను ఆవిష్కరించామనీ 2034 నాటికి తెలంగాణ 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్నది మా లక్ష్యమన్నారు.

**గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధి వేగవంతం...**

తెలంగాణలో గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధిని వేగవంతం చేసినట్లు సీఎం వెల్లడించారు. అందులో భాగంగా బలమైన సంకల్పంతో ఇప్పటికే అనేక గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ఆహ్వానించినట్లు చెప్పారు. అందుకు ప్రత్యక్ష నిదర్శనమే బయోఏషియా–2026 సదస్సు అని సీఎం వివరించారు. ఇప్పుడు బయోఏషియా తన పరిధిని విస్తరించుకుని "బయోవరల్డ్"గా మారుతోందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా 500 ప్రముఖ సంస్థలు, దాదాపు 4 వేల మందికి పైగా ప్రతినిధులు హాజరుకావడం అభినందనీయమన్నారు. ఫార్మా, బయోసైన్సెస్, బయోటెక్, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, హెల్త్‌కేర్ రంగాల్లో ప్రముఖులు, బిజినెస్ లీడర్స్ సదస్సులో పాల్గొనడం హర్షించదగ్గ విషయమన్నారు. హైదరాబాద్ లో లో జరుగుతున్న ఈ బయో ఏషియా సదస్సు దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదికలాంటి అంతర్జాతీయ గుర్తింపు పొందుతుందన్న విశ్వాసం తనకుందని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచ నలుమూలల నుంచి బయోఏషియా సదస్సుకు హాజరైన ప్రతినిధులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా పెన్సిల్వేనియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్ కు జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డు–2026 అందించారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

# ఐబొమ్మ రవికి బెయిల్

**మొదటి పేజీ తరువాయి..**



జైలు నుంచి బయటికి వచ్చిన తర్వాత ప్రతి రోజు ఉదయం 11 గంటలకు హైదరాబాద్ సీసీఎస్ పోలీసుల ముందు హాజరు కావాలని తేల్చి చెప్పింది. ఇదీలా వుంటే.. సినిమాలను ఐబొమ్మ రవి పైరసీ చేయడంతో సినిమా ఇండస్ట్రీకి రూ.వేల కోట్ల నష్టం వచ్చినట్లు హైదరాబాద్ పోలీసులు గుర్తించారు. సినిమాలు పైరసీ చేసి.. వాటిని ఐబొమ్మ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేవాడని తెలిపారు. బెట్టింగ్ యాప్‌ల ద్వారా రవి రూ. కోట్ల సొమ్మును దాచినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఇలా అక్రమంగా పోగు చేసిన డబ్బులతో రవి భారత దేశం విడిచిపారిపోయాడని.. అండమాన్ నికోబార్ దీవుల్లోని ఒక ద్వీపంలో నివసిస్తున్నట్లు తేలింది. అక్కడే పౌరసత్వం కూడా తీసుకున్నాడని పోలీసులు వెల్లడించారు. అతడిని పట్టుకునేందుకు ప్రయత్నాలు చేయగా.. అరెస్ట్ చేయడాని కంటే ముందు ఐబొమ్మ వెబ్‌సైట్‌లో. . దమ్ముంటే పట్టుకోండి అంటూ పోలీసులకే సవాల్ విసిరాడు. దీంతో ఈ కేసును మరింత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న హైదరాబాద్ ఐబొమ్మ రవిని పక్కా ప్రణాళికతో అరెస్ట్ చేశారు. పోలీసులు రవిని కస్టడీలోకి తీసుకుని విచారణ చేసినప్పటికీ అతడి నుంచి పూర్తిగా వివరాలను రాబట్టలేకపోయారు. ఏది అడిగినా తనకు తెలియదని.. తనకు సినిమాల పైరసీతో ఎలాంటి సంబంధం లేదని చెప్పడం గమనార్హం. అరెస్ట్ అయినప్పటి నుంచి పలు మార్లు బెయిల్ కోసం రవి ప్రయత్నాలు చేసినప్పటికీ.. ఎదురుదెబ్బలే తగిలాయి. ఇక తాజాగా ఎట్టకేలకు అతడికి హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి విడుదల కానున్నాడు.

# విజయోత్సవ వేళ ఢిల్లీ పిలుపు

**మొదటి పేజీ తరువాయి..**

ఆ రోజు ఉదయం 10 గంటలకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ సారథ్యంలో కీలక సమావేశం జరనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇందులో రాష్ట్రంలో కాంగ్రెస్ సాధించిన మెజారిటీ స్థానాలు, పార్టీ అంతర్గత సమన్వయం, భవిష్యత్ ఎన్నికల కార్యాచరణపై లోతుగా చర్చించనున్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన దిశానిర్దేశం ఈ భేటీ ద్వారా లభించనున్నట్లు తెలుస్తోంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వ పనితీరు, హామీల అమలు, విపక్షాల ఎత్తుగడలను చిత్తు చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై అధిష్టానం పెద్దలు తెలంగాణ నేతలతో చర్చించే అవకాశం ఉంది. మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, వార్డులు కైవసం చేసుకున్న నేపథ్యంలో, ఇదే ఉత్సాహాన్ని కొనసాగిస్తూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఎలా సిద్ధం కావాలనే అంశంపై కూడా ప్రధానంగా దృష్టి పెట్టనున్నారు. ఈ భేటీ అనంతరం రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, కీలక నామినేటెడ్ పదవుల భర్తీ పై కూడా స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.




# మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎత్తివేత

**మున్సిపల్ ఎన్నిక ప్రక్రియ పూర్తవడంతో ఎన్నికల సంఘం ప్రకటన**

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణలో అమలులో ఉన్న మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ను రాష్ట్ర ఎన్నికల సంఘం ఎత్తివేసింది. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పూర్తవడంతో ఈ నిర్ణయం తీసుకున్నది. ఎన్నికల ఫలితాలు వెలువడి, పాలకవర్గాల ఎన్నిక కూడా ముగియడంతో ఎన్నికల నియమావళి తక్షణమే రద్దవుతున్నట్లు ఎన్నికల అధికారులు మంగళవారం ప్రకటించారు. గత నెల 27న ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజు నుంచి రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్ల పరిధిలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. కోడ్ అమలులో ఉన్న సమయంలో కొత్త పథకాల ప్రకటనలు, బదిలీలు, ప్రభుత్వ ప్రచారాలపై ఆంక్షలు కొనసాగాయి. ఇప్పుడు కోడ్ ఎత్తివేయడంతో నిలిచిపోయిన అభివృద్ధి పనులు, పరిపాలనా పరమైన నిర్ణయాలు, బదిలీల ప్రక్రియ తిరిగి ప్రారంభం కానున్నాయి. మరోవైపు ఎన్నికల కోడ్ ముగియడంతో అటు అధికార యంత్రాంగం, ఇటు రాజకీయ నేతలు ఊపిరి పీల్చుకున్నారు. నూతనంగా ఎన్నికైన మేయర్లు, చైర్మన్లు తమ తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించి, అభివృద్ధి పనులపై దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా హంగ్ ఏర్పడి ఉత్కంఠ రేపిన మున్సిపాలిటీలలో కూడా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో రాష్ట్రవ్యాప్తంగా సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి.

# కాంగ్రెస్ సంచిలో మరి 7 పురాలు



**రెండో రోజూ అదే తీరు**
**కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల ఆందోళనలతో దద్దరిల్లిన 'పురా'లు**
**తొర్రూరులో మాజీ మంత్రి ఎర్రబెల్లి అరెస్ట్, కంటతడి**
**11 మున్సిపాలిటీల్లో ఎనిమిదింటిలోనే ఎన్నిక**
**8 చోట్ల ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నిక పూర్తి**
**ఏడు పుర పీఠాలు కాంగ్రెస్ కైవసం**
**బీఆర్ఎస్ ఖాతాలో ఇద్రేశం మున్సిపాలిటీ**
**కోరంలేక ఖానాపూర్‌లో.. క్యాతనపల్లిలో ఘర్షణతో వాయిదా**
**ఇబ్రహీంపట్నం ఎన్నికపై హైకోర్టు స్టే**

**హైదరాబాద్, (వుదయం ప్రతినిధి):**

మున్సిపాలిటీల్లోని ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నికలు రణరంగాన్ని తలపించాయి. ఈ నెల 16న వివిధ కారణాలతో వాయిదా పడిన మున్సిపాలిటీల్లో ఎన్నికకు అధికారులు మంగళవారం ఉదయం ఏర్పాటు చేశారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ స్థానాలను దక్కించుకునేందుకు రాజకీయ పార్టీలు సర్వశక్తులొడ్డాయి. పలుచోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు ఆందోళనకు దిగాయి. వారి ఆందోళనల మధ్య అధికారులు ఎనిమిది చోట్ల ఎన్నికలు పూర్తి చేశారు. వీటిలో ఏడు పుర పీఠాలపై కాంగ్రెస్ జెండా ఎగురవేసింది. దీంతో ఈ నెల 16న 81 స్థానాలు కైవసం చేసుకున్న కాంగ్రెస్ ఖాతాలో మరో ఏడు మున్సిపాలిటీలు చేరగా... వాటి సంఖ్య 88కి చేరింది. ఇద్రేశం మున్సిపాలిటీని ప్రతిపక్ష బీఆర్ఎస్ కైవసం చేసుకున్నది. ఖానాపూర్‌లో కోరంలేక ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. క్యాతనపల్లిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మద్దతుదారుల ఆందోళనతో వాయిదా పడింది. కాగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికను ఎస్ఈసీ వాయిదా వేసింది. ఎన్నికపై హైకోర్టు నుంచి స్టే రావడంతో అధికారులు వాయిదా వేశారు. 19 వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి అపహరణకు గురయ్యాడని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కౌన్సిలర్ యాదగిరి కుమారుడు కిడ్నాప్‌పై హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. ఎల్లుండిలోపు యాదగిరిని తమ ఎదుట హాజరుపర్చాలని హైకోర్టు ఆదేశించింది. అనూహ్యంగా ఉదయం బీఆర్ఎస్ క్యాంపులో కౌన్సిల్ ఎన్నికకు యాదగిరి హాజరయ్యారు. ఛైర్మన్ ఎన్నిక పూర్తయిన తర్వాత అధికారులకు కోర్టు ఆదేశాలు అందాయి. స్టే కారణంగా బీఆర్ఎస్ ఛైర్మన్ అభ్యర్థికి ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదు. మున్సిపాలిటీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేశాయి. తొర్రూర్ మున్సిపాలిటీ కోల్పోవడంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఎన్నికల సమయంలో ఆందోళనకు దిగిన నేపథ్యంలో ఉద్రిక్తత తలెత్తడంతో దయాకర్ రావును నర్సింహుల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. కష్టపడి పని చేసిన కార్యకర్తలకు తానేం సమాధానం చెప్పాలని కన్నీళ్లు పెట్టుకున్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా పని చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక అత్యంత రసవత్తరంగా సాగింది. ఎన్నికల నిబంధనల ప్రకారం ఓటింగ్ ప్రక్రియ ను ప్రారంభించిన అధికారులు.. చేతులెత్తి ఛైర్మన్‌ను ఎన్నుకోవాలని సూచించారు. దీనికి కాంగ్రెస్ కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, రహస్యంగా ఓటింగ్ నిర్వహించాలని గొడవకు దిగారు. ఎన్నికల నియమావళి ప్రకారమే ఓటింగ్ జరగాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు పట్టుబట్టడంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఉద్రిక్తత పెరిగి కాంగ్రెస్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ కౌన్సిలర్లపై దాడులకు దిగారు. మున్సిపల్ కార్యాలయం వద్ద తోపులాట జరగడంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఇరు పార్టీల మధ్య ఘర్షణలు జరుగుతున్నప్పటికీ, రిటర్నింగ్ అధికారి పట్టుదలతో ఓటింగ్ ప్రక్రియను కొనసాగించారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికల ప్రక్రియ పూర్తి చేశారు. చివరికి ఉద్రిక్త పరిస్థితుల నడుమే జరిగిన ఓటింగ్‌లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించింది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకోగా.. 3వ వార్డు మెంబర్ టేకుల సుదర్శన్ రెడ్డి 15 ఓట్లతో మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్ ఎన్నిక శుక్రవారానికి వాయిదా వేశారు. ఎన్నికల ఫలితాల్లో హంగ్ ఏర్పడిన పరిస్థితుల్లో కూడా వ్యూహాత్మకంగా వ్యవహరించి బీఆర్ఎస్ ఈ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం.

తొర్రూరు మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికలు ప్రక్రియ సజావుగా సాగేందుకు 144, 163 సెక్షన్లను అమలు చేసిన పోలీసులు.. పట్టణమంతా భారీ బలగాలతో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య తన ఎక్స్ అఫీషియో ఓటును వినియోగించుకోవడానికి అక్కడికి చేరుకున్నారు. అయితే ఇప్పటికే వరంగల్‌లో వినియోగించుకున్నప్పటికీ, తొర్రూరులో ఎక్స్‌అఫిషియో ఓటును ఎలా వినియోగిస్తారని ప్రశ్నిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్ రావు నిరసనకు దిగారు. నిరసన నేపథ్యంలో పోలీసులు దయాకర్ రావును అదుపులోకి తీసుకుని నరసింహారావుపేట పోలీస్ స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో నర్సింహులపేట వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు భారీ ఎత్తున పోలీసులు వాహనాలను అడ్డుకున్నారు. పోలీసులు, కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోగా, చివరకు దయాకర్ రావును నర్సింహులపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో తొర్రూరులో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతుండగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

**ఏడు మున్సిపాలిటీలు హస్తగతం..**

ఇల్లందు మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకోగా దొడ్డ కిరణ్‌మిత్ర ఛైర్మన్‌గా, పెండేల రాజు వైస్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. కాగజ్‌నగర్ మున్సిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం చేసుకుంది. బీజేపీ మద్దతుతో హస్తం పార్టీ దక్కించుకుంది. అక్కడ చైర్ పర్సన్‌గా కాంగ్రెస్ చెందిన షాహిన్ సుల్తానా ఎన్నికయ్యారు. డోర్నకల్ మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది. మున్సిపల్ ఛైర్ పర్సన్‌గా కొండేటి రాజకుమారి, వైఎస్ ఛైర్ పర్సన్‌గా మాద లావణ్యను ఎన్నికున్నారు. జనగామ, తొర్రూర్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో తీవ్ర ఉత్కంఠ మధ్య జనగామ, తొర్రూర్ మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. రెండుచోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు బలాబలాలు సమానంగా ఉన్నాయి. దీంతో అధికారులు లాటరీ తీశారు. లాటరీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఛైర్మన్ అభ్యర్థుల పేర్లు రావడంతో ఆ రెండు మున్సిపాలిటీలూ కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. సుల్తానాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. సుల్తానాబాద్ మున్సిపాలిటీ ఛైర్మన్‌గా బిరుదు కృష్ణ, వైస్ ఛైర్‌పర్సన్‌గా పుష్పలత ఎన్నికయ్యారు. జహీరాబాద్ మున్సిపాలిటీని కాంగ్రెస్ దక్కించుకుంది. ఛైర్మన్‌గా యూనుస్ ఎన్నికయ్యారు. ముగ్గురు స్వతంత్రులు, ఇద్దరు ఎంఐఎం సభ్యుల మద్దతుతో కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎంపీ సురేష్ షెట్కార్ ఓటు వేశారు. ఇంద్రేశం మున్సిపాలిటీని మాత్రం బీఆర్ఎస్ దక్కించుకుంది. ఛైర్‌పర్సన్‌గా కె. ప్రమీల, వైస్ ఛైర్మన్‌గా హరీశ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.

**క్యాతన్ పల్లి, నిర్మల్ లో వాయిదా..**

క్యాతన్‌పల్లి మున్సిపల్ పాలకవర్గం ఎన్నిక వాయిదా మళ్లీ పడింది. ఇరువర్గాల గొడవతో ప్రత్యేకాధికారి సతీష్ కుమార్ ఎన్నిక వాయిదా వేశారు. కోరం వచ్చినా అధికారులు ఎన్నిక నిర్వహించలేదు. ఎన్నిక చేపట్టాలని బీఆర్ఎస్, సీపీఐ సభ్యులు డిమాండ్ చేశారు. మంత్రి వివేక్, ఎంపీ వంశీ పార్టీ అభ్యర్థులతో కలిసి బయటకు వెళ్లారు. ఎన్నికల గదిలో బీఆర్ఎస్ సభ్యులు తమపై దురుసుగా ప్రవర్తించారని వివేక్ ఆరోపించారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు నిబంధనలు ఉల్లంఘించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ప్రమాణ స్వీకారం తర్వాత అధికారులు కావాలని పది నిమిషాలు విరామం ఇచ్చారని, తమని కిడ్నాప్ చేయాలని కాంగ్రెస్ పథకం వేసిందని ఆరోపించారు.

ఎన్నిక జరిగే సమావేశం మంత్రి వివేక్ ప్రసంగించడానికి అధికారులు అవకాశం ఇచ్చారని, బీఆర్ఎస్, సీపీఐ బలాన్ని చూసి వివేక్ జీర్ణించుకోలేక పోయారని విమర్శించారు. సజావుగా జరపాల్సిన ఎన్నికలను ఉద్దేశ్యపూర్వకంగానే వాయిదా వేశారని అన్నారు. అలాగే కోరం లేకపోవడంతో నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోనూ మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు రెండో రోజు వాయిదా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# డాటా సెంటర్లకు రాయితీలపై అధ్యయనం చేయండి

**భూ పరిహారం నిర్ణయంలో ఉదారంగా వ్యవహరించండి**
**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి):**

డాటా సెంటర్లకు వివిధ రాష్ట్రాలు ఇస్తున్న రాయితీలపై అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో డాటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకు వచ్చిన సంస్థలు.. వారికి అవసరమైన భూమి, ఇతర వసతులపై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక సూచనలు చేశారు. డాటా సెంటర్లకు భూ కేటాయింపులో హేతుబద్ధత ఉండాలని చెప్పారు. వివిధ ప్రాంతాల్లో డాటా సెంటర్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు సాగుతున్న భూ సేకరణపైనా సీఎం ఆరా తీశారు. భూ పరిహారం నిర్ణయం విషయంలో ఉదారంగా ఉండాలని అధికారులకు సూచించారు. రైతులను పిలిచి మాట్లాడి వారు సంతృప్తి చెందేలా పరిహారం నిర్ణయించాలన్నారు. రూ.వేల కోట్లతో పెట్టుబడులు పెట్టే సంస్థలు భూమిపై పెట్టె పెట్టుబడి చాలా స్వల్పమన్నారు. కంపెనీలకు సకాలంలో భూమి, ఇతర వసతులు అందుబాటులో ఉంచితే త్వరగా పనులు పూర్తి చేసుకుంటారని సీఎం అభిప్రాయపడ్డారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరి అజిత్ రెడ్డి, ఐటీ శాఖ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక పాల్గొన్నారు.

# ఈ నెల 23న కేబినెట్ భేటీ

**హైదరాబాద్,(వుదయం ప్రతినిధి):**

ఈ నెల 23న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కానుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు మంత్రిమండలి సమావేశమై కీలక అంశాలపై చర్చించనున్నది. ఇందులో పలు నిర్ణయాలు తీసుకోబోతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ముఖ్యంగా తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై మంత్రులు చర్చించనున్నారు. అలాగే జీహెచ్ఎంసీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.



# మార్చి 16 నుంచి ఒంటిపూట బడులు

**మొదటి పేజీ తరువాయి..**

ఏప్రిల్ 24 నుంచి వేసవి సెలవులు ప్రా రంభం అవుతాయని పేర్కొన్న విద్యా శాఖ.. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని తెలిపింది.

**ఉర్దూ మీడియం పాఠశాలల తరగతుల సమయాల్లో మార్పు...**

రంజాన్ సందర్భంగా పాఠశాల సమయాల్లో తెలంగాణ విద్యాశాఖ మార్పులు చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్ ఉర్దూ మీడియం పాఠశాలల్లో టైమ్ టేబుల్ చేంజ్ చేసింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని ఆదేశించింది. అవసరమైతే వారంలో ఒక రోజు అదనంగా తరగతులు నిర్వహించాలని ఆదేశిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

# ఈ బంధానికి హద్దులు లేవు

**మొదటి పేజీ తరువాయి..**

దానిని భవిష్యత్ నిర్మాణంగా అభివర్ణిస్తూ, భారత్–ఫ్రాన్స్ భాగస్వామ్యం అనేది ప్రపంచం స్థిరత్వానికి ఒక శక్తి అని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఫ్రెంచి అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌ను ముంబైలో కలుసుకున్నారు. వారి మధ్య సమావేశంలో ప్రతిపాదిత 114 రఫేల్ ఫైటర్ జెట్ల కొనుగోలు ఒప్పందం సహా రక్షణ సహకారం కీలక అంశంగా ముందుకు వచ్చింది.

ఇరు నాయకులు ముంబైలోని లోక్‌భవన్‌లో ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొన్నారు. ఇందులో ప్రతిపాదిత 114 రఫేల్ జెట్ల సేకరణ గురించి కూడా చర్చించారు. ఈ ఒప్పందం దాదాపు ఖరారు అయ్యే దశలో ఉన్నట్టు తెలుస్తోంది.

**రఫేల్, హామర్ క్షిపణి ఒప్పందం...**

ఫైటర్ విమానాల ఒప్పందంతో పాటుగా, హామర్ క్షిపణుల ఒప్పందం కూడా ఈ చర్చల సందర్భంగా ఖరారవుతుందని భావిస్తున్నారు. అధ్యక్షుడు మాక్రాన్ పర్యటనకు ముందు రక్షణ మంత్రిత్వ శాఖ 114 రఫేల్ జెట్ల ను భారత్‌లో తయారు చేసేందుకు ఆమోదం తెలిపింది. ఈ పరిణామం భారత్ – ఫ్రాన్స్ రక్షణ సహకారంలో ఒక కీలక అడుగును సూచిస్తుంది.

**హెలికాప్టర్ కేంద్ర ప్రారంభం..**

బెంగళూరు సమీపంలో యూరోపియన్ కంపెనీలు ఎయిర్‌బస్, టాటా సంయుక్తంగా స్థాపించిన హెలికాప్టర్ ప్లాంట్‌ను ప్రధాని మోడీ, అధ్యక్షుడు మాక్రాన్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ సౌకర్యం భారత సైన్యం కోసం తేలికపాటి యుటిలిటీ హెలికాప్టర్లు, హెచ్–125 ఎల్‌యుహెచ్ ను తయారు చేస్తుంది. ఈ హెలికాప్టర్లు భారత సైన్యం, వైమానిక దళం నిర్వహిస్తున్న పాత చీటా, చేతక్ విమానాలను భర్తీ చేయడానికి ఉద్దేశించారు. ప్రారంభోత్సవం సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఫ్రెంచ్



రక్షణ మంత్రి ఆ కేంద్రంలో ఉంటారు.

**ముంబైలో మక్రాన్ కార్యకలాపాలు..**

తన ముంబై పర్యటన సందర్భంగా అధ్యక్షుడు మాక్రాన్ కళలు, సంస్కృతికి సంబంధించిన ప్రముఖ వ్యక్తులను కలుసుకున్నారు. ఈ ఉన్నత స్థాయి కార్యక్రమం భారత దేశం, ఫ్రాన్స్ మధ్య విస్తరిస్తున్న వ్యూహాత్మక, సాంస్కృతిక భాగస్వామ్యాన్ని నొక్కి చెబుతుంది.

# ట్రైడెంట్ ఎఐతో రూ.300 కోట్ల ఒప్పందం

**మొదటి పేజీ తరువాయి..**

టెక్నాలజీతో భౌగోళిక, ఆర్థిక, రాజకీయ మార్పుకు అనుగుణంగా సదస్సు విజన్ పెట్టుకున్నామన్నారు. లైఫ్ సైన్సెస్ కంపెనీలు.. ఏఐ టెక్నాలజీ వినియోగించుకుని ముందుకు వెళ్లాలన్నారు. హెల్త్ కేర్.. ప్రజలకు అందుబాటులో ఉంచాలనేదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. 25 బిలియన్ డాలర్స్ పెట్టుబడులు సాధించాలన్నదే తెలంగాణ లైఫ్ సైన్సెస్ పాలసీ టార్గెట్ అని చెప్పారు. త్వరలో లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**ఐదు లక్షల ఉద్యోగాలు టార్గెట్..**

హైదరాబాద్‌ను లైఫ్ సైన్సెస్, ఫార్మా హబ్‌గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మార్పులకు అనుగుణంగా.. లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగంలో మెరుగైన టెక్నాలజీని ఉపయోగించుకుంటామని వెల్లడించారు. జినోమ్ వ్యాలీ ఫేజ్ 4 ను వంద ఎకరాలతో విస్తరించబోతున్నట్లు వివరించారు. అత్యాధునిక మౌలిక వసతులతో జీనోమ్ వ్యాలీ ఫేజ్ 4 ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. 2035 నాటికి 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు లైఫ్ సైన్సెస్ రంగంలో ఆకర్షించేందుకు ప్రణాళిక పెట్టుకున్నామన్నారు. కొత్తగా 5 లక్షల ఉద్యోగాలు యువతకు కల్పించే లక్ష్యంతో ఉన్నామని తెలంగాణను ప్రపంచంలోని టాప్–3 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో ఒకటిగా నిలుపుతామన్నారు. ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ వంటి ఆధునిక



రంగాల్లో యువతకు నైపుణ్య శిక్షణతో పాటు తెలంగాణ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా రెడీ టు వర్క్ ఫోర్స్ సిద్ధం చేస్తామన్నారు. ఉత్పత్తి మాత్రమే కాకుండా కొత్త ఔషధాల పరిశోధన కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందుతోందన్నారు.

# జాతీయం-అంతర్జాతీయం

## జె&కె రాష్ట్రహోదాపై త్వరలో నిర్ణయం



**శ్రీనగర్, ఫిబ్రవరి 17 (వుదయం):**

జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ నిర్ణయాన్ని గురించిన వార్తను త్వరలోనే వింటారని కేంద్ర న్యాయ, చట్ట శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ చెప్పారు. శ్రీనగర్‌లోని షేర్ ఇ కశ్మీర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్ (ఎస్కెఐసిసి)లో విలేకరులతో మాట్లాడుతూ, ఈ అంశం చాలా సున్నితమైందని, కానీ ఈ ప్రక్రియకు కేంద్రం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. సరైన ప్రక్రియను అనుసరిస్తామని, ప్రజలకు వారికి రావాల్సినది పొందుతారని హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే లోక్‌సభలో హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. సాంకేతికత ఆధారిత న్యాయ సేవలపై దృష్టి సారించే టెలిలా (దిషా) పథకంపై ప్రాంతీయ వర్క్‌షాప్‌కు అధ్యక్షత వహించడానికి మేఘ్వాల్ శ్రీనగర్‌కు వచ్చారు. అయితే, ఈ ప్రాంతపు రాజకీయ స్థితిపై ఆయన చేసిన వ్యాఖ్యలు వెంటనే అందరి దృష్టిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, మంత్రి వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా ఆశావాదం వ్యక్తం చేశారు. తన ప్రభుత్వం కేంద్రంతో నిరంతర చర్చలలో ఉన్నప్పటికీ, ఈ ప్రక్రియ ఊహించిన దానికంటే ఎక్కువ సమయం పట్టిందని అబ్దుల్లా అన్నారు. జమ్మూకాశ్మీర్ ప్రజలు ఏడాదిన్నరగా శుభవార్త కోసం ఎదురు చూస్తున్నారని, కేంద్ర మంత్రి ముందస్తు నిర్ణయం గురించి ఇచ్చిన సూచన చివరకు కార్యరూపం దాలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## బెంగాల్‌లో 7గురు అధికారులను సస్పెండ్ చేసిన ఈసి

**కోల్‌కొత, ఫిబ్రవరి 17 (వుదయం):**




స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐఆర్) ప్రక్రియకి సంబంధించి తీవ్రమైన దుష్ప్రవర్తన, విధి నిర్వహణలో నిర్లక్ష్యం, చట్టబద్ధమైన అధికారాలను దుర్వినియోగం చేసినందుకు పశ్చిమ బెంగాల్‌లో ఏడుగురు అధికారులను ఎన్నికల సంఘం తక్షణమే సస్పెండ్ చేసింది. ఎన్నికల చట్టం కింద దాని అధికారాలను ఉపయోగించి ఈ చర్య తీసుకుంది.

సస్పెండ్ అయిన అధికారులందరూ ఇసికి అసిస్టెంట్ ఎన్నికల నమోదు అధికారులుగా పని చేస్తున్నారు.

బూతు స్థాయి, ఎన్నికల నమోదు అధికారులు, వారి అసిస్టెంట్లు ప్రభుత్వ ఉద్యోగులు. వోటర్ల జాబితాను తాజాపరిచేందుకు, ఎన్నికలు నిర్వహించేందుకు తోడ్పడేందుకు వారు డిప్యుటేషన్‌పై ఇసి కోసం పని చేస్తారు.ఈ అధికారులపై వెంటనే, ఎటువంటి ఆలస్యం లేకుండా, సంబంధిత కేడర్ నియంత్రణ అధికారులు క్రమశిక్షణా చర్యలను ప్రారంభించాలని, ఈ విషయాలను కమిషన్‌కు ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఎన్నికల అధికారి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందిని చక్రవర్తిని ఆదేశించారని ఈసీ అధికారులు తెలిపారు.పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ ఓటర్ల జాబితా సవరణపై ఎన్నికల సంఘం, తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం మధ్య తీవ్ర విభేదాలు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నెల ప్రారంభంలో, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) జాబితాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై కీలకమైన విచారణ సందర్భంగా సుప్రీంకోర్టుకు హాజరయ్యారు. ముఖ్యమంత్రి స్వయంగా హాజరై వాదించడానికి అనుమతి కోరుతూ ఒక మధ్యంతర దరఖాస్తును కూడా దాఖలు చేశారు. ఎన్నికల కమిషన్ అధికారులు శుక్రవారం పశ్చిమ బెంగాల్ ప్రధాన కార్యదర్శి నందిని చక్రవర్తిని కలిశారు. ఎస్ఐఆర్‌లో తప్పు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేయడంతో సహా తన ఆదేశాలను అమలు చేయడానికి పోల్ ప్యానెల్ కొత్త గడువును విధించింది.

ఫిబ్రవరి 17 సాయంత్రం 5.30 గంటల వరకు ఈసీ ఆదేశాలను పాటించడానికి ప్రధాన కార్యదర్శికి సమయం ఇవ్వబడింది అని కమిషన్ అధికారి ఒకరు ఒక పత్రికకు తెలిపారు.

కమిషన్ ఆదేశాల మేరకు ఐదుగురు అధికారులను సస్పెండ్ చేయడానికి బెంగాల్ ప్రభుత్వం నిరాకరించడంతో, గత ఏడాది ఆగస్టులో చక్రవర్తి పూర్వీకుడు మనోజ్ పంత్‌ను పోల్ ప్యానెల్ సమన్లు జారీ చేసింది. ఈ ఐదుగురిపై చట్టబద్ధమైన విధులను నిర్వర్తించడంలో వైఫల్యం, అనధికార వ్యక్తులతో లాగిన్ పాస్‌వర్డ్‌లను పంచుకోవడం ద్వారా డేటా భద్రతా విధానాలను ఉల్లంఘించినట్టు ఆరోపణలు ఉన్నాయి.

## ఏఐ సదస్సుకు శ్రీలంక అధ్యక్షుడు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 (వుదయం):**




ఇండియా ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో పాలు పంచుకునేందుకు శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిశనాయక మంగళవారం భారత్ వస్తున్నట్టు భారత్‌లోని శ్రీలంక హై కమిషనర్ మహిషిని కొలోన్ వెల్లడించారు. గ్లోబల్ సౌత్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక సదస్సుగా దీనిని ఆయన అభివర్ణించారు.

ఈ పర్యటనను ప్రస్తావిస్తూ, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, ఆర్థిక వ్యవస్థలను సమాజాలను పునర్నిర్మిస్తున్న తరుణంలో, భారతశ్రీలంక భాగస్వామ్యం లోతు, ప్రాధాన్యతను రాష్ట్రపతి పాల్గొనడం ప్రతిబింబిస్తుందని కొలోన్ అన్నారు. శ్రీలంక శిఖరాగ్ర సమావేశంలో ఉండటం ఆవిష్కరణలు సమ్మిళితంగా, బాధ్యతాయుతంగా, ప్రజలపై కేంద్రీకృతమై ఉండేలా చూసుకోవడానికి ఉమ్మడి నిబద్ధతను నొక్కి చెబుతుందని రాయబారి ఎక్స్‌పై చేసిన పోస్టులో పేర్కొన్నారు. శిఖరాగ్ర సమావేశానికి హాజరవుతున్న దక్షిణాసియా నాయకులలో ఒకరిగా, అధ్యక్షుడు దిశానాయక పాల్గొనడం ద్వైపాక్షిక సంబంధాల బలాన్ని, భవిష్యత్తు మలచే సమస్యలను పరిష్కరించాలనే ఉమ్మడి సంకల్పాన్ని సూచిస్తుందని ఆమె అన్నారు.

డిసెంబర్ 2024లో రాష్ట్రపతి చేసిన చారిత్రాత్మక రాష్ట్ర పర్యటన , ఉమ్మడి భవిష్యత్తు కోసం భాగస్వామ్యాలను పెంపొందించడం అనే దృక్పథంపై నిర్మించడం ద్వారా, శ్రీలంక భారతదేశ అనుసంధానత, ఆర్థిక వ్యవహారాలు, డిజిటల్ సహకారం, సామర్థ్య నిర్మాణం, ప్రజల నుండి ప్రజల సంబంధాలలో స్థిరమైన ఊపును పొందాయి. దక్షిణాసియా నాయకులలో ఒకరుగా, రాష్ట్రపతి పాల్గొనడం మా సంబంధం సాన్నిహిత్యాన్ని, భవిష్యత్తును రూపొందించే అంశాలపై కలిసి పనిచేయడానికి మా నిబద్ధతను నొక్కి చెబుతుంది. చివరగా, ఆమె మాట్లాడుతూ, సామీప్యతలో పాతుకుపోయి, నమ్మకంతో బలోపేతం అయిన, ఆచరణాత్మక సహకారంతో మార్గనిర్దేశితమైన, భారత శ్రీలంక భాగస్వామ్యం ఉద్దేశ్యంతో అభివృద్ధి చెందుతూనే ఉంటుందని ఆమె అంతిమంగా పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆహ్వానం మేరకు, అనేక మంది దేశాధినేతలు, ప్రభుత్వాధినేతలు ఈ శిఖరాగ్ర సమావేశానికి హాజరు కానున్నారు.

**ఇండియా ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026**

ఇండియాఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 బాధ్యతాయుతమైన ఎఐ పాలన, ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, వాతావరణ స్పృహ కలిగిన సాంకేతికత, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు సమాన ప్రాప్యతపై చర్చను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. బాధ్యతాయుతమైన, ప్రభావవంతమైన ఏఐ కోసం భవిష్యత్తుఆధారిత ఎజెండాను రూపొందించడానికి ఒక కీలకమైన ప్రపంచ వేదికగా ఈ సదస్సును ఊహించారు. ఇది ఆర్థిక వృద్ధి, సామాజిక అభివృద్ధి, ఏఐ స్థిరమైన వినియోగానికి మద్దతు ఇచ్చే స్పష్టమైన ఫలితాలను అందించడానికి ఉన్నత స్థాయి చర్చలకు మించి ముందుకు సాగడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సదస్సును మూడు ప్రధాన స్తంభాల చుట్టూ నిర్మించారు ప్రజలు, పృథ్వి, పురోగతి. ఉపాధి, నైపుణ్యం, స్థిరమైన, ఇంధనసమర్థవంతమైన ఏఐ, ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై దృష్టి సారించే చర్చలు ఇక్కడ సాగుతున్నాయి.

## ఇమ్రాన్‌కు వైద్య సాయం అందించండి

### పాక్ ప్రభుత్వానికి అంతర్జాతీయ మాజీ క్రికెటర్ల విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 (వుదయం):**





మాజీ ప్రధాని, ప్రపంచ కప్ విజేత కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ కు తక్షణ, తగిన వైద్య సహాయం అందించాలని భారత మాజీ క్రికెట్ కెప్టెన్లు సునీల్ గవాస్కర్, కపిల్ దేవ్ సహా పలువురు అంతర్జాతీయ క్రికెట్ ఆటగాళ్లు పాకిస్తాన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

ఫిబ్రవరి 17న విడుదల చేసిన ప్రకటనలో, ఖాన్ నిర్బంధంలో ఉన్న సమయంలో ఆయన కంటి చూపు బాగా క్షీణించిందనే నివేదికలు, అతని నిర్బంధ పరిస్థితులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. క్రికెట్ దిగ్గజాలు మైఖేల్ అథర్టన్, అలన్ బోర్డర్, మైఖేల్ బ్రెయర్లీ, గ్రెగ్ చాపెల్, ఇయాన్ చాపెల్, బెలిండా క్లార్క్, డేవిడ్ గోవర్, కిమ్ హ్యూస్, నాజర్ హుస్సేన్, క్లైవ్ లాయిడ్, స్టీఫెన్ వా, జాన్ రైట్ సంతకం చేసిన వారిలో ఉన్నారు.

పాకిస్తాన్ మాజీ కెప్టెన్, ప్రపంచ క్రికెట్‌లో దిగ్గజమైన ఇమ్రాన్ ఖాన్ చికిత్స, జైలు శిక్ష పరిస్థితుల గురించి తాము తీవ్ర ఆందోళనతో రాస్తున్నామని ప్రకటన పేర్కొంది.

పాకిస్తాన్‌ను 1992 క్రికెట్ ప్రపంచ కప్ చారిత్రాత్మక విజయానికి నడిపించడంలో ఖాన్ నాయకత్వాన్ని మాజీ కెప్టెన్లు గుర్తుచేసుకున్నారు, బలం, క్రీడా స్ఫూర్తి ,సరిహద్దులను అధిగమించిన ప్రేరణపై నిర్మించిన విజయంగా అభివర్ణించారు. రాజకీయ విభేదాలతో సంబంధం లేకుండా, మానవీయంగా వ్యవహరించడానికి, న్యాయమైన చట్టపరమైన ప్రాప్యతకు ఖాన్ అర్హుడని వారు నొక్కి చెప్పారు.

ఫిబ్రవరి 15న ఖాన్ కుడి కంటిలో తీవ్రమైన దృష్టి లోపం ఉన్నట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో వైద్యుల బృందం అతన్ని పరీక్షించిన కొన్ని రోజుల తర్వాత ఈ విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 16కి ముందు వివరణాత్మక వైద్య పరీక్ష నిర్వహించాలని పాకిస్తాన్ సుప్రీంకోర్టు ఆదేశించింది. అధికారులు ఆయనను ఆసుపత్రికి తరలించవచ్చని సూచించినప్పటికీ, వైద్యులు రావల్పిండిలోని అడియాలా జైలును సందర్శించారు. ఖాన్ పార్టీ, పాకిస్తాన్ తెహ్రీక్ఇఇన్సాఫ్, వైద్య పరీక్షలు చేసిన విధానాన్ని ప్రశ్నించింది. ఖాన్ తన కుడి కంటిలో దాదాపు 85 శాతం దృష్టిని కోల్పోయాడని పేర్కొన్నట్లు పార్టీ న్యాయవాది నివేదించారు. 2018 నుండి 2022 వరకు ప్రధానమంత్రిగా పనిచేసిన ఖాన్, ఆగస్టు 2023 నుండి జైలు శిక్ష అనుభవిస్తున్నారు. రాజకీయంగా ప్రేరితమని ఆయన ఆరోపిస్తున్న పలు కేసులను ఎదుర్కొంటున్నారు. ఆయనకు సాధ్యమైనంత ఉత్తమమైన వైద్య సంరక్షణ లభించేలా చూడాలని మాజీ సహచరుడు వసీం అక్రమ్ గతంలో అధికారులను కోరారు.

## మండుటెండల్లో తమిళనాడు, బెంగాల్ ఎన్నికలు?

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 (వుదయం):**




ఒకవైపు మమతా బెనర్జీ ఎన్నికల కమిషన్ తుగ్లక్ వేషాలు వేస్తూ, లక్షలాది ఓటర్లను జాబితా నుంచి తొలగించిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ఎఐ ఉపయోగించి 58లక్షలమంది ఓటర్లను తొలగించిందని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల కమిషన్‌కు తుగ్లక్ కమిషన్ అని ఆమె కొత్తగా నామకరణం చేశారు. అయితే, ఇదే సమయంలో పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలను ఏప్రిల్‌లో నిర్వహించే అవకాశం ఉన్నట్లు కమిషన్ వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు రాష్ట్రాలతో పాటు అస్సాం, కేరళ, పుదుచ్చేరిలలో ఒకేసారి పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్ ను మార్చి మధ్యలో ఈసీ విడుదల చేసే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల సన్నద్ధతను అంచనా వేయడానికి ఈసీ అధికారులు ఇప్పటికే పర్యటన ప్రారంభించారు. ప్రస్తుతం అస్సాంలో ఉన్నారు.

పుదుచ్చేరి అసెంబ్లీ పదవీకాలం జూన్ 15న ముగుస్తుండగా.. అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌ల పదవీకాలాలు మేలో ముగుస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లో ఈసీ నిర్వహిస్తోన్న ఎస్ఐఆర్ ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది. పుదుచ్చేరి ఓటర్ల తుది జాబితాను ఫిబ్రవరి 14న ప్రచురించింది. తమిళనాడు తుది జాబితాను నేడు విడుదల చేయనుంది. అస్సాంలో ఫిబ్రవరి 10న, కేరళలో ఫిబ్రవరి 21న, పశ్చిమ బెంగాల్లో ఫిబ్రవరి 28న తుది జాబితాలు విడుదలకానున్నాయి.

## రెహమాన్ ప్రమాణ స్వీకారం జమాత్ బాయ్‌కాట్

**ఢాకా, ఫిబ్రవరి 17 (వుదయం):**

బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) నేతృత్వంలో జరిగిన కేబినెట్ ప్రమాణ స్వీకారాన్ని బంగ్లాదేశ్ జమాత్‌ఎఇస్లామీ బాయ్ కాట్ చేస్తున్నట్టు పేర్కొంది. తమ మిత్రపక్షమైన నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సిపి) తాము ఆ కార్యక్రమానికి దూరంగా ఉంటామని ప్రకటించిన కొద్ది సేపటికి జమాత్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కార్యక్రమానికి హాజరుకావద్దని పార్లమెంటరీ కమిటీ సమావేశంలో పార్టీ నిర్ణయించుకుందని జమాత్ నాయకుడు షఫీకుల్ ఇస్లామ్ మసూద్ తెలిపారు. రాజ్యాంగ సంస్కరణ మండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయడానికి బిఎన్‌పి నిరాకరించినందుకు నిరసనగా జమాత్ ఈ కార్యక్రమానికి హాజరు కాకూడదని నిర్ణయించిందని ఆయన అన్నారు. ఈ బహిష్కరణ ఇరు పార్టీల మధ్య ఉద్రిక్తతలను అకస్మాత్తుగా పెంచింది. ఒకప్పుడు చాలా కాలం మిత్రపక్షాలుగా ఉన్నప్పటికీ, బలహీనమైన పరిస్థితుల నడుమ ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఇప్పుడు అసౌకర్య ప్రత్యర్థులుగా మారారు. మంగళవారం మొదట, అధ్యక్షుడు మొహమ్మద్ షాబుద్దీన్ కొత్తమంత్రివర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు, ఆ పార్టీ పార్లమెంటరీ మెజారిటీని సాధించిన తర్వాత బిఎన్‌పి చైర్మన్ తారిక్ రెహమాన్‌ను ప్రధానమంత్రిగా అధికారికంగా నియమించారు.

**రాజ్యాంగ సంస్కరణలపై వివాదం**

ప్రతిపాదిత రాజ్యాంగ సంస్కరణల మండలికి కూడా రెండవ ప్రమాణ స్వీకారం చేయాలన్న వాదన నుంచి ఈ విభేదం ఏర్పడింది. జులై చార్టర్ కింద సమూల మార్పులను పార్లమెంటు సభ్యులు అమలు చేసేందుకు కట్టుబడి ఉండేలా ఈ ప్రమాణ స్వీకారం ఉద్దేశించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎఎంఎం నసీరుద్దీన్ తొలి దశలో బిఎన్‌పి ఎంపీల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ క్రమంలో జమాత్ తర్వాత ఉంది. కాగా, బిఎన్‌పి అదనపు ప్రమాణం చేసేందుకు నిరాకరించడంతో పరిస్థితి కొంత జటిలంగా మారింది. బిఎన్‌పి ఎంపీలు రాజ్యాంగ సంస్కరణ మండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయనంత వరకూ తాము కూడా ప్రమాణ స్వీకారం చేయమని జమాత్ డిప్యూటీ చీఫ్ అబ్దుల్లా మహమ్మద్ తాహెర్ అన్నారు. రాజ్యాంగ సంస్కరణ లేకుండా పార్లమెంటు అర్థరహితమని ఆయన వాదించారు. కాగా, తాము రాజ్యాంగ సంస్కరణ మండలి సభ్యులుగా ఎన్నిక కాలేదని, మండలి నిర్దేశించిన ఏ నిబంధనను ఇంకా రాజ్యాంగంలో పొందు పరచలేదని బిఎన్‌పి స్టాండింగ్ కమిటీ సభ్యుడు సలాహుద్దీన్ అహ్మద్ అన్నారు. తారిక్ రెహమాన్ ఆదేశాల మేరకు బిఎన్‌పి ఎంపీలు ఎవరూ రెండవ సారి ప్రమాణం చేయరన్నారు. దాదాపు 1200మంది దేశీ, విదేశీ అతిథులు పాల్గొంటున్న కార్యక్రమంలో పాల్గొనకుండా నిరసన తెలపాలని జమాత్ నిర్ణయించుకోవడంతో ఆ ఆశలు ఇప్పుడు అణగారినట్టు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ అతిథుల్లో, భారత్ తరుపున ఓం బిర్లా, మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు, ఇతర ప్రాంతీయ గౌరవ అతిథులు ఉన్నారు.

బంగ్లాదేశ్ రాజ్యాంగం ప్రకారం, మెజారిటీ పార్టీ నాయకుడిని ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు రాష్ట్రపతి ఆహ్వానించి, ప్రమాణ స్వీకారం చేయిస్తాడు. బిఎన్‌పి అఖండ విజయాన్ని సాధించినప్పటికీ, జమాత్‌తో ఈ వివాదం ముందు ముందు అది అనుసరించవలసిన మార్గం ఎంత సున్నితంగా ఉంటుందో సూచిస్తోంది.






## వీడ్కోలు ప్రసంగంలో కూడా భారత్‌పై విషం

**ఢాకా, ఫిబ్రవరి 17 (వుదయం) :**



తన వీడ్కోలు ప్రసంగంలోకూడా, పదవీ విరమణ చేస్తున్న బంగ్లాదేశ్ తాత్కాలిక సలహాదారు ముహమ్మద్ యూనస్ భారతదేశంపై రెచ్చగొట్టే వ్యాఖ్యలను కొనసాగించాడు. సున్నితమైన ఈశాన్య ప్రాంతాన్ని లేవనెత్తాడు. ఈ సమస్య అతని 18 నెలల పాలనలో ఇరు దేశాల మధ్య సంబంధాలను దెబ్బతీసింది. జాతీయవాద వాక్చాతుర్యంతో నిండిన 25 నిమిషాల ప్రసంగంలో, బంగ్లాదేశ్ సముద్రం ద్వారా సెవెన్ సిస్టర్స్ అని పిలిచే ఈశాన్య ప్రాంతానికి భారీ ఆర్థిక సామర్థ్యాన్ని అందించగలదని యూనస్ నొక్కి చెప్పాడు.

గత సంవత్సరం చైనా పర్యటన సందర్భంగా యూనస్ భారతదేశం గురించి ప్రస్తావించకుండా సెవెన్ సిస్టర్స్ గురించి మాట్లాడటం న్యూఢిల్లీని మరింత చికాకుపెడుతోంది. సెవెన్ సిస్టర్స్‌ను ఒక ప్రత్యేక ప్రాంతంగా చిత్రీకరించే ప్రయత్నంగా ఇది కనిపిస్తుంది. భారతదేశం ఎప్పుడూ తన భూభాగాల్లో విదేశీ జోక్యాన్ని తిప్పికొడుతుంది. కానీ, బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేక భావన పెంచిన నేపథ్యంలో యూనస్ తన రెచ్చగొట్టే చర్యలను కొనసాగించాడు.

**భారత ఈశాన్య ప్రాంతం గురించి యూనస్ ఏమన్నాడు?**

సెవెన్ సిస్టర్ రాష్ట్రాలు, నేపాల్ భూటాన్‌ల ఆర్థిక శ్రేయస్సుకు దోహదం చేసే సంభావ్యత బంగ్లాదేశ్‌కు ఉంది. మన సముద్రాలు సరిహద్దులు కావు, అవి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ద్వారాలు అని యూనస్ పేర్కొన్నాడు. ఈ వ్యాఖ్యను భారతదేశంలోని భూపరివేష్టిత ఈశాన్య రాష్ట్రాలను కలిపి బంగ్లాదేశ్‌ను ఈ ప్రాంతం ముఖద్వారంగా ఉంచడానికి యూనస్ చేసిన ప్రయత్నంగా భావిస్తున్నారు.గత ఏడాది చైనా పర్యటనకు వెళ్లిన సందర్భంగా యూనస్ ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన భారతదేశానికి చెందిన ఈశాన్య ప్రాంతాన్ని పరివేష్ఠితంగా అభివర్ణిస్తూ, ఆ ప్రాంతంలో చైనా తన నియంత్రణను విస్తరించాలని పిలుపిచ్చాడు. ఆయన వ్యాఖ్యలకు విదేశాంగ మంత్రి జయశంకర్, ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులు తీవ్రంగా స్పందించారు.

హింస, మీడియా సంస్థలను లక్ష్యంగా చేసుకోవడం, హిందువులపై దాడులు వంటి హింసాత్మక సంఘటనలతో కూడిన తాత్కాలిక చీఫ్‌గా యూనస్ స్వదేశంలో విమర్శలు ఎదుర్కొంటున్న తరుణంలో ఈ వ్యాఖ్యలు వచ్చాయి. సంక్షోభ సమయాల్లో బంగ్లాదేశ్‌కు ఎప్పుడూ మిత్రుడిగా ఉన్న భారతదేశాన్ని దూరం చేయడం ద్వారా నోబెల్ గ్రహీత చైనా, పాకిస్తాన్‌లతో స్నేహం పెంచుకునే ప్రయత్నం చేశాడు.

**చైనా గురించి యూనస్ ఏమన్నాడు?**

నిజానికి, ఆయన వీడ్కోలు ప్రసంగంలో చైనా ప్రముఖంగా కనిపించింది. యూనస్ వ్యూహాత్మక సమతుల్యత అవసరాన్ని నొక్కిచెప్పారు. బీజింగ్‌తో సంబంధాలను మరింతగా పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా, తీస్తా నది పునరుద్ధరణ ప్రాజెక్టు గురించి కూడా ఆయన ప్రస్తావించారు. వ్యూహాత్మకంగా ముఖ్యమైన చికెన్స్ నెక్ లేదా సిలిగురి కారిడార్‌కు ఇది దగ్గరగా ఉన్నందున భారతదేశం ఈ చైనా మద్దతుతో నిర్మితమవుతున్న ప్రాజెక్టు పట్ల అప్రమత్తతో ఉంది. చైనాతో సహకారాన్ని కూడా పెంచుకున్నాము. తీస్తా నది ప్రాజెక్టు, నీల్ఫమారిలో 1,000 పడకల అంతర్జాతీయ ఆసుపత్రిలో గణనీయమైన పురోగతి సాధించాం, అని యూనస్ అన్నారు.

వాస్తవానికి, జనవరిలో, యూనస్ ప్రభుత్వం భారతదేశం భావనలను విస్మరించి, చైనా రాయబారి, అధికారులను ప్రాజెక్ట్ సైట్‌ను సందర్శించడానికి అనుమతించింది. పదవీ విరమణ చేసే ముందు, యూనస్ బంగ్లాదేశ్ ఇకపై లొంగి ఉండే దేశం కాదని నొక్కిచెప్పారు. ఇది భారత దేశాన్ని ఉద్దేశించిన చేసిన వ్యాఖ్య అన్నది నిర్వివాదం. షేక్ హసీనా హయాంలో బంగ్లాదేశ్ విదేశాంగ విధానం భారత దేశం ముద్రను కలిగి ఉందని యూనస్ ప్రభుత్వంలో ఉన్న అభిప్రాయం నడుమ ఈ వ్యాఖ్య వచ్చింది. నేటి బంగ్లాదేశ్ తన స్వతంత్ర ప్రయోజనాలను కాపాడుకోవడంలో నమ్మకంగా, చురుకుగా, బాధ్యతాయుతంగా ఉంది. బంగ్లాదేశ్ ఇకపై లొంగిపోయే విదేశాంగ విధానం కలిగిన దేశం కాదు లేదా ఇతర దేశాల సూచనలు, సలహాలపై ఆధారపడిన దేశం కాదు అని ఆయన అన్నారు.

**భారత్ ఎలా స్పందించింది?**

యూనస్ వ్యాఖ్యలకు భారత్ ఇప్పటి వరకూ స్పందించకపోయినప్పటికీ, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది మహేష్ జెఠ్మలానీ మాత్రం నోబెల్ గ్రహీత పై విరుచుకుపడ్డారు. బంగ్లాదేశ్‌ను స్థిరీకరించడంలో తన వైఫల్యాన్ని కప్పి పుచ్చుకునేందుకు భారత్‌ను బహిర్గత శత్రువుగా చూపే ప్రయత్నం చేస్తున్నాడని ఆయన ఆరోపించారు.

ఆయన గత ఉపన్యాసంలో కూడా, అనవసరంగా భారత్‌పై అనవసరం వ్యాఖ్యలు చేస్తూ, ప్రధాన వార్తా స్రవంతిలో సుపరిచితమైన సార్వభౌమాధికారం/ గౌరవం వంటి మాటలను నాటుతూ, భారతదేశ ఈశాన్య ప్రాంతాలు, సెవెన్ సిస్టర్స్ భారత్‌లో భాగమని చెప్పకుండా, వాటి గురించి మోసపూరితంగా, నక్కజిత్తుల ప్రస్తావనలను జల్లుకున్నాడు అని జెఠ్మలానీ ట్వీట్ చేశారు. యూనస్ భారతదేశం గురించి ప్రస్తావించకుండా సెవెన్ సిస్టర్స్ గురించి ప్రస్తావించడం, అదే సందర్భంలో భూటాన్ , నేపాల్‌లను సార్వభౌమ దేశాలుగా ప్రస్తావించడం అన్నది ఆ వ్యక్తి అతని చుట్టూ ఉన్న వారి ప్రమాదకరమైన మనస్తత్వాన్ని వెల్లడిస్తుంది అని భారత మాజీ విదేశాంగ కార్యదర్శి కన్వల్ సిబల్ అన్నారు.

ఇప్పుడు, భారతదేశం, బంగ్లాదేశ్ మధ్య సంబంధాలను తిరిగి పునరుజ్జీవింపచేయాలని పలువురు ఎదురు చూస్తున్నందున, అందరి దృష్టి కొత్త ప్రధాన మంత్రి తారిక్ రెహమాన్ పై ఉంది.


**దక్షిణ మధ్య రైల్వే**

మమ్మల్ని అనుసరించండి @SCRailwayIndia ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల యొక్క వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

PUB/1954

**టెండర్ ప్రకటన నం. BZA-GSU -Elec-32-2025-26, తేది: 09-02-2026 (ireps.gov.in ద్వారా)**

దిగువ పనుల కోసం భారత రాష్ట్రపతి తరపున చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్, గతిశక్తి, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ వారు ఓపెన్ టెండర్ /సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండరు కోరుచున్నారు.

**క్ర.సం.:** 1. **టెండర్ నం.:** BZA-GSU-Elec-32-2025-26, తేది: 09-02-2026. **పని వివరణ: విజయవాడ డివిజన్** - క్రొత్త 12m FOBల కోసం అమృత్ భారత్ స్టేషన్ల [TEL(3), GDV(3), TDD(2), GALA(2)] వద్ద ప్యాసింజర్లకు సదుపాయాలు కల్పించేందుకు 10 నం.ల లిఫ్టుల డిజైన్, తయారీ, సరఫరా, స్థాపన మరియు పనిచేయించుట. **టెండరు విలువ(రూ.):** 2,76,21,220.00, **బయానా(రూ.):** 2,88,100.00, **పూర్తిచేయు కాలము:** 270 రోజులు. **టెండరు ఫారం ధర(రూ.):** లేదు. **ముగింపు తేది & సమయం:** 06-03-2026న 15:00 గం.ల వరకు

1. బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కోసం వెబ్‌సైట్ **https://ireps.gov.in**కు లాగిన్ అవ్వండి.
2. బయానా చెల్లింపును IREPSలో ఆన్‌లైన్‌లో లభించే నెట్‌బ్యాంకింగ్ /పేమెంట్ గేట్‌వే సదుపాయాల ద్వారా మాత్రమే చెల్లించవలెను (లేదా) PFA/Con/SC పేరున బిడ్స్ సెక్యూరిటీ నిమిత్తం బ్యాంక్ గ్యారంటీని దాఖలు చేయవలెను.
3. టెండరుదారులు తమ ఆఫర్లను టెండరు దాఖలు/బిడ్డింగ్ వ్యవధి సమయంలో ఆన్‌లైన్‌లో దాఖలు చేయవలెను. ఇది టెండరు ముగింపుకు పదిహేను రోజులు ముందు ఉంటుంది.
4. టెండరుదారులు ఏవేని సవరణల(ఆన్‌లైన్‌లో మాత్రమే జారీచేసినవి) కోసం టెండరు దాఖలు/బిడ్డింగ్ వ్యవధి ప్రారంభ తేది వరకు గమనించవలెను.

**డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, గతిశక్తి, విజయవాడ**

PUB/1955

**టెండర్ ప్రకటన నం. BZA-GSU -Elec-34-2025-26, తేది: 10-02-2026 (ireps.gov.in ద్వారా)**

దిగువ పనుల కోసం భారత రాష్ట్రపతి తరపున చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ , గతిశక్తి, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ వారు ఓపెన్ టెండర్ /సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండరు కోరుచున్నారు.

క్ర.సం.: 1. **టెండర్ నం.:** BZA-GSU-Elec-34-2025-26, తేది: 10-02-2026. **పని వివరణ:** విజయవాడ డివిజన్ - కొవ్వూరు రైల్వే స్టేషన్ వద్ద ప్రతిపాదిత స్టేషన్ భవనం మరియు ప్లాట్‌ఫారమ్ షెల్టర్ల(COP) కోసం విద్యుత్ సదుపాయాల ఏర్పాటు. **టెండరు విలువ(రూ.):** 1,75,94,400.86, **బయానా(రూ.):** 2,38,000.00, **పూర్తిచేయు కాలము:** 9 నెలలు. **టెండరు ఫారం ధర(రూ.):** లేదు. **ముగింపు తేది & సమయం:** 06-03-2026న 15:00 గం.ల వరకు

1. బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కోసం వెబ్‌సైట్ **https://ireps.gov.in**కు లాగిన్ అవ్వండి.
2. బయానా చెల్లింపును IREPSలో ఆన్‌లైన్‌లో లభించే నెట్‌బ్యాంకింగ్ /పేమెంట్ గేట్‌వే సదుపాయాల ద్వారా మాత్రమే చెల్లించవలెను (లేదా) PFA/Con/SC పేరున బిడ్స్ సెక్యూరిటీ నిమిత్తం బ్యాంక్ గ్యారంటీని దాఖలు చేయవలెను.
3. టెండరుదారులు తమ ఆఫర్లను టెండరు దాఖలు/బిడ్డింగ్ వ్యవధి సమయంలో ఆన్‌లైన్‌లో దాఖలు చేయవలెను. ఇది టెండరు ముగింపుకు పదిహేను రోజులు ముందు ఉంటుంది.
4. టెండరుదారులు ఏవేని సవరణల(ఆన్‌లైన్‌లో మాత్రమే జారీచేసినవి) కోసం టెండరు దాఖలు/బిడ్డింగ్ వ్యవధి ప్రారంభ తేది వరకు గమనించవలెను.

**డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, గతిశక్తి, విజయవాడ**

PUB/1956

**టెండర్ ప్రకటన నం. BZA-GSU -Elec-35-2025-26, తేది: 09-02-2026 (ireps.gov.in ద్వారా)**

దిగువ పనుల కోసం భారత రాష్ట్రపతి తరపున చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్, గతిశక్తి, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ వారు ఓపెన్ టెండర్ /సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండరు కోరుచున్నారు.

**క్ర.సం.:** 1. **టెండర్ నం.:** BZA-GSU-Elec-35-2025-26, తేది: 09-02-2026. **పని వివరణ: విజయవాడ డివిజన్** -గతిశక్తి - 16 LCGల (లెవెల్ క్రాసింగ్ గేట్లు) (GDR-BZA-VSKP) కోసం విజయవాడ డివిజన్‌లోని రోడ్ ఓవర్ బ్రిడ్జి ప్రతిపాదిత నిర్మాణం కొరకు 25 KV కన్వెన్షనల్ టైప్ రెగ్యులేటెడ్ OHE కు ప్రత్యామ్నాయాలు. **టెండరు విలువ(రూ.):** 3,76,88,914.00, **బయానా(రూ.):** 3,38,500.00, **పూర్తిచేయు కాలము:** 12 నెలలు. **టెండరు ఫారం ధర(రూ.):** లేదు. **ముగింపు తేది & సమయం:** 06-03-2026న 15:00 గం.ల వరకు

1. బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కోసం వెబ్‌సైట్ **https://ireps.gov.in**కు లాగిన్ అవ్వండి.
2. బయానా చెల్లింపును IREPSలో ఆన్‌లైన్‌లో లభించే నెట్‌బ్యాంకింగ్ /పేమెంట్ గేట్‌వే సదుపాయాల ద్వారా మాత్రమే చెల్లించవలెను (లేదా) PFA/Con/SC పేరున బిడ్స్ సెక్యూరిటీ నిమిత్తం బ్యాంక్ గ్యారంటీని దాఖలు చేయవలెను.
3. టెండరుదారులు తమ ఆఫర్లను టెండరు దాఖలు/బిడ్డింగ్ వ్యవధి సమయంలో ఆన్‌లైన్‌లో దాఖలు చేయవలెను. ఇది టెండరు ముగింపుకు పదిహేను రోజులు ముందు ఉంటుంది.
4. టెండరుదారులు ఏవేని సవరణల(ఆన్‌లైన్‌లో మాత్రమే జారీచేసినవి) కోసం టెండరు దాఖలు/బిడ్డింగ్ వ్యవధి ప్రారంభ తేది వరకు గమనించవలెను.

A2486 **డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, గతిశక్తి, విజయవాడ**

**తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.inను దర్శించండి.**




"నా సారధ్యంలోని తాత్కాలిక ప్రభుత్వం బంగ్లాదేశ్ సార్వభౌమాధికారాన్ని, జాతీయ ప్రయోజనాలను, విదేశాంగ విధానంలో గౌరవనీయమైన స్థానాన్ని పునరుద్ధరించింది. షేక్ హసీనా పాలనలో మాదిరిగా ఇతర దేశాలకు లొంగి ఉండే లేదా వారి ఆదేశాలు సలహాలపై ఆధారపడే విదేశీ విధానాన్ని బంగ్లాదేశ్ ఇక ఎంతమాత్రం పాటించదు. నేటి బంగ్లాదేశ్ ఆత్మవిశ్వాసంతో కూడుకున్నది, చురుకైనది. తన స్వతంత్ర ప్రయోజనాలను కాపాడుకోవడంలో బాధ్యతాయుతమైన అడుగులు వేయగలిగే స్థితిలో ఉన్నది. ఇండియాలోని ఏడుగురు అక్కాచెల్లెళ్లు అని పరిగణన పొందుతున్న ఈశాన్య రాష్ట్రాలతోపాటు నేపాల్, భూటాన్లు కలిసిన ఈశాన్య ప్రాంత ఆర్థిక పురోగతికి బంగ్లాదేశ్ భారీ అవకాశాలను కల్పించగలదు."

**- ముహమ్మద్ యూనస్, బంగ్లాదేశ్ మాజీ తాత్కాలిక అధినేత**

## వే'మన'పద్యం

**చెప్పులోని రాయి చెవిలోన జోరీగ**
**కంటిలోని నలుసు కాలిముల్లు**
**ఇంటిలోనిపోరు నింతింత గాదయా**
**విశ్వదాభిరామ! వినురవేమ**



## సంపాదకీయం

# ఇరాన్‌తో చర్చలు : ట్రంప్ బలగర్వం

జెనీవాలో అమెరికా –ఇరాన్‌ల మధ్య మంగళవారం నాడు జరిగిన పరోక్ష చర్చలు నిర్మాణాత్మకంగా జరిగాయాని, తన అణు కార్యక్రమం మీద తదుపరి చర్చలు జరుపడానికి వీలుగా సాధారణ మార్గదర్శక సూత్రాలపై అంగీకారం కుదిరిందని ఇరాన్ ప్రకటించడంతో ప్రపంచం కొంచెం ఊపిరి పీల్చుకున్నది. అయితే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీరు ఆందోళనకు గురి చేస్తున్నది. ఆయన ప్రపంచాన్ని తన చేతిలోని మైనపు ముద్దను చేసుకొని చాలా రోజులయ్యింది, దేశాల మధ్య సంబంధాలను ఐక్యరాజ్య సమితి గాని, మరే అంతర్జాతీయ వేదిక గాని నిర్దేశించజాలదని, తన ఆజ్ఞ లేనిదే గాలి కూడా రెక్క విప్పజాలదని ట్రంప్ శాసిస్తున్నాడు. సువిశాల మార్కెట్ గల ఇండియాను కూడా వదిలిపెట్టలేదు. ఇప్పుడు ఇరాన్ తో చర్చలంటూ అమెరికా చేస్తున్న హడావిడి, హంగామా అంతా ట్రంప్ ఆడుతున్న మరో నాటకమే. రెండు పక్షాలు చర్చలకు కూర్చునే ముందు ముగింపు తాను కోరుకున్నట్టే ఉండాలని లేకపోతే ఖబడ్దార్ అంటూ హుంకరించడం ఆ చర్చలనిష్ప్రాక్షికతకే గొడ్డలిపెట్టు. ఇటువంటివేవీ ట్రంప్ చెవులకు ఎక్కని నీతులే. జెనీవాలో మంగళవారం నాడు మొదలైన –చర్చలకు ముందు ట్రంప్ తన ఎయిర్ ఫోర్స్ వన్ లో మీడియాతో మాట్లాడుతూ ఈ సారైనా ఇరాన్ ఒళ్ళు దగ్గరపెట్టుకుని వ్యవహరిస్తుందని ఆశిస్తున్నా నని అన్నారు.అది రాజీలేని వైఖరిని అవలంబిస్తే తగిన సమాధానాన్ని చవి చూస్తుందని, గతంలో చర్చల వైఫల్యం తో ఇరాన్ అణు సదుపాయాలు లక్ష్యంగా తాము చేసిన దాడులను ట్రంప్ గుర్తుచేశాడు. ఈ చర్చల్లో తాను పరోక్షంగా పాల్గొంటానన్న ట్రంప్ ఒప్పందానికి సిద్ధం కాకపోతే జరిగేది ఏమిటో వారికి తెలుసు అని ట్రంప్ అన్నాడంటే ఇరాన్ మెడలు వంచడమే తన ఉద్దేశమని ప్రపంచానికి తెలియజేశాడన్న మాట.చర్చల్లో ఇరాన్ ను బెదిరించడానికి అనువుగా గత కొద్దివారాలుగా అమెరికా ఆ ప్రాంతాన్ని తన ఆయుధ బలగర్వంతో హోరెత్తిస్తున్నది. ఆమెరికా యుద్ధ విమాన వాహక నౌక యు ఎస్ ఎస్ అబ్రాహాం లింకన్ ను ఇరాన్ పరిసర జలాల్లోకి ట్రంప్ పంపించాడు.ఇంకా ప్రపంచంలోనే అతి పెద్ద యుద్ధనౌక యు ఎస్ ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ ను సైతం మధ్య ఆసియా కు పంపించింది.వచ్చే కొద్ది వారాల్లో యుద్ధ రంగంలో దిగేటట్టు దానిని ఉంచింది. జరుగుతున్నవి క్రమశిక్షణాయిత చర్చలే అయితే యుద్ధ సన్నద్ధత, ఆయుధాల భారీ మోహరింపు అవసరం ఏముంది? టేబుల్ మీద దట్టించిన రివాల్వర్ ను ఉంచి ప్రత్యర్థులతో ఆలింగనం చేసుకోడంలో అర్థం ఏముంటుంది? ఒమన్ దౌత్యంతో ప్రస్తుతం జరుగుతున్న ఈ చర్చల్లో ఇరాన్‌ను అణ్వాయుధ నిర్మాణ యత్నాల నుంచి విరమింప జేయడంలో ఎంతవరకు సఫలమవుతుందో చూడాలి. అలాగే అమెరికా ఆంక్షలను తొలగింపజేసుకోడంలో ఇరాన్ ఏ మేరకు కృతకృత్యురాలు అవుతుందో? అమెరికా ఆంక్షల నుంచి ఇరాన్ కు ఊరట కలిగించడానికి ప్రతిగా దాని అణు కార్యక్రమాన్ని నీరు గార్పించేందుకు 2015లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బరక్ ఒబామా అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్,చైనా రష్యా,జర్మనీ లను వెంటబెట్టుకొని కుదిర్చిన చరిత్రాత్మక ఒప్పందాన్ని రద్దు చేసిన ట్రంప్ ఇరాన్ ను అంకుశంతో ఆడించాలని కోరుకుని అదే పనిచేస్తున్నాడు. ట్రంప్ ఇప్పుడు తనపై ఎక్కుబెట్టిన ఆయుధాలు బెడిసికొట్టి అమెరికా యే భంగపడవచ్చని ఇరాన్ అధినేత అలి ఖమేని చేసిన హెచ్చరిక గమనించదగినది. ఎంతటి వారైనా ఎల్లకాలం పైచేయి కాలేరు.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

## బంగ్లా నూతన ప్రధాని తారిక్ రెహమాన్

బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ చైర్మన్ తారిక్ రెహమాన్ మంగళవారం బంగ్లాదేశ్ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. బిఎన్‌పి పార్లమెంటరీ పార్టీ తమ నాయకుడిగా రెహమాన్‌ను ఎన్నుకుని, ఆయనకు మార్గాన్ని సుగమం చేసింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో బిఎన్‌పి 297 స్థానాలకు గాను 209 స్థానాలను సాధించగా, ఒకప్పటి దాని మిత్రపక్షమైన జమాత్-ఎ-ఇస్లామీ, ప్రస్తుత దాని ప్రధాన ప్రత్యర్థి 68 స్థానాలను సాధించింది. పదవచ్యుతురాలైన షేక్ హసీనాకు చెందిన



అవామీ లీగ్‌ను ఎన్నికలలో పోటీ చేయడం నుంచి నిషేధించారు. రెహమాన్‌తో పాటుగా 25మంది మంత్రులు, 24మంది సహాయ మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. దీనితో బిఎన్‌పి కేబినెట్‌లో 50 మంది మంత్రులు, ముగ్గురు టెక్నోక్రాట్లు ఉన్నారని ప్రథొమ్ ఆలో పేర్కొంది. మొత్తం 25మంది మంత్రులలో 17 కొత్త ముఖాలు కాగా, సహాయ మంత్రులందరూ కూడా ఆ పదవిని తొలిసారి నిర్వహిస్తున్నవారే. ప్రధాని రెహమాన్ కూడా కేబినెట్ సభ్యుడు కావడం ఇదే తొలిసారి. ప్రమాణ స్వీకారోత్సవంలో భారత్ ప్రతినిధిగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పాల్గొన్నారు. బిర్లా మంగళవారం ఉదయం ఢాకాకు చేరుకున్నారు. ఆయనతో పాటు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ, ఇతర అధికారులూ కూడా ఉన్నట్టు పిటిఐ వార్తా ఏజెన్సీ పేర్కొంది. ఆయనకు బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి నజ్రుల్ ఇస్లామ్ స్వాగతం పలికారు. ఇది చాలా ముఖ్యమైన క్షణమని, ఇది ప్రజల మధ్య సంబంధాలను, భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య పంచుకున్న ప్రజాస్వామిక విలువలను బలోపేతం చేస్తుందని ఆయన అన్నారు. రెహమాన్ విజయంపై అందరికన్నా మొదటగా అభినందనలు తెలిపిన ప్రధాని నరేంద్ర మోడీకి ఆహ్వానం పంపారు. అయితే, మంగళవారం నాడు ముంబైలో ఫ్రెంచి అధ్యక్షుడు ఇమ్మాన్యువల్ మాక్రోన్‌తో చర్చలలో ఆయన పాల్గొనవలసి ఉంది. బంగ్లాదేశ్ తాత్కాలిక నాయకుడు యూనస్ సోమవారం నిష్క్రమించారు. 2024లో షేక్ హసీనాను పదవీచ్యుతురాలిని చేసినప్పటి నుంచీ తాత్కాలిక ప్రభుత్వమే దేశాన్ని నడిపిస్తోంది. రెహమాన్ ప్రమాణ స్వీకారం చేసిన జాతీయ సంసద్ భవన్ వద్ద గరిష్ఠ భద్రత కల్పించాలని బంగ్లాదేశ్ హోం మంత్రిత్వ శాఖ పోలీసు సిబ్బందితో పాటు సంబంధిత అధికారులను ఆదేశించిందని ఆ దేశ ప్రభుత్వ యాజమాన్యంలోని వార్తా సంస్థ నివేదించింది.

# వాస్తవాలు చెబుతున్నదెవరు?

రైతులు నిజంగా అమాయకులే, ముల్లుగర్రతో ఎద్దుముడ్డి మీద పొడవటం తప్పఏమీ తెలియదు,(కొంత మందికి ఇప్పుడు ఎద్దులతో సాగు చేస్తారని తెలియదు, వాటి స్థానంలో ట్రాక్టర్లు, ఇతర పరికరాలు వచ్చాయి) ఏం చెప్పినా తలూపుతారన్న గట్టి విశ్వాసం లేకపోతే మన వాణిజ్యశాఖ మంత్రి పియూష్ గోయల్ అలా ఎందుకు మాట్లాడతారు. అమెరికా మన దేశంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం మన ఎగుమతులపై 18శాతం దిగుమతి పన్ను విధిస్తారు. అదే బంగ్లాదేశ్‌తో చేసుకున్న అవగాహన ప్రకారం దిగుమతి చేసుకొనే దుస్తులపై అమెరికా ఎలాంటి పన్ను విధించదు. ఈ అంశం మన దేశ వస్త్రపరిశ్రమ,వాణిజ్యవేత్తలలో ఆందోళనకు గురిచేసింది. దాంతో కేంద్ర మంత్రి రంగంలోకి దిగారు.మనకూ అలాంటి సౌకర్యం ఉందన్నారు. ఉంటే అమెరికా జారీ చేసిన ప్రకటనలో ఆ వివరం ఎందుకు లేదు ! అదంతే,మనకా రాయితీ ఎలా వస్తుందంటే మనం కూడా అమెరికా పత్తి దిగుమతి చేసుకుంటే ఎలాంటి పన్నులూ ఉండవని, ఈ అంశాన్ని సంతకాల సమయానికి ఒప్పందంలో భాగంగా చేర్చుతామని చెప్పారు. ఖాళీ చెక్కు మీద సంతకం చేసినపుడు ఎంతమొత్తమైనా రాసుకోవచ్చు. అమెరికాతో అలాంటి అవగాహనకు వచ్చినందున ఇంకా ఇలాంటి వాటిని మరెన్నింటిని చేర్చుతారో ! ఆ నిబంధన రైతాంగానికి నష్టం కదా అంటే కాదని సెలవిచ్చారు. ఎందుకటా, అమెరికాలో పత్తి పరిమితంగానే పండుతుంది గనుక అన్నారు. ఎప్పటికెయ్యది అప్పటికా మాటలాడి తప్పించుకు తిరిగేందుకు చూస్తున్నారు గనుకనే అడుగడుగునా అనుమానించాల్సిందే. ప్రభుత్వంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తగా పియూష్ గోయల్ కూడా అదే స్థాయిలో విరుచుకుపడ్డారు. ముందు ఎవరేం చెప్పారో ? చూద్దాం !

అమెరికాతో కుదిరిన ఒప్పందంతో వచ్చే ముప్పు గురించి అనేక రైతు సంఘాల ప్రతినిధులు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని కలిసి దానిపై గళమెత్తాలని కోరారు. అదేమీ తప్పు కాదు, అన్ని పార్టీల నేతలను అలా కలిసిన ఉదంతాలు ఎన్నో. కొంత మందిని రప్పించుకొని రాహుల్ నాటకమాడుతున్నారని కేంద్ర వాణిజ్యశాఖ పియూష్ గోయల్ ఆరోపించారు. రైతులు, వస్త్ర పరిశ్రమ వర్గాల్లో భయాన్ని రేపుతున్నారని అన్నారు. వాస్తవాలు తెలియకుండా తన అవివేకాన్ని స్వయంగా బయటపెట్టుకున్నారని, దేశ అభివృద్ధిని దెబ్బతీయాలని చూస్తున్నారని, ప్రతికూల రాజకీయాలకు పాల్పడుతున్నారని కూడా ధ్వజమెత్తారు. ''కఠిన వాస్తవాలు'' అంటూ ఎక్స్‌లో కొన్ని విషయాలను మంత్రి పోస్టు చేశారు. అభివృద్ధి చెందిన 38దేశాలతో కుదుర్చుకున్న తొమ్మిది స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో ఇప్పుడున్న నాలుగు లక్షల కోట్ల రూపాయల వస్త్ర ఎగుమతులు 45 లక్షల కోట్ల పెరుగుతాయంటే ఎంతగా వృద్ధి అవకాశాలు ఉన్నాయో స్త్రీ, పురుషులకు లక్షలాది ఉద్యోగాలు ఎలా వస్తాయో ఊహించుకోవచ్చన్నారు. అమెరికా పత్తి ఉత్పత్తి చాల తక్కువని, స్థానిక అవసరాలకు పోను ఆరుబిలియన్ డాలర్ల విలువ గల పత్తి, నూలు ఎగుమతులు చేస్తున్నారని, భారత్ నుంచి 2.7 బిలియన్ డాలర్ల విలువగల పత్తి, నూలును బంగ్లాదేశ్ దిగుమతి చేసుకుంటున్న విషయం రాహుల్‌కు తెలియదని అన్నారు. రాహుల్ గాంధీ కుటుంబం పాలన సాగించిన రోజుల్లో అమల్లోకి తెచ్చిన సెజ్ చట్టం నిబంధన 27(1) ప్రకారం ఎగుమతి చేసే వస్తువులకు గాను పత్తితో సహా ముడివస్తువులను ఎలాంటి పన్ను లేకుండా దిగుమతి చేసుకోవచ్చని, ఎగుమతుల కోసం సున్నా పన్నుల విధానం తెచ్చిన స్వంత పార్టీ మీదే రాహుల్ గాంధీ దాడి చేస్తున్నారని మంత్రి ఎద్దేవా చేశారు. అంతకు ముందు రోజు రాహుల్ గాంధీ ఎక్స్ ద్వారా ప్రభుత్వ విధానాన్ని విమర్శించారు. ప్రభుత్వం ఊబిలోకి నడుస్తూ కోట్లాది మందిని దానిలోకి లాక్కుపోతున్నదని పేర్కొన్నారు. పద్దెనిమిది, సున్నా శాతం పన్నులంటూ జనాన్ని ప్రభుత్వం గందరగోళపరుస్తున్నదని అవాస్తవాలు చెప్పటంలో ప్రధాని ఎంతో నిపుణులని, మంత్రివర్గం గందరగోళాన్ని వ్యాపింప చేస్తున్నదని విమర్శించారు. బంగ్లాదేశ్‌కు అమెరికా ఇచ్చిన ప్రత్యేక రాయితీ మనకూ రావాలంటే మనం కూడా అమెరికా పత్తి దిగుమతి చేసుకోవాల్సి ఉందని రాహుల్ పేర్కొన్నారు.పత్తి వివరాలేమిటి, ఎవరు చెబుతున్నది వాస్తవం, ఎవరిది అవాస్తవం !

ప్రపంచ పత్తి ఉత్పత్తి వివరాలను చూస్తే చైనాలో 7.5, భారత్‌లో 5.1,బ్రెజిల్ 4.1, అమెరికాలో 3,పాకిస్తాన్‌లో 1.1మిలియన్ టన్నుల పత్తి పండిందని 2025 అంచనా. బ్రెజిల్‌లో ప్రతి మనిషికి 0.19మి.ట, అమెరికాలో 0.088 , చైనాలో 0.052,మనదేశంలో 0.032 మి.టన్నులు ఉంది. ఈ వివరాలన్నీ తెలియకుండానే గోయల్ అమాత్యగిరీ వెలగబెడుతున్నారని అనుకోవాలా ? 2024 వివరాల ప్రకారం ప్రపంచంలో 90లక్షల టన్నుల ఎగుమతి జరగ్గా బ్రెజిల్ 27.74, అమెరికా 24.91, మనదేశం 4.65లక్షల టన్నులు ఎగుమతి చేసింది. రెండవ స్థానంలో ఉన్న మనం అంత తక్కువ, నాలుగవదిగా ఉన్న అమెరికా అంత ఎక్కువ ఎందుకు ఎగుమతి చేస్తున్నట్లు ! మనకంటే ఎక్కువగా పండిస్తున్నప్పటికీ చైనా ఎందుకు దిగుమతి చేసుకొంటోందంటే అక్కడ వస్త్ర పరిశ్రమకు అవసరం, తద్వారా విదేశాలకు ఎగుమతి చేసి లబ్ది పొందుతోంది.మన దేశంలో ఐదు కోట్లకు పైగా కదుళ్లు ఉండగా చైనా పది కోట్లు కలిగి ఉంది, వాటితో అక్కడి జనాభాకు పని కల్పిస్తోంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందంతో నిమిత్తం లేకుండానే పిలుపులు ఇచ్చిన మన మేకిన్, మేడిన్ ఇండియా, ఆత్మనిర్భర భారత్ సంగతేమిటి ? ఒక మౌలిక ప్రశ్న ఏమంటే వస్త్ర ఎగుమతులకు నిజంగా అంత అవకాశం ఉంటే మోడీ సర్కార్ 12 సంవత్సరాల పాటు అలాంటి ఒప్పందాలను ఎందుకు చేసుకోలేదు ? లక్షలాది మందికి ఉపాధి ఎందుకు కల్పించలేదు ? మన రైతాంగం, పరిశ్రమ బంగ్లాదేశ్ గురించి ఎందుకు భయపడాలి ? బంగ్లాదేశ్ ప్రధాన ఉత్పత్తి వస్త్రాలు,రెడీమేడ్ దుస్తులు. అక్కడ పత్తి పెద్దగా పండదు, దిగుమతి చేసుకోవాల్సిందే. ప్రస్తుతం ప్రపంచంలో అదే ఎక్కువగా ఇతర దేశాల నుంచి తెచ్చుకుంటున్నది. వస్త్ర ఉత్పత్తులతో చైనా, భారత్, వియత్నాం వంటి దేశాలను సవాలు చేస్తున్నది. తాజా ఒప్పందం ప్రకారం అమెరికా నుంచి నూలు, పత్తి దిగుమతి చేసుకొని దుస్తులను తమకు ఎగుమతి చేస్తే ఎలాంటి పన్నులు ఉండవు అన్న వెసులుబాటు అమెరికా కల్పించింది. నిజానికి అది తమ పత్తి కొనుగోలు చేయాలనే షరతును రుద్దింది. ఒక దశలో షేక్ హసీనా పదవీచ్యుతురాలు గాక ముందు మన పత్తి, నూలు ఎగుమతుల్లో 70శాతం బంగ్లాదేశ్‌కే జరిగాయి.పైకి ఎన్ని చెప్పినప్పటికీ ఇప్పుడు అక్కడ మనకు వ్యతిరేకమైన బిఎన్‌పి అధికారానికి వచ్చింది. అక్కడి నుంచి అమెరికాకు ఎగుమతి చేసే రెడీమేడ్ దుస్తులలో 70శాతం అమెరికా ముడి సరకులే* ఉంటే ఎలాంటి దిగుమతి పన్ను ఉండదు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం పత్తి సంవత్సరం 2025–26 (అక్టోబరు నుంచి సెప్టెంబరు వరకు) బంగ్లాదేశ్ 84లక్షల బేళ్ల పత్తి దిగుమతి చేసుకోవాలని నిర్ణయించింది. బ్రెజిల్ నుంచి 19(22శాతం) భారత్ 14(15శాతం) బెనిన్ 10.6, కామెరూన్ 6.2, అమెరికా, ఆస్ట్రేలియాల నుంచి 5.95లక్షల బేళ్ల వంతున దిగుమతి చేసుకోవాలని తలపెట్టింది. ఇప్పుడు తాజా ఒప్పందంతో అమెరికా నుంచి దిగుమతులు భారీగా పెరుగుతాయని భావిస్తున్నారు. మన పత్తి కంటే అమెరికా సరకు రేట్లు తక్కువ, ఎందుకని ? 2026లో ఒక పౌను(453 గ్రాములు) దూదికి ప్రభుత్వ సాయంగా 55 సెంట్లు, మననగదులో రు.50 ఇస్తుంది. అంతమొత్తం సబ్సిడీ పొందుతున్న తరువాత ప్రపంచానికి చౌకధరలకు పత్తి ఎగుమతులు చేయకుండా ఎలా ఉంటుంది. పైసా పైసా లాభాన్ని లెక్కవేసుకొనే వారు అమెరికా పత్తికి ఎగబడక చస్తారా ? బంగ్లాదేశీయులు దూరంగా ఉంటారా ? ట్రంప్ విధించిన పన్నులతో మన ఎగుమతిదారులు అమెరికన్లకు చౌకగా దుస్తులు అందించలేకపోతున్నారని అచ్చేదిన్‌కు దూరం చేస్తున్నారనే ''జాలి గుండె '' నరేంద్రమోడీ సర్కార్ అక్కడి నుంచి దిగుమతి చేసుకొనే పత్తిపై 11శాతం పన్ను తగ్గించింది. పొడవు పింజ పత్తిని మాత్రమే దిగుమతికి అనుమతించామంటారు, రెండు తెలుగు రాష్ట్రాలు, దక్షిణాదిన పండేది అదే గనుక మన రైతులకు వెయ్యి నుంచి రెండువేల వరకు నష్టం వచ్చింది, అయితేనేం అమెరికన్లకు తక్కువ ధరలకు దుస్తులను అందించినందుకు మన బిజెపి నేతలు తమ భుజాలను తామే చరుచుకున్నారు. ఇప్పుడు కూడా అమెరికా నుంచి దిగుమతులు చేసుకోవాలని పియూష్ గోయల్ చెబుతున్నారు. అంటే ఈ ఏడాది కూడా పత్తి రైతుల నోట్లో మట్టికొట్టేందుకు పూనుకున్నారు. ప్రభుత్వం ఎన్ని సబ్సిడీలు ఇచ్చినా పత్తిసాగు గిట్టుబాటు కావటం లేదంటూ అమెరికన్ రైతులు విస్తీర్ణాన్ని తగ్గిస్తున్నారు. దాంతో ట్రంప్ ప్రభుత్వం రంగంలోకి దిగి వాణిజ్య ఒప్పందాల్లో తమ వ్యవసాయ ఉత్పత్తులను కొనాల్సిందే అనే షరతులు పెడుతోంది.బ్రెజిల్ నుంచి పత్తి ఎగుమతుల్లో తీవ్ర పోటీ ఎదురుకావటంతో సబ్సిడీలతో రంగంలోకి దిగనుంది.



అమెరికాతో ఒప్పందం గురించి అడుగడుగునాదాగుడుమూతలే,పైకి చెబుతున్నది ఒకటి లోపల మరొకటి జరుగుతోందన్న అనుమానాలు బలపడుతున్నాయి. వివిధ రకాల ధాన్యాల నుంచి అమెరికాలో ఎథనాల్ తయారు చేస్తారు, ఆ క్రమంలో వచ్చే పిప్పి లేదా చెక్కను పశువుల దాణాగా వినియోగిస్తారు.తాజా ఒప్పందం ప్రకారం దాన్ని మనం ఎలాంటి పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాలి, అది కోళ్ల ఫారాల యజమానులకు లబ్ది కలిగిస్తుంది, కానీ మన దగ్గర అందుకోసం సాగు చేస్తున్న రైతులేం కావాలి ? ఇదే మాదిరి సోయా ఆయిల్‌ను పన్నుల్లేకుండా దిగుమతి చేసుకునేందుకు అంగీకరించారు. ఆ రైతుల పరిస్థితి ఏమిటి ? ఒక వైపు నూనె గింజల సాగును ప్రోత్సహిస్తామంటారు మరోవైపు ఆ రైతులను దెబ్బతీస్తారు. బయో ఇంధన ఉత్పత్తిలో భాగంగా ఇథనాల్ తయారీని ప్రోత్సహిస్తారు. అమెరికా నుంచి దాని చెక్కను దిగుమతి చేసుకుంటే ఇక్కడి కంపెనీల ఉత్పత్తులను ఎవరు కొంటారు ? ముందే చెప్పుకున్నట్లు పైకి చెబుతున్నది ఒకటి లోపల జరుగుతున్నది మరొకటి.అమెరికా నుంచి పప్పు ధాన్యాలను కూడా దిగుమతి చేసుంటారని ట్రంప్ యంత్రాంగం ''వాస్తవాల పత్రం ''లో చెప్పింది. మన రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావటంతో మాట మార్చింది. ఫిబ్రవరి పన్నెండు కార్మికుల సార్వత్రిక సమ్మె సందర్భంగా రైతులు మద్దతు ప్రకటించి నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే ఐదేండ్ల పాటు ప్రతి ఏటా వంద బిలియన్ డాలర్ల అమెరికన్ వస్తువులు, ఇంధనాన్ని కొనుగోలు చేసేందుకు భారత్ అంగీకరించినట్లు తొలుత చెప్పారు. తరువాత మాట మార్చి అంగీకారం కాదు వాంఛిస్తున్నదని సవరించారు. డిజిటల్ సేవలపై పన్నులు ఎత్తివేసేందుకు మోడీ సర్కార్ అంగీకరించిందని తొలుత ప్రకటించారు.తరువాత దానికి సంబంధించిన పేరాను తొలగించారు.దాని బదులు డిజిటల్ వాణిజ్య సేవల గురించి సంప్రదింపులు జరిపేందుకు అంగీకరించిదని మార్చారు. ఇలా అమెరికా రోజుకొక మాట చెబుతున్నా మోడీ నోరు విప్పటం లేదు, ఇదేమని అడిగిన వారిని అభివృద్ధి నిరోధకులు, దేశ వ్యతిరేకులని ముద్ర వేస్తున్నారు. మార్చి నెలలో సంతకాలు జరుగుతాయని చెబుతున్న ఒప్పందంలో ఇంకెన్ని చేరుస్తారో, ఆ తరువాత చేర్చటానికి మరెన్ని షరతులకు అంగీకరిస్తారో, రైతాంగాన్ని ఎలా నట్టేట ముంచేందుకు చూస్తున్నారో తలచుకొంటే ఆందోళన కలుగుతోంది, ఎలా స్పందిస్తారో చూద్దాం !



ఎం కోటేశ్వరరావు
8331013288

## యుపీలో ఎఐఎంఐఎం సత్తా ఎంత?

ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో, రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదను పెట్టడం ప్రారంభించాయి. రాష్ట్రంలో ఎన్నిక సమాజ్‌వాదీ పార్టీ, భారతీయ జనతా పార్టీకి మధ్య అనే భావన ఉన్నప్పటికీ, ఆల్ ఇండియా మజ్లిస్ ఎ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎఐఎంఐఎం) వీరి మధ్య తనను తాను స్థిరీకరించుకోవడం ప్రారంభించింది. మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికలలో వృద్ధిని సాధించిన తర్వాత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆత్మవిశ్వాసం పెరిగింది. తన పార్టీని ఇతర ప్రాంతాలకు విస్తరించడం పట్ల ఆయన విశ్వాసంతో ఉన్నారు. 2027లో జరుగనున్న ఎన్నికల సమరానికి ఏడాది మాత్రమే ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఎస్ పీ అధిపతి అఖిలేష్ యాదవ్‌ల నడుమ ఒక ముఖ్యమైన భాగస్వామిగా ఒవైసీ నిలువనున్నట్టు కనిపిస్తోంది. తమ పార్టీ ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తోందని జనం అడుగుతున్నారని అంటూ, తమ పూర్తి బలంతో ఎఐఎంఐఎం పోరాటం చేస్తుందని హైదరాబాద్ ఎంపీ సూచించారు. ఒవైసీ పార్టీతో పొత్తుకు అవకాశాలను గురించి ఎస్పి యోచిస్తుందేమో అనే ఊహాగానాలు ప్రారంభం అయ్యాయి.

**యుపిలో ముస్లిం ఓటరు ప్రభావం**

ఉత్తరప్రదేశ్‌లోని 14 జిల్లాల్లో 25 శాతం కంటే ఎక్కువ ముస్లిం జనాభా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా, ముస్లింలు జనాభాలో దాదాపు 20 శాతం ఉన్నారు. 403 అసెంబ్లీ నియోజకవర్గాలలో, 143 సీట్లలో ముస్లిం ఓటర్లు గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నారు. 70 సీట్లలో 20–30 శాతం ముస్లిం జనాభా ఉండగా, 73 సీట్లలో 30 శాతం కంటే ఎక్కువ ముస్లిం జనాభా ఉంది. జనాభాపరంగా ఇంతగా ఉన్నప్పటికీ, ఎఐఎంఐఎం అక్కడ ఎన్నికలలో ఇబ్బంది పడింది. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ పెద్దగా స్థానాలు సాధించలేదు. 2022లో, ఎఐఎంఐఎం 95 సీట్లలో పోటీ చేసింది కానీ 0.49 శాతం ఓట్లను మాత్రమే సాధించింది. అయితే, ముస్లింలు ఎక్కువగా ఉన్న స్థానాల్లో ఎఐఎంఐఎం హిందూ అభ్యర్థులను నిలిపితే, బిజెపి సవాళ్లను ఎదుర్కోవచ్చని నిపుణులు అంటున్నారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఐక్యత గురించి పదే పదే సందేశం ఇస్తున్నారు. హిందువులు విడిపోతే అది విధ్వంసానికి మార్గం తెరుస్తుందని అన్నారు.

# అందరి క్షేమం కోసం ఎఐ





గ్లోబల్ సౌత్, న్యూఢిల్లీ వేదికగా తొలిసారి జరుగుతున్న "ఇండియా – ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ – 2026" ఫిబ్రవరి 16 – 20 వరకు ఐదు రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నది. "పీపుల్, ప్లానెట్, ప్రోగ్రేస్ (ప్రజులు, భూగ్రహం, ప్రగతి" అనే మూడు సూత్రాల ఆధారంగా నిర్వహిస్తున్న ఈ ఏఐ సమ్మిట్– 2026లో 30 దేశాలకు పైగా ప్రతినిధులు 700లకు పైగా ప్రతిపాదనలతో పాల్గొంటున్నారు. కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ – ఏఐ) సాంకేతికతను పునాదిగా చేసుకొని అభివృద్ధి, పాలన, ప్రజా సేవల అమలులో మెరుగైన విధానాలు అవలంబించడానికి మార్గం సుగమం అయ్యింది. వికసిత్ భారత్–2047 లక్ష్యాలను చేరడానికి ఏఐ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి పరిశోధనలు జరుగుతున్నాయి. న్యూఢిల్లీ భారత్ మండపం వేదికగా జరుగుతున్న "ఇండియా – ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ – 2026"ను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ, ఇండియా ఏఐ మిషన్, డిజిటల్ ఇండియా ఇనిషియేటివ్, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా అనబడే సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

### ఇండియాలో ఏఐ టెక్నాలజీ పాత్ర, ప్రాధాన్యం

భారత ఆర్థిక ప్రగతి వేగాన్ని పెంచడం, మెరుగైన ఫలితాలను పాలనలో సంస్కరణలు చేయడం, ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచడం లాంటి లక్ష్యాల సాధనలో ఏఐ ప్రక్రియను మరింత లాభదాయకంగా వినియోగించడానికి ఈ వేదిక మార్గాలను సూచిస్తుంది. సమ్మిట్ త్రిసూత్రాల్లో "ప్రజలు, భూగ్రహం, ప్రగతి (పీపుల్, ప్లానెట్, ప్రోగ్రేస్)"లను నిర్ణయించుకొని చర్చలు జరుపుతున్నది. ప్రజారోగ్యం(టెలీమెడిసిన్, రోగ నిర్ధారణ, ఔషధ ఆవిష్కరణ), వ్యవసాయం –గ్రామీణాభివృద్ధి, (వాతావరణ హెచ్చరికలు, వ్యవసాయ ఉత్పత్తులు పెంచడం, రైతుల ఆదాయం పెంచడం), విద్య(అనువాదాలు, 24/7 బోధనలు, అన్ని స్థాయిల విద్యార్థులకు బోధనలు), ఆర్థికం – వాణిజ్యం(ఆర్థిక భద్రత, సమ్మిళిత అభివృద్ధి, సేవల్లో దక్షత పెంచడం, బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట), పాలన – ప్రజా సేవలు(తీర్పుల అనువాదం, సేవలను అర్హులకు అందించడం, పారదర్శకత, జవాబుదారీతనం, సమర్థవంతమైన పాలన) లాంటి రంగాల్లో ఏఐని వినియోగించి సమూల సానుకూల మార్పులు చేయడానికి అత్యాధునిక ఏఐ టెక్నాలజీ వాడనున్నారు. ప్రజల శ్రేయస్సుతో పాటు భూగ్రహంపై వెలసిన కాలుష్య మబ్బులను తొలగించడం, సమగ్ర ప్రగతికి బాటలు వెయడానికి ఏఐ సాంకేతికతను వినియోగించడం క్రమంగా పెరుగుతోంది.

### ఇండియా - ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ - 2026
### త్రి సూత్రాలు - సప్త చక్రాలు

ఇండియా – ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ – 2026 వేదికగా మూడు సూత్రాలు (పీపుల్, ప్లానెట్, ప్రోగ్రేస్), ఏడు చక్రాలను నిర్ణయించుకొని ముందుకు సాగుతున్నది. ఏఐ సమ్మిట్‌లో చర్చించే ప్రధానమైన ఏడు చక్రాల్లో యువ భారత మానవ వనరుల అభివృద్ధి, సామాజిక సాధికారతకా సమ్మిళిత అభివృద్ధి, సురక్షిత – నమ్మకమైన ఏఐ టెక్నాలజీ, స్థితిస్థాపకత–ఇన్నోవేషన్–ఎఫిషియెన్సీ, ఏఐ సమ్మిళిత సైన్స్ వినియోగం, ఏఐ వనరులను అందరికీ అందుబాటులోకి తేవడం, ఆర్థిక ప్రగతి – సామాజిక శ్రేయస్సుకు ఏఐ అనే అంశాలను గుర్తించారు. ఇండియా – ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ – 2026లో ప్రధాన "గ్లోబల్ ఇంపాక్ట్ చాలెంజెస్" అంశాలుగా ఏఐ ఫర్ ఆల్(అందరికీ ఏఐ), ఏఐ ఫర్ హర్ (మహిళలకు ఏఐ), ఏఐ ఫర్ యూత్ (యువతకు ఏఐ), ఏఐ పరిశోధనలు, భారత ఏఐ పరిశోధకులు(థింక్ ఫ్రూనర్స్) అనబడే రంగాలను ఎన్నుకున్నారు. భారతదేశం స్వయం సమృద్ధిని సాధించడం, మౌళిక వనరుల వృద్ధి, డాటాబేస్, సామర్థ్య అభివృద్ధి, వినూత్న ఆవిష్కరణలకు ఏఐ సాంకేతికత ఊతం ఇవ్వనున్నది. ప్రభుత్వ పారదర్శక పాలన, ప్రజా సంక్షేమ సేవల సమర్థవంతమైన అమలు, పరిశోధనలకు ప్రాధాన్యం పారిశ్రామిక ప్రగతి వేగం పుంజుకోవడానికి ఏఐ టెక్నాలజీ ఉపకరించనుందని ఆశిద్దాం.



మధుసూదన్ రెడ్డి
9949700037



# గ్రేటర్ హైదరాబాద్



## అంతర్జాతీయ కిక్ బాక్సింగ్‌లో గీతం విద్యార్థికి కాంస్య పతకాలు



**సంగారెడ్డి జిల్లా, రుద్రారం:** హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలో చివరి ఏడాది బీ.టెక్. (సీఎస్ఈ) విద్యార్థి ఎస్.వీరంద్ర ఫిబ్రవరి 4 నుంచి 8వ తేదీ వరకు న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ అరీనాలో నిర్వహించిన ఐదవ ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ కప్ 2026 పోటీలలో రెండు కాంస్య పతకాలు సాధించారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో దాదాపు పది దేశాలకు చెందిన అథ్లెట్లు పాల్గొన్నారు. సీనియర్ కేటగిరీలో పోటీపడిన వీరంద్ర అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. ఆయనతో పాటు తెలంగాణ బృందంలోని ఇతర సభ్యులు కూడా ప్రతిభ కనబరచి కిక్ లైట్, లైట్ కాంటాక్ట్, జూనియర్ విభాగాలలో బంగారు, వెండి పతకాలను గెలుచుకున్నారు.

గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, ఆతిథ్య విభాగంక్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, స్పోర్ట్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం. నారాయణరావు చౌదరి తదితరులు వీరంద్ర సాధించిన విజయానికి అభినందనలు తెలియజేశారు. ఆయన అంకితభావాన్ని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీలలో రాణించడానికి కృషి చేయమని ప్రోత్సహించారు.

## తెలంగాణకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిన
# మహనీయుడు కేసీఆర్

- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- షాద్ నగర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు
- పెద్ద సంఖ్యలో హాజరైన పార్టీ కార్యకర్తలు, నాయకులు
- సర్కార్ దవాఖానాలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ



**షాద్‌నగర్, ఫిబ్రవరి 17 (ఉదయం):** తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతో పాటు, అభివృద్ధి పథంలో తెలంగాణ రాష్ట్రాన్ని నడిపి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చే విధంగా తీర్చిదిద్దిన ఘనుడు, మహనీయుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ కొనియాడారు. కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని షాద్ నగర్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో పాల్గొన్న అనంతరం మాట్లాడారు. తెలంగాణ ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చడంతో పాటు దశాబ్ద కాలం పాటు తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో తీర్చిదిద్ది, దేశంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చే విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన మహనీయుడు, గొప్ప పరిపాలకుడు కేసీఆర్ అని గుర్తు చేశారు. రైతుబంధు, రైతు బీమా, కళ్యాణలక్ష్మి, హరితహారం, కేసిఆర్ కిట్లు, ఆసరా పించన్లు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి పేద ప్రజలకు అండగా ఉన్నారని అన్నారు. అధికారం కోల్పోయి రెండేళ్లు గడిచిన నేటికీ కేసీఆర్ ని తలచుకుంటున్నారని, ఆయన పాలన తీరును మర్చిపోలేకపోతున్నారని చెప్పారు. దేవుడి ఆశీర్వాదం, ప్రజల ఆశీర్వాదంతో ఆయన నిండు నూరేళ్లు బ్రతికి తెలంగాణ ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఇందులో భాగంగానే ప్రత్యేకంగా తయారు చేసిన కేక్ ను కట్ చేసి పార్టీ శ్రేణులకు, అభిమానులకు తినిపించారు. కార్యాలయం ఆవరణలో సంబరాలు జరుపుకున్నారు. మహిళా కార్యకర్తలు సైతం ఉత్సాహంగా పాల్గొని కేసీఆర్ కు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం కార్యాలయావరణంలో మొక్కలను నాటారు. షాద్ నగర్ సర్కార్ దవాఖానాలో రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. కేసీఆర్ జన్మదినం ఓ పండుగ వాతావరణాన్ని తలపించిందని పలువురు నేతలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, ఆకుల శ్రీశైలం, మాజీ కార్పోరేషన్ చైర్మన్ రాజవరప్రసాద్, రాజ్యలక్ష్మి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, పట్టణ అధ్యక్షులు ఎం. ఎస్. నటరాజన్, నియోజకవర్గంలోని ప్రధాన ప్రముఖ నేతలు, కార్యకర్తలు, నూతన కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.



## గుమ్మడిదల 20వ వార్డు కౌన్సిలర్‌కు ఘన సత్కారం



**సంగారెడ్డి, ఫిబ్రవరి 17 (ఉదయం):** గుమ్మడిదల మున్సిపాలిటీ 20వ వార్డు నుంచి నూతనంగా ఎన్నికైన బీజేపీ నాయకులు గిద్దె రాజు గారి సతీమణి గిద్దె విజయలక్ష్మి గారిని వీరశైవ లింగాయత్ సమాజం పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షులు సింగీతం జగదీశ్వర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా సత్కరించారు. సింగీతం జగదీశ్వర్ గారు మాట్లాడుతూ, ప్రజల విశ్వాసంతో ఎన్నికైన గిద్దె విజయలక్ష్మి గారు తమ వార్డులో ప్రజల సమస్యలను గుర్తించి సమర్థవంతంగా పరిష్కరించేలా పని చేయాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా మౌలిక వసతుల అభివృద్ధి, పరిశుభ్రత, తాగునీటి సరఫరా, మహిళా సంక్షేమం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా నిలవాలని సూచించారు. అలాగే మహిళా ప్రతినిధిగా రాజకీయాల్లో ముందుకు రావడం గర్వకారణమని, మహిళల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వార్డును అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలని కోరారు. వీరశైవ లింగాయత్ సమాజం తరపున నూతన కౌన్సిలర్‌కు సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. నూతన కౌన్సిలర్ గిద్దె విజయలక్ష్మి గారు మాట్లాడుతూ, తనపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు అంకితభావంతో పని చేస్తానని తెలిపారు. వార్డు అభివృద్ధే లక్ష్యంగా, పార్టీ భేదాలు లేకుండా ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పనిచేస్తానని హామీ ఇచ్చారు. సత్కార కార్యక్రమంలో నాగరాజు, నీలకంఠం, శివకుమార్, రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొని నూతన కౌన్సిలర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## శభాష్ మహిపాల్ రెడ్డి
### జిఎంఆర్ ను అభినందించిన మాజీ సీఎం కేసీఆర్



**సంగారెడ్డి \ పటాన్చెరు, ఫిబ్రవరి 17 (ఉదయం):** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ ను పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయడం పట్ల తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు శ్రీ కేసీఆర్ గారు పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారిని అభినందించారని ఎమ్మెల్యే జిఎంఆర్ సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు శ్రీ కేసీఆర్ గారి జన్మదినం పురస్కరించుకుని ఎమ్మెల్యే జిఎంఆర్ గారి ఆదేశాల మేరకు వారి సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి బృందం ఎర్రవల్లి లోని కేసీఆర్ ఫామ్ హౌస్ లో కెసిఆర్ గారిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే రోజులు బిఆర్ఎస్ పార్టీయేనని.. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సీనియర్ నాయకులు శ్రీధర్ చారి పాల్గొన్నారు.

## ముందే చెప్పాం.. సాధించాం

**ఐదు విజయాలు కెసిఆర్ పుట్టినరోజు కానుక**

**నూతన పాలకవర్గాలకు ఎమ్మెల్యే జిఎంఆర్ అభినందన**



**సంగారెడ్డి \ పటాన్చెరు, ఫిబ్రవరి 17 (ఉదయం):** పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలలో గులాబీ జెండా ఎగరవేసి.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసిఆర్ పుట్టినరోజు కానుకగా అందించామని.. ఇది తన జీవితంలో మర్చిపోలేని రోజని.. ఇందుకు సహకరించిన కార్యకర్తలకు.. సంపూర్ణ నమ్మకంతో ఆశీర్వదించిన ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ ఫంక్షన్ హాలులో ఇటీవల నూతనంగా ఎన్నికైన గడ్డపోతారం, జిన్నారం, ఇంద్రేశం మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, పాలకవర్గం సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ వారిని ఘనంగా సన్మానించి అభినందించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయాల్లో గెలుపు ఓటములు అత్యంత సహజమని.. ప్రజలు నమ్మకంతో గెలిపించిన ప్రజాప్రతినిధులందరూ ఆయా మున్సిపాలిటీల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ప్రతి మున్సిపాలిటీని అభివృద్ధి సంక్షేమాల అంశంలో ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. ఇందుకు తాను ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఐదు మున్సిపాలిటీల అభివృద్ధికి 15 కోట్ల రూపాయలు చొప్పున నిధులు సిద్ధంగా ఉన్నాయని.. అతి త్వరలో ఇందుకు సంబంధించిన పనులకు శంకుస్థాపనలు చేద్దామని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికిని రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసిఆర్ నాయకత్వంపై పటాన్చెరు ప్రజలు ఎల్లప్పుడూ తమ నమ్మకాన్ని కొనసాగిస్తున్నారని.. ఇందులో భాగంగా ఐదు మున్సిపాలిటీలలోనూ. బిఆర్ఎస్ పార్టీని నిండు మనసుతో ఆశీర్వదించి గెలిపించారని అన్నారు. రాబోయే ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికలతో పాటు కార్పొరేషన్ ఎన్నికల్లోను క్లీన్ స్వీప్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు

## జెఇఇ మెయిన్ పరీక్షలో మెరిసిన బీసీ విద్యార్థులు

**పరీక్షకు హాజరైన 318 మంది విద్యార్థులు 90పర్సెంటైల్ పైగా సాధించిన 5గురు విద్యార్థులు**

**విద్యార్థులను అభినందించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం**

**ప్రిన్సిపల్ కార్యదర్శి శ్రీధర్, ఎంజెపి సోసైటీ కార్యదర్శి సైదులు**



**హైదరాబాద్, ఫిబ్రవరి17 (ఉదయం):** దేశవ్యాప్తంగా మొదటి విడతలో జరిగిన జెఈఈ మెయిన్ ప్రవేశ పరీక్షలో బీసీ గురుకుల ఇంటర్ విద్యార్థులు 318 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో ఐదుగురు విద్యార్థులు 90 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించారు. మరో 28మంది విద్యార్థులు 80 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించారు.

బాలికల విభాగంలో ఏ. నిత్య (92.19), సిహెచ్ గాయత్రి ( 91.50), ఎం. సహస్ర ( 87.69), పి. చరిత(86.20), ఎం. స్నేహ(85.09) పర్సంటైల్ సాధించారు. బాలుర విభాగంలో ఎం. నరేందర్(91.58), ఆర్ . కౌశిక్ (91.25), బి.మల్లేష్( 90.50), బి.హరీష్(89.19), డి.రోహన్(88.05) పర్సంటైల్ సాధించారు.

గతంలో రెండు సీఓఈ లలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు కోచింగ్ ఇస్తుండగా తమ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పది సీఓఈ లను ఏర్పాటు చేయడమే కాకుండా లాంగ్ టర్మ్ కోచింగ్ కూడా ఇస్తున్నదని ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులు అధిక సంఖ్యలో పోటీ పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించారని, రానున్న రోజుల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ఆకాంక్షించారు. అత్యుత్తమ ప్రతిభను చూపిన విద్యార్థినీ, విద్యార్థులను, బోధనా సిబ్బందిని మంత్రి గారు, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఈ. శ్రీధర్ , ఐఏఎస్, ఎంజెపి సోసైటీ కార్యదర్శి బడుగు సైదులు ఐఎఫ్ఎస్ అభినందించారు.

## చిన్న పత్రికలపై సర్కారు వివక్ష






**సమాచార భవన్ భవన్ వద్ద జర్నలిస్టుల ఆందోళన**

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఉదయం ప్రతినిధి):** కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆర్ఎన్ఐ, పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ కలిగిన చిన్న,మధ్య తరహా పత్రికలకు అక్రెడిటేషన్లు ఇవ్వకుండా, ఎంప్యానల్‌మెంట్ చేయకుండా వివక్ష చూపుతున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మంగళవారం ఆయా పత్రికల జర్నలిస్టులు హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని సమాచార పౌరసంబధాల శాఖ కమీషనర్ కార్యాలయం (సమాచార భవన్) ఎదుట ఆందోళన చేపట్టారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఇచ్చిన "ఛలో సమాచార భవన్" పిలుపు మేరకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన చిన్న, మధ్య తరహా పత్రికల నిర్వహకులు, పాత్రికేయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ర్యాలీగా వెళ్లిన జర్నలిస్టులు దాదాపు రెండు గంటల పాటు కార్యాలయం ప్రవేశ ద్వారం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత స్వరాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పత్రికల అణచివేత కొనసాగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సారి 44 వేలకు పైగా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించినప్పటికీ, కేవలం ఎంపానల్మెంట్ అయిన కొన్ని పత్రికలకు,చానళ్ళకు మాత్రమే ఇస్తూ మిగతా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఎంపానల్మెంట్ తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న అన్ని పత్రికలకు ఆయా పత్రికల సర్క్యులేషన్ ఆధారంగా జర్నలిస్టులందరికి అక్రెడిటేషన్ కార్డులిచ్చే వారని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఆ పద్ధతిని తుంగలో తొక్కి పత్రికలకు ఎంప్యానల్ ముసుగు తొడిగి, నిబంధనల పేరుతో చిన్న,మధ్య తరహా పత్రికలను పాతాళానికి తొక్కారని మామిడి సోమయ్య ధ్వజమెత్తారు. తెలంగాణ స్వరాష్ట్రంలోనే చిన్న మధ్య తరహా పత్రికలకు, వాటిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు తీరని అన్యాయం జరిగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ తొలి ప్రభుత్వం జర్నలిస్టులకు చేసిన అన్యాయంపై ఆనాడు గొంతెత్తిన ఈనాటి పాలకులు అధికారంలోకి వచ్చి రెండేండ్లయినా...అనేక పత్రికలను ఎంపానల్మెంట్ చేయకుండా జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారనని ఆయన ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టులందరికీ సరైన న్యాయం చేస్తామని నమ్మబలికిన పాలకులు మీడియా అక్రిడిటేషన్ ల విషయంలోనే వివక్ష చూపుతూ చిన్న మధ్య తరహా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఆర్ఎన్ఐ,పీఆర్జీఐ గుర్తింపు ఉన్న పత్రికలను ఎంప్యానల్ చేయకుండా రెండేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కనీసం అక్రెడిటేషన్లు ఇవ్వకుండా అణిచివేస్తున్నారని ధ్వజమెత్తారు. మరోవైపు ఎంప్యానల్ లిస్టులో ఉన్న చాలా పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించి జర్నలిస్టులను ఆందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు తన్నీరు శ్రీనివాస్, కె. పాండురంగారావు, పద్మనాభరావు, యర్రమిల్లి రామారావు,హైదరాబాద్ జిల్లా నాయకులు వి.రవికుమార్, శ్రీనివాస్ గౌడ్, బ్రహ్మం, సంతోష్, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, గడ్డమీది అశోక్, నాయకులు దప్పు రామస్వామి ,శంకర్, శివకుమార్,సంజీవ్ కుమార్, మంజులారెడ్డి, సౌభాగ్యవతి, సుష్మిత, శివపార్వతి, సూర్యాపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్వాయి జానయ్య, హరి ప్రసాద్, వరంగల్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు జక్కుల విజయ్ కుమార్, స్వామి దాస్, నిజామాబాద్ జిల్లా నేతలు కుంచెం శ్రీనివాస్, పానుగంటి శ్రీనివాస్, యార్వ నరేష్,మహాదేవ్ ప్రసాద్ రాజు, నల్గొండ జిల్లా నాయకులు వెలుతురు యాదయ్య, జీడిమట్ల రవీందర్, నాగయ్య, పరమేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఐ అండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్ జగన్ కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు.


## టెన్షన్ వద్దు

**హైదరాబాద్, (ఉదయం):** "బుర్ర" తినకండి ఎన్నో చిక్కులు..జిగ్ జాగ్ గా పడి ఉన్న దారం ను జాగర్తగా విడదీయడం ఎంత ఓపిక,ఆసక్తి తో కూడుకున్నది.అలాగే ఇప్పుడు సి బి ఎస్ ఈ పరీక్షల కు హాజరు అవుతున్న విద్యార్థుల బుర్ర ను అనుక్షణం వెంటాడుతూ..వెంబడిస్తూ.. ఏదో మిషన్ ఫాలో అప్ లా ఉండే కంటే వారిని కాస్త స్వేచ్ఛగా ఉండనివ్వండి.చెట్లపైన కరెంటు వైర్ల పైన..అయ్యో ఓ పక్షి మాంజా లో చిక్కుకు"పోయిందే" అని ఎలా బాధ పడతామో..అదే మాదిరి. మన పిల్లల్ని కూడా ఈ కొన్ని రోజుల పాటు కాస్తఅలా "బీ యువర్ సెల్ఫ్"అని వదిలేయండి. పరీక్ష ముందర పరేషాన్ చేసుడు అంతగా వాంఛనీయం కాదు. ఏం చదువుకున్నారో..పిల్లలకు తెలుసు.



ఇక కొందరు ట్యూషన్ కు కూడా వెళ్ళి అంటారు.ఇంతగా ప్రత్యేకంగా చదివించి కూడా.. ఎలా..ఎలా..ఎట్లా.. ఎట్లా అని అస్తమానం కంగారు పడి పోకండి. కని పెంచి పెద్దచేసిన తల్లి దండ్రులే ..పిల్లలు ఏదో యుద్ధానికి వెళ్ళే వారిలా..ఫీల్ ఐతే?! పిల్లలు అనవసరంగా కంగారు పడే అవకాశం లేక పోలేదు. కాబట్టి డియర్ పేరెంట్ ప్రేమ ను పెంచండి. కంగారు,టెన్షన్ తగ్గించండి.ఇంట్లో ఎంతగా ప్రశాంతంగా ఉంటే.. టెన్త్ పిల్లలకు అంత మంచిది. ఏదో.. ఏదో..అలా ..ఊహించుకుని,మైండు ఖారాబ్ చేసుకోవాల్సిన అవసరం లేదు.మీ హీరో ను ఓ సూపర్ ఇన్నింగ్స్ ఆడటానికి వెళ్తున్న ధోనీ గా అనుకుని.జస్ట్ అలా ..నిర్భయం గా.. నిస్సంకోచంగా.. ఉండండి.మెదడు కు కావాల్సిన మానసిక ధైర్యం + ఆలోచన స్వేచ్ఛ ను ఇవ్వండి.

## ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు
### శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్



**సంగారెడ్డి \ పటాన్చెరు, ఫిబ్రవరి 17 (ఉదయం):** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ శ్రేణులు పటాన్చెరులో ఘనంగా నిర్వహించాయి. పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని పంచముఖి హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కలను సాకారం చేసిన గొప్ప మహనీయుడు కెసిఆర్ అని అన్నారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# దమ్మపేటలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి ఫ్రూట్స్ పంచిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

**దమ్మపేట ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి,బి,ఆర్,ఎస్,పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 72వ జన్మదిన వేడుకలు దమ్మపేట మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు దొడ్డ రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు...ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా *అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు హాజరై పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్లకు బ్రెడ్, ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం కొట్లాడి.. సాధించి 10 ఏండ్ల పాటు అభివృద్ధి పాదంలో రాష్ట్రాన్ని నడిపించి... దేశానికే ఆదర్శంగా నిలిపారని .2ఏండ్ల తరువాత మళ్లీ తెలంగాణ రాష్ట్రానికి కెసిఆర్ నని ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని... భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సోయం వీరభద్రం ,మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు,దారా యుగంధర్,మాజీ సర్పంచ్ ఉయ్యాల చిన్న వెంకటేశ్వర్లు,జలగం వాసు, చీకట్ రామారావు ,రావుల శ్రీను,అబ్దుల్ జిన్నా,తుమ్మల లక్ష్మణ్ రావు,గాజుబోయిన ఎసుబాబు,తాటి పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పాఠ్యాంశాలను ఇన్నోవేటివ్‌గా బోధించాలి

**కలెక్టర్ స్నేహ శబరీష్**

**జడ్పీ, ప్రాథమిక పాఠశాలల ఆకస్మిక తనిఖీ**



**హనుమకొండ, ఫిబ్రవరి 17 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునే విధంగా ఉపాధ్యాయులు సృజనాత్మకంగా బోధించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. మంగళవారం కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల హాజరు వివరాలు తెలుసుకొని, ముఖ గుర్తింపు విధానంలో హాజరు నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఆరు, పదో తరగతుల తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడి బోధన విధానంపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.'లెట్స్ ఎన్ రిచ్ ఇంగ్లీష్' పాఠ్యాంశ బోధనను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థుల ఆంగ్ల ప్రావీణ్యంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠ్యాంశాలు విద్యార్థులకు స్పష్టంగా అర్థమవుతున్నాయా అనే విషయాన్ని తెలుసుకున్నారు.ప్రాథమిక పాఠశాలలో కూడా అన్ని తరగతులను పరిశీలించిన కలెక్టర్, ఐదో తరగతి విద్యార్థులతో ఆంగ్లంలో మాట్లాడించి వారి పఠన నైపుణ్యాలను పరీక్షించారు. పాఠశాల ప్రాంగణ పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, వంటగది, మరుగుదొడ్ల నిర్మాణ స్థితిని పరిశీలించారు. అసంపూర్తిగా, నిరుపయోగంగా ఉన్న నిర్మాణాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, వాటి వివరాలపై రెండు రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని డీఈఓను ఆదేశించారు. క్లాస్‌రూమ్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ విద్యార్థులను బయట కూర్చోబెట్టడం సరికాదని హెచ్చరించారు. పాఠశాల వాతావరణం పరిశుభ్రంగా, సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన నాణ్యతపై కూడా కలెక్టర్ ఆరా తీశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆంగ్ల భాషలో పట్టు సాధించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదాల సరైన ఉచ్చారణ, అర్థ వివరణతో పాటు ఆంగ్ల పదాలను తెలుగులో సరిగ్గా అనువదించి బోధించాలని తెలిపారు. విద్యార్థులు చదివింది అర్థం చేసుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.వి.గిరి రాజ్ గౌడ్, తహసిల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో గుండె బాబు, ఎంఈఓ శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# అరుణోదయ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

**కోరుట్ల ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి) :**

శాతవాహన యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ ఫలితాలలో శ్రీ అరుణోదయ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు 51శాతం ఉత్తీర్ణత శాతం నమోదు చేసి కోరుట్ల నియోజకవర్గం లోనే మెరుగైన ఫలితాలు సాధించారు దీనిలో భాగంగా మొదటి సెమిస్టర్ ఎంపీసీఎస్ విభాగంలో పసులోటి స్నేహ 9.48 ఇల్లుటపు శ్రావణి 9 బిజెడ్ సి విభాగంలో కుభా అంజుమ్ 9.44 సాయిస్త నూరిన్ 9.36 షహలీన్ సదాఫ్ 9.04 రామగిరి వైష్ణవి 9 డాటా సైన్స్ విభాగంలో మహమ్మద్ అష్రత్ 9.32 బీకాం కంప్యూటర్ విభాగంలో చిట్యాల సాయి ప్రసన్న 9.18 వరుగంటి మధులిక 9.04 తిరి రష్మిజ 9.01 కోరుట్ల నియోజకవర్గ పట్టణ అత్యధిక మార్కులు సాధించారు విద్యార్థులను ఉద్దేశించి కరస్పాండెంట్ మాట్లాడుతూ డిగ్రీ మొదటి రెండవ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు తెలంగాణ గ్రామీణ ప్రాంతంలోనే మొట్టమొదటి యు పి ఎస్ సి కోచింగ్ సెంటర్ కోరుట్ల లో శ్రీ అరుణోదయ డిగ్రీ కళాశాల వేదిక్ ఎస్ఆర్ఎం ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రారంభిస్తున్నామని తెలియజేశారు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను కళాశాల కళాస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్ కళాశాల ప్రిన్సిపల్ పోతాని నవీన్ కుమార్ వైస్ ప్రిన్సిపల్ లక్ష్మి భవాని అభినందించారు




# శాశ్వత మౌలిక వసతులపై దృష్టి సారించాలి

**జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్**

**2027 గోదావరి పుష్కరాలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి**

**ధర్మపురి, రాయపట్నం, కోటి లింగాల ఘాట్ల పరిశీలన**

**ధర్మపురి, ఫిబ్రవరి17 (వుదయం ప్రతినిధి):**

2027 జూలై 23 నుంచి ప్రారంభమయ్యే గోదావరి పుష్కరాల దృష్ట్యా జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. మంగళవారం జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ గోదావరి తీర ప్రాంతాల్లోని ధర్మపురి, రాయపట్నం, కోటిలింగాల ప్రాంతాల్లో పుష్కర ఘాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. పుష్కరాలకు సమయం ఉన్న నేపథ్యంలో శాశ్వత మౌలిక వసతులపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. రహదారులు, ఘాట్లు, విద్యుత్ సదుపాయాలు, తాగునీటి వ్యవస్థ, పార్కింగ్ స్థలాలు, భక్తుల వసతి గృహాల ఏర్పాటుపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ధర్మపురి పట్టణ అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించాలని, కోటిలింగాల ఆలయ ప్రాంత అభివృద్ధిని ప్రాధాన్యతగా తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో గోదావరి ప్రవాహం వెంబడి అవసరమైన చోట కొత్త పుష్కర ఘాట్లు నిర్మించాలని, లింక్ రోడ్లను అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ఒకే రోజు రెండు లక్షలకుపైగా భక్తులు తరలివచ్చినా ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్ వంటి పథకాలతో సమన్వయం చేసుకుని అవసరమైన అనుమతులు తీసుకుని పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. పుష్కరాల నిర్వహణలో వైద్య ఆరోగ్య,పర్యాటక,పోలీసు,నీటి పారుదల,దేవాదాయ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఆయన వెంట జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజగౌడ్, ఆర్డీవో మధుసూదన్ గౌడ్, ఈఈలు, డీఈలు, ధర్మపురి టెంపుల్ ఈవో శ్రీనివాస్, ఎమ్మార్వో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మున్సి పల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, ఎంపిడివోలు తదితర అధికారులు పాల్గొన్నారు.



# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్

- మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి
- తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి సుదర్శన్‌రెడ్డి

**జగిత్యాల, ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి) :**

హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహణపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫెరెన్సు నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ఐడిఓసి కార్యాలయం జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్ని జిల్లాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి రివిజన్ శాతం పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్‌లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి ఇంటి నుంచి ఖచ్చితమైన వివరాలు సేకరించాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ శాతాన్ని పెంచేందుకు బూత్ లెవల్ ఆఫీసర్లు తప్పనిసరిగా ఫీల్డ్ విజిట్ చేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ బూత్ లెవల్ ఏజెంట్లను వెంటనే నియమించుకునేలన్నారు. మ్యాపింగ్ సమయంలో తప్పు ఎంట్రీలు తప్పు లింకింగ్‌లు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఓటర్ల సౌలభ్యం కొరకు బుక్ ఎ కాల్ (బుక్ ఏ కాల్) సదుపాయంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని చెప్పారు. ప్రతి ఓటరు పేరు సరైన పోలింగ్ స్టేషన్‌కు మ్యాప్ కావడం ప్రజాస్వామ్యానికి కీలకమని అధికారులు సిబ్బంది పూర్తి బాధ్యతతో పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 100 శాతం పూర్తయ్యేలా అధికారులందరు సమన్వయంతో పని చేసి ఈ ప్రక్రియను పారదర్శకంగా మరియు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియ ను మరింత వేగవంతం చేస్తూ అలాగే మ్యాపింగ్‌లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా తప్పు ఎంట్రీ లు జరగకుండా ప్రతి ఓటరు మ్యాప్ అయ్యే విధంగా ప్రతి ఇంటి నుంచి ఖచ్చితమైన, నిర్దిష్టమైన వివరాలు సేకరించేలా అన్ని స్థాయి ల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బిఎస్ లత జగిత్యాల కోరుట్ల ఆర్డీవోలు మధు సూదన్ జీవాకర్‌రెడ్డి ఎన్నికల విభాగం పర్యవేక్షకులు హకీమ్ తహసీల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.




# మరోసారి వాయిదా పడిన క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఎన్నికలు

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి) :**

క్యాతన్ పల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక మళ్లీ వాయిదా పడింది. ఎన్నికల అధికారి, మందమర్రి తహసిల్దార్ సతీష్ కుమార్ ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం ప్రశాంతంగా నిర్వహించామని, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రారంభించడానికి ముందు ఇరు పార్టీ కౌన్సిలర్లు కొట్లాడుకోవడం, కుర్చీలు ఎత్తి విసురుకోవడంతో ఎన్నిక ప్రక్రియ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించామని మంగళవారం తహసిల్దార్ ప్రకటించారు. ఎన్నిక ప్రక్రియ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిక పంపిస్తామని తెలియజేశారు.



# హుస్నాబాద్‌లో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

**- తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక కేసీఆర్**

**- మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్**

**హుస్నాబాద్, ఫిబ్రవరి 17 (వుదయం) :**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలు మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేసి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సతీష్ కుమార్ మాట్లాడుతూ.. కేసీఆర్ అంటే కేవలం ఒక పేరు మాత్రమే కాదని, అది తెలంగాణ ఆత్మగౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. సుదీర్ఘ పోరాటంతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణకు న్యాయం చేసిన గొప్ప మహనీయుడు కేసీఆర్ అని కొనియాడారు. ఆయన లేకపోతే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమయ్యేది కాదని, ప్రతి అడుగులోనూ ఆయన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అభిప్రాయపడ్డారు. రైతుబంధు, మిషన్ భగీరథ, ఆరోగ్యశ్రీ విస్తరణ, గురుకుల పాఠశాలల స్థాపన వంటి విప్లవాత్మక పథకాల ద్వారా తెలంగాణను అభివృద్ధి పథంలో నిలిపిన ఘనత ఆయనకే దక్కుతుందని సతీష్ కుమార్ గుర్తు చేశారు. సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చి సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపిన నాయకుడిగా కేసీఆర్ ఎప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోతారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువజన, మహిళా విభాగం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని మిఠాయిలు పంపిణీ చేస్తూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువజన, మహిళా విభాగం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని మిఠాయిలు పంపిణీ చేస్తూ సంబరాలు చేసుకున్నారు.



# నిబంధనల మేరకు అత్యధిక పరిహారం

**కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**బాజు మల్లాయి గూడెం, రేలకాయపల్లి గ్రామాల భూ నిర్వాసిత రైతులతో చర్చ**

**ఖమ్మం, ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి) :**

సీతారామ ఎత్తిపోతల పథకం సంబంధించి భూ సేకరణకు నిబంధనల మేరకు అత్యధిక పరిహారం మంజూరు చేసి, భూ నిర్వాసితుల ఖాతాలకు జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్ మంగళవారం సింగరేణి మండలం బాజు మల్లాయి గూడెం, రేలకాయలపల్లి గ్రామాలలో సీతారామ ఎత్తిపోతల పథకం నిమిత్తం భూ సేకరణ కు సంబంధిత రైతులతో జిల్లా కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయపల్లి గ్రామాలలో సీతా రామ ఎత్తిపోతల పథకం 13వ ప్యాకేజీ నిర్మాణంలో భాగంగా భూ సేకరణ చేయాల్సి ఉండగా, భూ సర్వే నిర్వహించి అవార్డులు ప్రకటించామని, ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించామని అన్నారు. ప్రాజెక్ట్ రావాలని, అదేవిధంగా రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి, భూసేకరణ చేయాలని ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ప్రాజెక్టుతో సాగునీరు అంది, అక్కడి భూములు సారవంతం అవుతాయన్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూమిలో ఉన్న వ్యవసాయ పంపుసెట్ల, చెట్లు, సుబాబుల్ చెట్లు, ఇతర నిర్మాణాలకు సెపరేట్‌గా పరిహారం అందించామన్నారు. సుబాబుల్ చెట్లకు అటవీ శాఖ చే అంచనాలు చేయించి, పరిహారం అందించామన్నారు. రైతుల కోరిక మేరకు అటవీశాఖ అధికారులచే మరోసారి పరిశీలనలు చేసి, సుబాబుల్ చెట్ల విషయమై తగు న్యాయం చేస్తామన్నారు. కలెక్టర్ గా తనకున్న అధికారాలు, ప్రభుత్వ నిబంధనల మేరకు గరిష్ట పరిహారం అందజేసినట్లు, భూ నిర్వాసిత రైతులందరూ అంగీకరించి, భూ సేకరణకు సహకరించాలని, పనులకు ఆటంకం కల్పించవద్దని కలెక్టర్ అన్నారు. సమావేశంలో ఎస్‌డిసి ఎం.రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో జి.నర్సింహారావు, ఇర్రిగేషన్ ఇఇ కె.బాబూరావు, డిఇ ఎస్.కిషోర్, సింగరేణి మండల తహసీల్దార్ ఆనంతుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# బీసీలపై స్పష్టమైన రాజకీయ వివక్ష



- బడ్జెట్‌లో బీసీలకు న్యాయం చేయాలి
- లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా మహా ఉద్యమం
- నూనె హరిబాబు

**సత్తుపల్లి, ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి) :**

రాష్ట్రంలో బీసీలు మెజారిటీ జనాభా ఉన్నా.. బడ్జెట్ కేటాయింపులో బీసీలు మైనారిటీలా మారిపోతున్నారని, ఇది దురదృష్టకరం కాదు ఇది స్పష్టమైన రాజకీయ వివక్ష అని తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ కోకన్వీనర్ నూనె హరిబాబు యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో బీసీలకు న్యాయం చేయాలని లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా మహోద్యం తప్పదని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన హెచ్చరించారు. గత బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి కేవలం రూ. ఆరు వేల కోట్లు మాత్రమే కేటాయించారని, జనాభాలో 50 శాతం పైగా ఉన్న బీసీలకు 2 శాతం కేటాయించారని ఆయన గుర్తు చేశారు. ఈ సారి బడ్జెట్‌లో జనాభా నిష్పత్తికి తగ్గట్టుగా కనీసం 15% పైగా బడ్జెట్ కేటాయించాలని కోరారు. బిసిలకు బడ్జెట్ భిక్ష కాదని.. హక్కు అని అన్నారు. మరోమారు బిసిలను విస్మరిస్తే తగిన గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు.

# బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు



**మధిర, ఫిబ్రవరి 17, వుదయం ప్రతినిధి.**

మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పుట్టినరోజు వేడుకలను మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, మధిర నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి కలవకుండా చంద్రశేఖర రావు పుట్టిన రోజు సందర్భంగా మధిర నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా మధిర నియోజకవర్గ కేంద్రంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మధిర నియోజకవర్ ఇన్చార్జ్ లింగాల కమల్ రాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు కేక్,స్వీట్ జరిగింది.ఈ కార్యక్రమంలో మదిర నియోజకవర్గ విల హోదాల్లో ఉన్న బిఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు హాజరై కెసిఆర్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

# డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక మోటివేషన్ క్లాస్ లు




**మధిర, ఫిబ్రవరి 17, వుదయం ప్రతినిధి.**

మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం రాబోయే పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రత్యేక మోటివేషన్ తరగతి నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన డిగ్రీ స్థాయి విద్యార్థులకు పోటీ పరీక్షల ప్రాముఖ్యతను వివరిస్తూ,లక్ష్య నిర్దేశం, సమయ పాలన,క్రమశిక్షణ, పట్టుదల ఎంత ముఖ్యమో వివరించారు.పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలి,దినచర్య ఎలా రూపొందించుకోవాలి, పాఠ్యాంశాలపై పట్టు సాధించడానికి ఏ విధానాలు అనుసరించాలి వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకత్వం ఇచ్చారు.విజయానికి క్రమశిక్షణే మూలమని,ప్రతి రోజు నిర్దిష్ట సమయాన్ని చదువుకు కేటాయించి,స్వీయ విశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి కేంద్రీకరించి,నిరంతర సాధనతో మాత్రమే విజయాన్ని అందుకోవచ్చని ప్రోత్సహించారు.

కార్యక్రమానంతరం ఎంఈఓని సత్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.రవీంద్రారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జి అరుణ,అధ్యాపకులు డాఎస్ ఇందిర,డా పి సుజాత,డాకే రామకృష్ణ,డా వి నాగ రాజు,కే వెంకటేష్, షేక్ ఇమ్రాన్,ఎస్ జ్యోతి, ఎం హారిక,పి మాధురి,పి శ్రీనివాస్ మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**పోషకాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి**

**కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్**



**సూర్యాపేట, ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి) :**

జిల్లాలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు మహిళా, శిశు, దివ్యాంగుల ,వయో వృద్ధుల శాఖ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల ఎత్తు, బరువులను పరిశీలించి పోషకలోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకి ప్రత్యేక నూతన ప్రీ స్కూల్ సిలబస్ ప్రకారం బోధించే విధంగా చర్యలు తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాలు ఓపెన్ చేసి పోషన్ ట్రాకర్ ద్వారా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వయో వృద్ధుల మెయింటెనెన్స్ కేసులు, సమస్యలు పరిష్కరించాలనీ, మహిళాల పట్ల ఎలాంటి ఆకృత్యాలు జరగకుండా చట్టాల పై అవగాహన కల్పించాలన్నారు. సమీక్ష సమావేశంలో జిల్లా శిశు సంరక్షణ, ఉమెన్ వెల్ఫేర్, వయో వృద్ధుల గురించి చేయవలసిన వివిధ విషయాల పై సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో టాయిలెట్, డ్రింకింగ్ వాటర్, రిపేర్స్ తొందర గా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కే.నరసింహరావు, సూపరిండెంట్, జి.హుస్సేన్, డిసిపివో రవి కుమార్, ఏఫ్.ఆర్.వో బి.వినోద్ కుమార్, సంకల్ప, జిల్లా కోఆర్డినేటర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశాఖ మంత్రిని కలసిన జేఏసీ నాయకులు



**ఫిబ్రవరి 17 (ధర్మసాగర్ వుదయం ప్రతినిధి )**

ఈ రోజు ఎన్ హెచ్ ఎం జేఏసీ తలపెట్టిన ప్రజా ప్రతినిధుల ములాఖత్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో హెల్త్ డిపార్ట్మెంట్ కి పెద్ద దిక్కు అయినా హెల్త్ మినిస్టర్ శ్రీ దామోదర రాజనర్సింహ ని మినిస్టర్ హెడ్ క్వార్టర్ లో కలిసి ఎన్ హెచ్ ఎం ఉద్యోగస్తులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అలాగే పెండింగ్లో ఉన్న వేతనాల గురించి మరియు ఎన్నో సంవత్సరాల కల అయినా రెగ్యులరైజేషన్ గురించి చర్చించి వివిధ రాష్ట్రాలలో రెగ్యులర్ అయిన జీవోలను వారికి సమర్పించడం జరిగినది. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ మీ డిమాండ్లను త్వరితగతిన పూర్తి చేయిస్తానని హామీ ఇవ్వడం జరిగినది. అలాగే తెలంగాణ డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాష్ ని అలాగే రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మరియు బిసి వెల్ఫేర్ మంత్రివర్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగినది. వారి ఇరువురు కూడా స్పందిస్తూ మీ రెగ్యులరైజేషన్ గురించి ప్రభుత్వ దృష్టిలో ఉంది అని గుర్తు చేసుకుంటూ అలాగే చీఫ్ మినిస్టర్ రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని సానుకూలంగా స్పందిస్తూ హామీ ఇవ్వడం జరిగినది. ప్రజా ప్రతినిధులు అందరూ ఎన్ హెచ్ ఎం ఉద్యోగస్తులు అందరూ కరోనా కష్టకాలంలో ప్రజల ఆరోగ్యాలను కాపాడారని గుర్తు చేయడం గమనర్హం . నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ, ఈ ప్రభుత్వంలోనైనా రెగ్యులరైజ్ అయితమని నమ్మకంతో ఉన్నామని తెలియజేశారు.ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర కోర్ కమిటీ మెంబర్స్ డాక్టర్ మహేందర్ రావు పుట్ట, డాక్టర్ శ్రీనివాస్ , డీపీఓ రుక్మద్దీన్ , ఎండి గౌస్ పాషా , అలాగే రాష్ట్ర సోషల్ మీడియా ఇన్చార్జ్ ఎం నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి విద్యార్థి చదివేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి

◆ **అడిషనల్ కలెక్టర్ డాక్టర్ శ్రీజ**

**ఖమ్మం, ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి) :**

ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలలోని మండల విద్యాశాఖ అధికారులు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో మంగళవారం అడిషనల్ కలెక్టర్ డాక్టర్ శ్రీజ ఒక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. దీనికి జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్యజైని అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ డాక్టర్ శ్రీజ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదివేలా ప్రతి టీచర్ బాధ్యత వహిస్తూ బోధన అభ్యసన ప్రక్రియలను నిర్వహించాలని కోరారు. అదేవిధంగా వారి వారి పాఠశాలల్లో జరుగుతున్న ఎఫ్రీ చైల్డ్ రైట్స్ అనే కార్యక్రమం ప్రగతిని సమీక్షించారు. అదేవిధంగా ఫౌండేషనల్ లీటరసీ, న్యూమరసికి సంబంధించి ఎఫ్ఎల్ఎన్ శాంపిల్ స్టడీ కు సంబంధించి, ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీకు సంబంధించినటువంటి పలు కీలక సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్‌రెడ్డి, ఎంఈవోలు, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

**నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు**

**నందిచౌక్ వద్ద కేక్ కట్ చేసిన బీఆర్ఎస్ శ్రేణులు**



**ధర్మపురి ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశే ఖర్ రావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ శ్రేణులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. కేసీఆర్ సంపూర్ణ ఆయురా రోగ్యాలతో వర్ధిల్లాలని కోరుతూ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నందిచౌక్ వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రదాతగా కేసీఆర్ చేసిన సేవలు చిరస్మర ణీయమని కొనియాడారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోయిందని, భవిష్యత్తు లో ఆయన మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ అయ్యోరి రాజేష్ కుమార్, పట్టణ కన్వీనర్ బండారి రంజిత్, సీనియర్ నాయకులు సంగి శేఖర్, ఓడ్నాల మల్లేశం, చిలువేరి శ్యాంసుందర్, చిర్నేని నర్సయ్య, పెరుమాండ్ల ఎల్లగౌడ్, సయ్యద్ ఆసిఫ్, షమీ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ప్రభుత్వ పథకాలు చేరేలా పటిష్ట చర్యలు





**పెద్దపల్లి, ఫిబ్రవరి17 (వుదయం ప్రతినిధి) :**

రైతులకు ప్రభుత్వ పథకాలు చేరేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో. వ్యవసాయ శాఖ పనితీరు పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. ఎరువుల బుకింగ్ యాప్ ద్వారా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రతి రైతుకు అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉంచాలని, అవసరానికి మించి అధికంగా యూరియా వాడకుండా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. రైతు బీమా పథకం కింద అర్హులైన రైతులందరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రైతు బీమా కింద రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు ఏ కారణం చేత మరణించినప్పటికీ వారి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సొమ్ము వెంటనే అందుతుందని, ఈ పథకం అమలులో ఎటువంటి నిర్లక్ష్యం వహించ వద్దని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రైతు నమోదు కార్యక్రమం (ఫార్మర్ రిజిస్టర్) క్రింద ప్రతి రైతు తప్పనిసరిగా రిజిస్టర్ అయ్యే విధంగా చూడాలని, ఈ ప్రక్రియలో ఏదైనా రైతు పేరు నమోదు కాని పక్షంలో వారికి పీఎం కిసాన్ సమాన్ నిధి సంబంధించిన కేంద్ర ప్రభుత్వం అందించే సహాయం అందకుండా పోతుందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలు మన రైతులకు తప్పనిసరిగా చేరేలా జిల్లా యంత్రాంగం కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కోయ శ్రీ హర్ష వ్యవసాయ శాఖపై సమీక్ష

ప్రభుత్వాస్పత్రిలోని వైద్య సేవలు వినియోగించుకోవాలి...ఆసుపత్రిలో అందే వివిధ వైద్య చికిత్సలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం పెద్దపల్లి పట్టణంలో ఉన్న జిల్లా ఆసుపత్రి, మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రూ.24 లక్షలతో కంటి శస్త్ర చికిత్స విభాగంలో నూతనంగా కొనుగోలు చేసిన ఫాకో యంత్రం పని తీరు వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. కంటి శస్త్ర చికిత్స లను అత్యాధునిక పద్ధతుల్లో విజయవంతంగా చేసేందుకు వినియోగించే ఈ ఫాకో యంత్రం పెద్దపెల్లి జిల్లాలోలోనే ప్రథమంగా ప్రభుత్వ ఆసుపత్రిలోఏర్పాటు చేశామని, అవసరమైన ప్రజలు దీనిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే హాస్పిటల్‌లో లభించుచున్నయూరాలజీ సేవలు, లాప్రోస్కోపిక్ సర్జరీ సేవలు, హిస్టెరెక్టమీ, డెలివరీలు, స్కానింగ్, టిఫా స్కానింగ్ , రూట్ కెనాల్ చికిత్స సేవలు, నవ జాతి శిశు కేంద్రం సేవలు, ఆర్థో సర్జరీ సేవలు, ఆర్థ్రోస్కోపిక్ సర్జరీ సేవలు, 2డి ఎకో సేవలు, డయాలసిస్ సేవలు, కంటి సంబంధిత ఫాకో సర్జరీ సేవలు, టి హబ్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఆయన జిల్లా కలెక్టర్ వెంట అదనపు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, కంటి శస్త్ర చికిత్స నిపుణులు డా సబిహా తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ చెప్పిన జోగు రామన్న వినలేదు

◆ **ఎమ్మెల్యే పాయల్ శంకర్**

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి) :**

ఆదిలాబాద్ మున్సిపాలిటీలో 21 స్థానాలు గెలుచుకున్న బీజేపీకి మద్దతు ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తాను స్వయంగా ఫోన్ చేసి కోరానని, వెంటనే తప్పకుండా మద్దతు ఇస్తామని కేటీఆర్ చెప్పినప్పటికీ, జోగు రామన్న కేటీఆర్ మాట వినకుండా కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. కాంగ్రెస్‌కు ఎట్టి పరిస్థితుల్లో మద్దతివ్వం మని కేటీఆర్ చెప్పారని, కానీ స్థానికంగా జోగు రామన్న కాంగ్రెస్‌లో చేరేది ఉంది కాబట్టే కేటీఆర్ మాట వినకుండా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చారని ఆరోపించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాయల్ శంకర్ మాట్లాడుతూ... గత మున్సిపల్ పాలకవర్గంలో తన కొడుకు చేసిన అవినీతిని బీజేపీ ఎక్కడ బయట పెడుతుందోననే భయంతో జోగు రామన్న బిజెపికి మద్దతు ఇవ్వకుండా కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు. తాను సీఎం రేవంత్ రెడ్డికి అమ్ముడుపోయాడని ఆరోపణలు చేస్తున్న జోగు రామన్న మాదిరిగా తాను ఎవరికి అమ్ముడుపోయే పరిస్థితిలో లేనన్నారు. జోగు రామన్న మాదిరిగా లుచ్చ రాజకీయాలు చేయాల్సిన పని తనకు లేదన్నారు. రామన్న కు ఉన్న రాసలీలల సీడీ లు తనకు లేవన్నారు. నీతి తప్పి రాజకీయాలు చేసిన జోగు రామన్నకు త్వరలో హిందువులు, ఆదిలాబాద్ ప్రజలు త్వరలో చీపుర్లతో కొట్టే రోజులు వస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో లాలా మున్నా, జోగు రవి, ధోని జ్యోతి హనుమన్లు, దినేష్ మోటోలియా, శ్రీకాంత్, గంటా జీవన్, రాకేష్, సాయి. గోరక్, శివ బండారి సంతోష్, పద్మ, భీమ్సేన్‌రెడ్డి, సతీష్, సూర్య తదితరులు పాల్గొన్నారు.



# మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

◆ **రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి**

**కామారెడ్డి, ఫిబ్రవరి17 (వుదయం ప్రతినిధి) :**



ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, ఈఆర్ఓ, ఏఈఆర్ఓలతో ప్రత్యేక సమగ్ర సవరణకు ముందుగా చేపట్టిన మ్యాపింగ్ ప్రక్రియ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. బూత్ స్థాయి అధికారులకు సహాయ సహకారాలు అందిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఇందుకు గాను గ్రామ పాలన అధికారులు, ఇతర అధికారులను బూత్ స్థాయి అధికారులకు మ్యాపింగ్‌లో సహాయకులుగా నియమించి మ్యాపింగ్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి వారి పార్టీ నుంచి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని, బూత్ స్థాయి అధికారుల పర్యవేక్షకులు, ఏఈఆర్ఓలు వారికి మ్యాపింగ్ చేయడంలో సహాయ సహకారాలు అందించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జరిగేలా పకడ్బందీగా ప్రక్రియ చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో లు వీణ, పార్థ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు



**సత్తుపల్లి, ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి) :**

సత్తుపల్లి లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య క్యాంప్ కార్యాలయంలో మంగళవారం బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి కేసీఆర్‌కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాధన నుంచి రాష్ట్ర అభివృద్ధి వరకు కేసీఆర్ నాయకత్వం ఎల్లప్పుడూ అందరికీ స్ఫూర్తిదాయకమని నాయకులు పేర్కొన్నారు. ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కూచంపూడి మహేష్ రఫీ వల్లభనేని పవన్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్రిక్తంగా మారిన క్యాతనపల్లి మున్సిపాలిటీ

**-నా ఆడపడుచుల కంటే నాకు ఏది ఎక్కువ కాదు**

**-చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్**

**-క్యాతనపల్లి మునిసిపాలిటీ బంద్ కు పిలుపు..**

**రామకృష్ణాపూర్/ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి)**



వివేక్ మీ ఇంట్లో ఆడబిడ్డలు లేరా... మీరు నన్ను అడగవలసింది క్యాతన్ పల్లి మున్సిపల్ పదవి ఇచ్చి పడేస్తాం.. మా ఆడపడుచుల కంటే మునిసిపాలిటీ పదవి ఎక్కువేం కాదు, చెత్త నా కొడుకుల్లారా అంటూ ధ్వజమెత్తారు చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్. మంత్రి వివేక్ పై మండిపడ్డారు. బాల్క సుమన్ నివాసంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్, ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు రాజా రమేష్ లతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్పర్సన్, వైస్ చైర్మన్ , కౌన్సిలర్ల ఎన్నిక ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు కొందరు మందు తాగి కార్యాలయంలోకి వచ్చి మంత్రి వివేక్,ఎంపీ వంశీకృష్ణ ముందు తమ పార్టీ మహిళా కౌన్సిలర్లను తాకరాని చోట తాకారని ఫైరయ్యారు. మహిళా కౌన్సిలర్లు ఏడుస్తుంటే మనసు తరుక్కుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మీ అధికార మదంతో అహంకారంగా నడుచుకుంటున్నారని విరుచుకుపడ్డారు. బిఆర్ఎస్, సిపిఐ పార్టీలు కలిసి 22 వార్డుల్లో పోటీ చేసి 14 సీట్లు కైవసం చేసుకున్నామని, కోరం ఉన్నా సరే ఎన్నిక ఎందుకు వాయిదా వేస్తున్నారో ఎన్నికల అధికారులు ఎమ్మార్వో, జిల్లా కలెక్టర్ సమాధానం చెప్పాలని దుయ్యబట్టారు. కేవలం ఏడు సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏ విధంగా చైర్మన్, వైస్ చైర్మన్ పదవికి అర్హులైతారో ప్రజలే గమనించాలని కోరారు. ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన కౌన్సిలర్లకే మున్సిపల్ కార్యాలయంలో రక్షణ లేకపోతే ప్రజలకు ఏ విధంగా రక్షణ కల్పిస్తరని బిఆర్ఎస్, సిపిఐ కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా కౌన్సిలర్లపై అసభ్యకరంగా ప్రవర్తించిన నేపథ్యంలో క్యాతన్ పల్లి మున్సిపాలిటీ బంద్ కు పిలుపునిచ్చినట్లు వారు తెలిపారు.



# జెఇఇ 2026 ఫలితాల్లో 'రెజోనెన్స్' విజయ భేరి

**హనుమకొండ, ఫిబ్రవరి 17 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తాజాగా ప్రకటించిన జెఇఇ మెయిన్2026 సెషన్1 ఫలితాల్లో వరంగల్ రెజోనెన్స్ కు చెందిన 13 మంది విద్యార్థులు 99 కంటె ఎక్కువ పర్సంటైల్, 69 మంది విద్యార్థులు 95 పర్సంటైల్ పైన మరియు 141 మంది విద్యార్థులు 90 పర్సంటైల్ కి పైన స్కోర్ సాధించి ఎప్పటిలాగే రెజోనెన్స్ సత్తా చాటారు. బి.సాకేత్‌రెడ్డి (260310653522) 99.93, ఎస్.నాగ చైతన్య (260310339623) 99.78, పి.కార్తికేయ (260310124476) 99.76, ఎ. రీతిక (260310041885) 99.73, ఎం.సాయి కౌశిక్ (260310386378) 99.70, జె. హర్షిత (260310757255) 99.68, వై. సాత్విక (260310124456) 99.65, ఎండి. అసార్ ఇక్బాల్ (260310405614) 99.36, ఆర్. జయంత్ (260310262227) 99.34, సిహెచ్.సాయి వర్షిత్ (260310128622) 99.21, జి. వర్ధిని (260310129007) 99.18, ఎస్. ఆకర్ష్ (260310009384) 99.15, యం.సాత్విక్ రెడ్డి (260310791306) 99.02 పర్సంటైల్ సాధించారు.

వీరే కాకుండా చాలా మంది రెజోనెన్స్ వరంగల్ విద్యార్థులు జె.ఇ.ఇ. అడ్వాన్స్‌డ్ పరీక్ష అర్హత పొందటానికి అవసరమైన పర్సంటైల్తో పాటు ప్రతిష్టాత్మక యన్.ఐటిలలో సీట్లు సాధించడానికి కావాల్సిన పర్సంటైల్ సాధించారని రెజోనెన్స్ వరంగల్ విద్యాసంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను రెజోనెన్స్ యాజమాన్యం ఘనంగా సత్కరించారు. చైర్మన్ లెక్కల రాజిరెడ్డి మాట్లాడుతూ.. ఈ ఘన విజయం వెనుక తమ విద్యార్థుల నిరంతర కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, తమ ఫ్యాకల్టీ బోధన సామర్థ్యం, శ్రద్ధ దాగి ఉన్నాయని అభిప్రాయపడ్డారు. అత్యధిక పర్సంటేజ్ సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ.. రెజోనెన్స్ యాజమాన్యం, ఫ్యాకల్టీ అహర్నిశలు తమ వెంటే ఉండి తమకోసం శ్రమించి తాము విజయం సాధించేటా ప్రోత్సాహించారని తెలిపారు. కార్యక్రమంలో రెజోనెన్స్ వరంగల్ చైర్మన్ లెక్కల రాజిరెడ్డి, డైరెక్టర్స్ లెక్కల మహేందర్‌రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, సిఎఒ లెక్కల రమ్యరాజిరెడ్డి, అకడమిక్ డీన్ బిఎస్. గోపాలరావు కళాశాలల ప్రిన్సిపాల్స్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# పదో తరగతిలో వంద శాతం ఫలితాలను సాధించాలి

◆ **గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశిరామ్ నాయక్**

**బయ్యారం, ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి) :**

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నిర్వహించిన ఆశ్రమ పాఠశాల హెడ్మాస్టర్,హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో డిప్యూటీ డైరెక్టర్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో 10వ తరగతిలో 100% ఫలితాలను సాధించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు మెనూ తప్పకుండా పాటించి విద్యార్థులకు భోజనాలు అందించాలని ఆదేశించారు. సమావేశంలో ఏటిడిఓలు భాస్కర్, ఉపేందర్, ఏసీఎంఓ రాములు, ఈఓ సారయ్య, జీసీడిఓ విజయ, ఎస్ఓ కొమ్మలు, శ్రీకాంత్, అకౌంటెంట్ సుహాసిని, హెడ్మాసర్లు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# సత్తా చాటిన వరంగల్ కమిషనరేట్

**రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో పతకాల పంట**

**వరంగల్ క్రైం, ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి) :**



నేటి సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రారంభయిన నాల్గొవ తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో వరంగల్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ క్రీడాకారులు తోలి రోజున గతంలో ఎన్నడు లేనివిధంగా సత్తా చాటారు. తొలిరొజున వరంగల్ కమిషనరేట్ క్రీడాకారులు మొత్తం 11 పతాకాలను సాధించారు. ఇందులో ఒక గోల్డ్ మెడల, ఐదు సిల్వర్ మెడల్స్, నాలుగు బ్రాంజ్ మెడల్‌స్‌ను సాధించారు. పతకాలు సాధించిన వారిలో ఆర్మ్డ్ విభాగం పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ గుగులోత్ మౌనిక పది కిలోమీటర్ల పరుగు పందెంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ తోలి స్వర్ణ పతాకాన్ని అందించగా, ఆర్మ్డ్ రెజ్లింగ్‌లో హెడ్ కానిస్టేబుల్ సుజాత, మహిళా కానిస్టేబుళ్ళు రమ్య, ఎం.కళ్యాణి, ఫ్రీ రెజ్లింగ్ విభాగంలో కానిస్టేబుల్ కొండా నవీన్, జావిలిన్ త్రోలో మహిళా కానిస్టేబుల్ యం.లత సిల్వర్ మెడల్స్ గెలుచుకోగా, 40కిలో మీటర్ల సైకిలింగ్‌లో ఎస్.ఐ సాయి దివ్య, ఆర్మ్డ్ రెజ్లింగ్‌లో మహిళా కానిస్టేబుల్ ఎన్.మౌనిక,1500 మీటర్లలో మహిళా కానిస్టేబుల్ ఎస్.రవళి,కానిస్టేబుల్ రొమన్ రెజ్లింగ్‌లో కానిస్టేబుల్ జె.సతీష్‌తో పాటు, 4 x 400 మీటర్ల రిలే పరుగులో మహిళా కానిస్టేబుళ్ళు హెడ్ కానిస్టేబుల్ కానిస్టేబుల్ ఎన్.సుజాత, ఎస్.రవళీ, జి.మౌనిక, జె.పావని బృందం ఒక కాంస్య పతాకాన్ని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా తొలిరోజునే పదుల్లో పతాకాలను సాధించిన పోలీస్ క్రీడాకారులను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అభినందనలు తెలుపుతూ రాబోవు రోజుల్లో మరిన్ని పతకాలను సాధించాలని అకాంక్షించారు. ఈ క్రిడలకు సంబందించి ప్రారంభ వేడుకలు రేపు ఉదయం నిర్వహించబడుతాయి.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం




◆ **కలెక్టర్ రాజర్షి షా**

**అదిలాబాద్, ఫిబ్రవరి17 (వుదయం ప్రతినిధి) :**



బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, ఈ సాంఘిక దురాచారాన్ని అంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ వద్ద 'ష్యూర్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'బాల్య వివాహ విముక్తి ప్రచార రథాన్ని' ఆయన జెండా ఊపి ప్రారంభిచి సంస్థ రూపొందించిన అవగాహన కరపత్రాలను స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చట్ట ప్రకారం వివాహానికి అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండి ఉండాలని స్పష్టం చేశారు. ఈ వయస్సు కంటే తక్కువ ఉన్న వారికి పెళ్లి చేయడం నేరమని, ఒకవేళ బాల్య వివాహం చేస్తే తల్లిదండ్రులు, బంధువులతో పాటు దానికి సహకరించిన ప్రతి ఒక్కరినీ నేరస్తులుగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడంలో 'ష్యూర్' ఎన్జీవో చేస్తున్న కృషిని అభినందించారు. చిన్నారులకు సంతోషకరమైన, ఆరోగ్యకరమైన మరియు సురక్షితమైన భవిష్యత్తును అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం ప్రచార రథం పై ఏర్పాటు చేసిన సంతకాల సేకరణలో భాగంగా సంతకాన్ని చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, జిల్లా సంక్షేమ అధికారి కె. మిల్కా, జిల్లా అర్బన్ తాసిల్దార్ శ్రీనివాస్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్, ష్యూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ వినోద్, సిబ్బంది సంపత్ కిరణ్, సౌజన్య, రామకృష్ణ, సూపర్వైజర్లు మరియు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

**నార్నూర్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా..**

సంపూర్ణ అభియాన్ 2.0 లో భాగంగా నార్నూర్ మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం నార్నూర్ మండల కేంద్రం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సంపూర్ణత అభియాన్ 2.0 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంపూర్ణ అభియాన్ 2.0 కార్యక్రమాన్ని ఏప్రిల్ 14, 2026 నాటికి విజయవంతంగా పూర్తి చేయాలని లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. 6 నెలల నుండి 6 ఏళ్ల లోపు పిల్లలకు అదనపు పోషకాహారం అందించడం, గర్భిణీలు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని మార్చి 15 నుండి ముమ్మరం చేయాలని పశుసంవర్ధక శాఖ అధికారులకు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లకు డేటా నమోదు కోసం కొత్త టాబ్లెట్లు పంపిణీ చేస్తామని, తద్వారా పర్యవేక్షణ సులభతరం అవుతుందని పేర్కొన్నారు. సంపూర్ణ అభియాన్ 2.0 లో భాగంగా ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ కింద నార్నూర్ మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని అందరూ ప్రతిజ్ఞ చేసి అనంతరం సంబంధిత పోస్టర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐటిడిఏ పీఓ యువరాజ్ మర్మాట్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డిఆర్డీఓ రవీందర్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, నీతి అయోగ్ ప్రోగ్రామ్ అధికారి రాహుల్, మహిళ సంఘాల సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**నార్నూర్‌లో ఐసిటి కేంద్రాన్ని ప్రారంభం..**

నార్నూర్ మండల కేంద్రంలోని సరస్వతి మహిళా సమైక్య భవనంలో స్వాశోధన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐసిటి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించి, సాంకేతిక శిక్షణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు 'సమవేశి అజీవిక యోజన' (ఎస్ఏవై) పథకం అమలుపై అవగాహన సదస్సు నిర్వహించి కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని, ఎస్ఏవై పథకం ద్వారా మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, ప్రతి మహిళా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం సమృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐటిడిఏ పీఓ యువరాజ్ మర్మాట్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, డిఆర్డీఓ రవీందర్, స్థానిక సర్పంచ్ కావేరీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఫ్యాకల్టీ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

## హాజరైన మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్


శ్రీ వెంకట కాజా అప్ప గారి 40 వార్షికోత్సవ సందర్భంగా దర్గాను సందర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

**వట్టిపల్లి , ఫిబ్రవరి 16 (వుదయం ప్రతినిధి)**

ఈ రోజు వట్ పల్లి మండల కేంద్రంలో శ్రీ సద్గురు వెంకట ఖజ అప్పగారి 40వ వార్షికోత్సవ వేడుకలలో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి పాల్గొని అప్ప గారికి గంధం, పూలు, చదర్ సమర్పించారు అనంతరం చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర సాధకుడు తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సార్ గారి జన్మదిన వేడుకలు మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ చేతులు మీదగా మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ అప్పగారి 40 వార్షికోత్సవ సందర్భంగా సందర్శించడం సంతోషంగా భావించి ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారి జన్మదినలో పాల్గొనడం సంతోషంగా ఉందా అని మాజీ ఎమ్మెల్యే అన్నారు కార్యక్రమంలో మాజీ వరము చెర్మన్ వీరారెడ్డి, మండల బిఆర్ఎస్ పార్టీ ప్రధానకార్యదర్శి శివాజీ రావు, మండల మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు నర్సిములు, మండల రైతు బంధు మాజీ అధ్యక్షులు అశోక్ గౌడ్, మండల సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, బుద్దిరెడ్డి, బస్వరాజ్, నర్సిములు, మధు,



ఖయ్యూమ్, మారుతిరావు, మల్లేశం, సర్పంచ్ లు వీరారెడ్డి, రామన్న పటేల్, నరేష్ గౌడ్, నర్సిములు, నాయకులు సుభాష్ గౌడ్, ధనివేందర్ రావు, శ్రీనివాస్ గౌడ్, ఘని, ప్రభాకర్, ప్రకాష్, కిరణ్, మహేందర్ గౌడ్, మల్లయ్య, కిషన్ రావు, బాలాజీరావు, నర్సిములు, శ్రీనివాస్ గౌడ్, అఖిల్, దశరథ్, గుండయ్య, శ్రీనివాస్, పాషా, శ్రీకాంత్, సంగమేష్ గౌడ్, ఖలీల్, పార్టీ కార్యకర్తలు, కెసిఆర్ సార్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

సేవా కార్యక్రమాలతో సందడి చేసిన పార్టీ శ్రేణులు

**చండూరు, ఫిబ్రవరి 16 (వుదయం ప్రతినిధి)**




చండూరు మున్సిపాలిటీలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చి ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చండూరు మండల మాజీ ఎంపీపీ తోకల వెంకన్న, మాజీ జడ్పీటీసీ అన్నెపర్తి శేఖర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి కేసీఆర్ చేసిన త్యాగాలు, ఆయన నిరంతర పోరాటం, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన దూరదృష్టి నాయకత్వం గురించి వివరించారు. పేదల సంక్షేమం, రైతు బాంధవ పథకాలు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలతో రాష్ట్రాన్ని దేశంలో ప్రత్యేక స్థానంలో నిలిపారని కొనియాడారు. ప్రస్తుత బీఆర్ఎస్ కౌన్సిలర్లు తెలుకుంట్ల రాజకుమారి చంద్రశేఖర్, కొండ్రెడ్డి మధు, సామ సుజాత యాదవ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. తెలంగాణ కోసం ఆయన చేపట్టిన దీక్షలు, ఉద్యమాలు, ప్రజలలో నింపిన ఆత్మవిశ్వాసం చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని తెలిపారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. జన్మదిన వేడుకలు కేవలం సంబరాలకు మాత్రమే పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలకు వేదికయ్యాయి. పేదలకు అన్నదానం, మొక్కల నాటకం, రక్తదాన శిబిరాల నిర్వహణ ద్వారా సేవా భావాన్ని చాటుకున్నారు.
యువత రాష్ట్ర అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు. మొత్తానికి, చండూరు మున్సిపాలిటీలో జరిగిన కేసీఆర్ జన్మదిన వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొత్తపాటి సతీష్ , గుంటి వెంకటేశం ,మండల అధ్యక్షుడు పాటల వెంకన్న
,మాజీ సర్పంచ్ రామగిరి సుభాష్ , బొడ్డు సతీష్ ,మాజీ మండల అధ్యక్షుడు వెంకన్న , తాడిశట్టి సంతోష్ , భూతరాజు వెంకన్న , ఇరిగి గురునాథం, ఇరిగి రామకృష్ణ ,భూతరాజు యాదగిరి , కళ్యాణ్, శిర్ధపల్లి సర్పంచ్ దామెర రాములు,రావుల రజిత రవి, ఉపసర్పంచ్ ఆంజనేయులు, దశరథ, చంద్రశేఖర్, దొంతరగొని వెంకటేష్ ,బొమ్మర బోయిన రమేష్, వివిధ గ్రామాల సర్పంచ్లు
తదితరులు పాల్గొన్నారు.

### గిరిజన బాలికల గురుకుల పాఠశాలను

# ఆకస్మిక తనిఖీ జిల్లా కలెక్టర్



**అచ్చంపేట, ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి)**

మండల పరిధిలోని ఐనోల్ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలను మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేసి, వసతులు, భోజన నాణ్యత, మరియు పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ఆరా తీసి, నాణ్యమైన విద్యను, పౌష్టికాహారాన్ని అందించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కిచెన్ షెడ్, కూరగాయలు, బియ్యం, పప్పులు, ఇతర సామగ్రిని పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లో మెనూ ప్రకారం వంటలు చేయాలన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. వంట విషయంలో ఎలాంటి పొరపాట్లు చేయవద్దని సిబ్బందిని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.....,రానున్న పదవ తరగతిలో పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా బాలికలను సంసిద్ధం చేయాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. 100% ఉత్తీర్ణత సాధించాలని, పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చేలా కృషి చేయాలని కోరారు. విద్యాతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రతి విద్యార్థిని తప్పనిసరిగా విద్యావంతురాలు కావాలని, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని కలెక్టర్ ఈ సందర్భంగా విద్యార్థినులకు సూచించారు. తరగతి గదిలో విద్యార్థుల గణిత, ఆంగ్ల సామర్థ్యాలను కలెక్టర్ పరిశీలించారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

### ఇంటర్మీడియట్ - 2026 వార్షిక పరీక్షలను

# పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ బి.ఎమ్.సంతోష్

**గద్వాల, ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి)**



జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్ నందు ఇంటర్ విద్య, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీసు, రవాణా, వైద్య ఆరోగ్యం, విద్యుత్ తదితర శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 25 నుండి మార్చ్ 16 వరకు జరిగే ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 14 పరీక్షా కేంద్రాల్లో 8,471 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరిలో ఫస్ట్ ఇయర్ స్టూడెంట్లు 4,366 సెకండ్ ఇయర్ 4,105 మంది ఉన్నారన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు చీఫ్ సూపరిడెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్లు, డిపార్ట్మెంట్ అధికారులు, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి కఠినమైన నిఘా పెట్టాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమును పోలీస్ స్టేషన్ లోనే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాల రవాణాకు పోలీస్ ఎస్కార్ట్ ఇవ్వడంతో పాటు పరీక్షల పర్యవేక్షణ కోసం ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ముందుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ ఉన్నందున జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎవరు సెల్ఫోన్ తీసుకురావడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్సు సర్వీసులు నడిపేలా ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తగిన మందులతో ఆశాలను అందుబాటులో ఉంచాలని వైద్య శాఖ అధికారులను సూచించారు. పరీక్షా సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, ఆర్డీఓ శ్రీనివాస రావు, అడిషనల్ ఎస్పీ శంకర్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హృదయ రాజు, విద్యుత్ శాఖ అధికారి రమేష్ బాబు, ఆర్టీసీ అధికారి సునీత, విద్యా శాఖ సహాయ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలే లక్ష్యం

## సిద్ది పేట పురవీధుల్లో పోలీస్ కమిషనర్ అశ్రిత్ కుమార్ తనిఖీలు




**సిద్దిపేట, ఫిబ్రవరి 16 (వుదయం ప్రతినిధి)**

సిద్దిపేట పట్టణంలో కమిషనర్ అశ్రిత్ కుమార్ పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి అభివృద్ధి, పరిశుభ్రత పనులను పరిశీలించారు.
మొదటగా ఉదయం పురపాలక సంఘ కార్యాలయంలో వార్డ్ ఆఫీసర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల హాజరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్చి నెల పూర్తయ్యే లోపు 100 శాతం పన్ను వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టణ ప్రజలు సైతం సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని సూచించారు. వాణిజ్య వ్యాపారస్తులు తమ ట్రేడ్ లైసెన్సులు గడువులోగా చెల్లించాలని తెలిపారు.
అనంతరం 11వ వార్డు కాలకుంట కాలనీలో పర్యటించి పలు సమస్యలను పరిశీలించారు. కాలనీలో కొత్త సీసీ రోడ్లు వేయాల్సిన అవసరాన్ని దాసరి శ్రీనివాస్ యాదవ్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వార్డులోని మహిళా భవనాన్ని వార్డ్ కార్యాలయంగా వినియోగిస్తూ, మున్సిపల్ కార్యకలాపాలు అక్కడి నుంచే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మహిళా భవనం సమీపంలో రోడ్డుమధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని రోడ్డు వెలుపలికి మార్చి వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని సూచించారు.
18వ వార్డులోని హనుమాన్ నగర్లో సీసీ రోడ్డు పనులను పరిశీలించి, అండర్గ్రౌండ్ డ్రైనేజీ ఛాంబర్లు రోడ్డు స్థాయికి సరిపడేలా ఎత్తు పెంచాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అదే సమయంలో మురికికాలువల్లో చెత్త వేయడం గమనించి, ఇంటింటికి వచ్చే మున్సిపల్ చెత్త వాహనానికి మాత్రమే తడి, పొడి, హానికర వ్యర్థాలను వేరు చేసి అందించాలని నివాసితులకు అవగాహన కల్పించారు.
2వ వార్డు నర్సాపూర్లో కొత్తగా వేసిన సీసీ రోడ్ల నాణ్యతను పరిశీలించి, రోడ్లపై ఎండు గడ్డి వేసి నీరు పోస్తూ తేమగా ఉంచాలని కాంట్రాక్టర్కు సూచించారు. పర్యటనలో భాగంగా మిలన్ గార్డెన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి చెత్త వేయడం గమనించి వాహనాన్ని నిలిపివేయించారు. పట్టణ పరిశుభ్రత కోసం మున్సిపల్ సిబ్బంది కృషి చేస్తున్నారని, చెత్త ఎక్కaడపడితే అక్కడ వేయడం వల్ల అపరిశుభ్రత ఏర్పడుతుందని హెచ్చరించారు. మరోసారి ఇలాంటి చర్యలు పునరావృతమైతే చట్టరీత చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
బస్ డిపో సమీపంలోని మురికికాలువ సమస్యను పరిశీలించి, ఫుట్పాత్ కింద ఉన్న కాలువలోని సిల్ట్ను వెంటనే తొలగించి నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, దాసరి శ్రీనివాస్ యాదవ్, అడ్డగట్ల శేఖర్, అంజి, కౌన్సిలర్ నాయిని చంద్రం, ఏఈఈ పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

# టీజీసెట్ హాల్ టిక్కెట్లు విడుదల

**మహబూబాబాద్, ఫిబ్రవరి 17(వుదయం ప్రతినిధి) :**




తెలంగాణ గురుకులం కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీసెట్ 2026) హాల్ టిక్కెట్లు విడుదలయ్యాయని నేటి నుంచి ఈ నెల 22 వరకు హాల్ టికెట్లను https://share.google/BU4yEp-TenYgIcWeOY వెబ్ సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చునని మహబూబాబాద్ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ, జిల్లా సమన్వయ అధికారి జి. జయశ్రీ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. 2026–27 అకడమిక్ ఇయర్ కి సంబంధించి 5 నుండి 9 వరకు తరగతుల్లో ప్రవేశాల కోసం అన్ని గురుకులాల సెంటర్లలో ఈ పరీక్షను నిర్వహించనున్నారు. పరీక్షకు ఖచ్చితంగా ఆధార్ కార్డు జీరాక్స్ , బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్, వాటర్ బాటిల్ మరియు ఎగ్జామ్ పాడ్ వెంట తీసుకు రావాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాలలో మొత్తం (5352) మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నారని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

### బాల్య వివాహాలను అరికట్టడానికి

# ప్రతి ఒక్కరు కృషి చేయాలి

కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్, ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి)**



బాల్య వివాహాలను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతతో కృషి చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. సహాయ వెల్ఫేర్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ మరియు జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కోసం ఏర్పాటుచేసిన ప్రచార రథాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు.
ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ బాల్యం అమూల్యమైన దశ అని, బాల్య వివాహాలు పిల్లల చదువు, ఆరోగ్యం, శారీరక–మానసిక అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. చదువు మధ్యలో ఆగిపోవడం వల్ల జీవితాంతం ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని, బాలికల విద్యను ప్రోత్సహిస్తూ ఉచిత విద్యను అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. పిల్లలు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సహాయ వెల్ఫేర్ అసోసియేషన్ స్వచ్ఛందా సంస్థ డైరెక్టర్ రాజ్ కమల్ రెడ్డి కోఆర్డినేటర్ పోలవేణి భూమేష్, భూపాలపల్లి కో ఆర్డినేటర్ తిరుపతి, ఒంటెల కరుణాకర్ రెడ్డి, బోయినిపల్లి ప్రవీణ్ కుమార్ మ్యూనిటీ మొబిలైజర్లు లత, శ్యామల, లహరి, కోమలత, శ్రీలత, ప్రభా లత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

**అందోల్ ,ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి)**





మెదక్ జిల్లా అల్లాదుర్గంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం కళాశాల వార్షికోత్సవము, ద్వితీయ సంవత్సరము విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమము, కళాశాల క్రీడా దినోత్సవం కార్యక్రమమును నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి కె లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆత్మ విశ్వాసం, దృఢ సంకల్పంతో ముందుకు వెళ్లాలని తెలిపారు. నాకు రాదు అనే ఆత్మ నున్యతా భావంతో ఏ పని నీ చేపట్టినట్లయితే జీవితంలో విలువైన సమయాన్ని కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. విద్యార్థి ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని వాళ్ళ లక్ష్యసాధనలో అకుంటిత దీక్షతో సాధన చేస్తే విజయం సాధిస్తారని తెలిపారు. ఈకార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ తుకారం మాట్లాడుతూ కళాశాలలో గల సౌకర్యలను గురించి వివరించి రాబోయే వార్షిక పరీక్షలలో ప్రతి విద్యార్థిని విద్యార్థులు మంచి ఫలితాన్ని సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. తల్లి దండ్రులకు పేరు తీసుకురావాలని తెలిపారు. ఈకార్యక్రమంలో బాలికల పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడిన అనంతరం క్రీడాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థి కౌన్సిలర్ నరసింహారెడ్డి, అధ్యాపకులు శ్యామ్ రావు రవికుమార్ రవీందర్ శివకుమార్ డాక్టర్ దత్తు శంకర్ స్రవంతి ప్రవీణ్ కుమార్

తదితరులు పాల్గొన్నారు

### జేఈఈ మెయిన్స్లో

# రేస్ విద్యార్థుల ప్రభంజనం

*99.56 పర్సంటైల్ తో సత్తా చాటిన ముక్కా చరణ్ సాయి గౌడ్*




**కోదాడ, ఫిబ్రవరి 17(వుదయం)**

జేఈఈ మెయిన్స్ ఫలితాలలో కోదాడ రేస్ ఐఐటి–మెడికల్ అకాడమీ విద్యార్థులు జాతీయస్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి మరోసారి తమ ప్రతిష్టను చాటుకున్నారు. సోమవారం విడుదలైన జేఈఈ మెయిన్స్ (సెషన్–1) ఫలితాల్లో అకాడమీకి చెందిన విద్యార్థులు ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో మెరుగైన స్కోర్లు సాధించారు. అకాడమీ విద్యార్థి ముక్కా చరణ్ సాయి గౌడ్ 99.56 పర్సంటైల్ సాధించి విశేష ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా రేస్ ఐఐటి–మెడికల్ అకాడమీ చైర్మన్ బాణాల వసంత రెడ్డి జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ సంస్థ నుంచి గణనీయమైన సంఖ్యలో విద్యార్థులు ఎన్ఐటీ (NIT), ట్రిపుల్ ఐటీ (IIIT) వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో ప్రవేశాలు పొందడంతో పాటు జేఈఈ అడ్వాన్స్డ్కు అర్హత సాధిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఒత్తిడి లేని వాతావరణంలో కాన్సెప్ట్ ఆధారిత బోధన అందించడం వల్లే ఈ విజయాలు సాధ్యమవుతున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులను ఐఐటీ స్థాయికి చేర్చడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల అంకితభావమే ఈ ఫలితాలకు కారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, సాంబశివ రావు, సతీష్,
వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యులకు ప్రత్యేక శిక్షణ

## మండల కేంద్రంలోని రైతు వేదికలో నూతన వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం బాన్సువాడ డిఎల్పిఓ ప్రసాద్

**నిజాంసాగర్,ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి):**



మహమ్మద్నగర్ మండల కేంద్రంలోని గున్కుల్ సహకార సంఘం పరిధిలోని మండల కేంద్రంలో ఉన్న రైతు వేదికలో నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంగళవారం ముఖ్య అతిథిగా బాన్సువాడ డిఎల్పిఓ ప్రసాద్ హాజరై మార్గదర్శక ప్రసంగం చేశారు.
ఈ సందర్భంగా డిఎల్పిఓ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు గ్రామీణ అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాల అమలులో కీలక బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. పంచాయతీ రాజ్ చట్టంలో పొందుపరచిన వివిధ నిబంధనలు, విధులు, బాధ్యతలు, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో స్థానిక సంస్థల పాత్ర, చట్టం ద్వారా కల్పించిన రక్షణలు, ఆర్థిక వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కలిగి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజల సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల సమర్థ అమలు వంటి అంశాల్లో వార్డు సభ్యులు చురుకుగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు పారిశుద్ధ్యం, స్వచ్ఛత కార్యక్రమాలు, త్రాగునీరు,వీధి దీపాలు, డ్రైనేజీ, వంటి మౌలిక వసతుల అభివృద్ధి పనుల పర్యవేక్షణ, నిధుల సక్రమ వినియోగంపై పలు సూచనలు చేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సేవాభావంతో పనిచేయాలని ఆయన అన్నారు.
మండల ఎంపీడీవో సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర అత్యంత కీలకమని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గ్రామ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. పంచాయతీ రాజ్ చట్టం, అభివృద్ధి కార్యక్రమాల అమలు విధానం, నిధుల వినియోగం తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామాల వార్డుల సభ్యులతో పాటు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



# ఇల్లందు నూతన మున్సిపల్ ఛైర్మెన్ గా దొడ్డ కిరణ్

**ఇల్లందు, ఫిబ్రవరి 17(వుదయం ప్రతినిధి)**

ఇల్లందు మునిసిపాలిటీ ఛైర్ పర్సన్ అభ్యర్థిగా రెండవ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన దొడ్డ కిరణ్ మిత్రను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మంగళవారం ఖరారు చేసింది. దొడ్డ కిరణ్ మిత్ర భర్త పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా పార్టీకి విధేయతగా పనిచేస్తున్న వారికే ఈ పదవి కట్టబెట్టడం విశేషం.

# అంగన్వాడీలను తొలగించేందుకే పాఠశాలలో విలీనం

## సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్




**దమ్మపేట ,ఫిబ్రవరి 17 (వుదయం ప్రతినిధి):**

స్కీం వర్కర్లు అయిన మధ్యాహ్నం భోజనం అంగన్వాడి ఉద్యోగులను తొలగించేందుకే పాఠశాలల విలీనం అని అంగన్వాడి కేంద్రాలపై స్థానిక సర్పంచుల అజ్మయిసి అన్ని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ అన్నారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మండల కమిటీ సమావేశం విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ పేదల పిల్లలు కు అన్ని విధాలుగా సేవలందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు అంగనవాడి ఉద్యోగులు పొమ్మనకుండా పగ పెట్టినట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని అన్నారు. కేంద్ర బడ్జెట్లో స్కీం వర్కర్లకు ఒరిగిందేమీ లేదని కనీసం రానున్న రాష్ట్ర బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల ప్రకారం ఆశ అంగన్వాడి మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కన్వీనర్ మురహరి రఘు మాట్లాడుతూ కార్మిక చట్టాలు అమలు చేయాలని లేబర్ కోడ్లు రద్దు చేయాలని సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసిన కార్మిక వర్గానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ సభ్యులు కవులూరి రామకృష్ణ సత్యవతి, ఈశ్వరమ్మ, రాములమ్మ,యశోద, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ హాయంలోనే పలిమేల మండల అభివృద్ధి

## బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆలం సత్యనారాయణ

**జయశంకర్ భూపాలపల్లి, వుదయం:**



కెసిఆర్ హాయంలోనే పలిమేల మండల అభివృద్ధి చెందింది అని బిఆర్ఎస్ పార్టీ పలిమేల మండల అధ్యక్షుడు ఆలం సత్యనారాయణ అన్నారు. మంగళ వారం పలిమేల మండలకేంద్రంలో తెలంగాణా రాష్ట్ర సాధకుడు, ఉద్యమ కారుడు, తెలంగాణా రాష్ట్ర తొలి ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినం సందర్భంగా కేక్ కటింగ్ చేసి, మిఠాయిలు పంచి మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆలం సత్యనారాయణ తోపాటు పలువురు నాయకులు మాట్లాడుతూ కెసిఆర్ నాయకత్వంలోనే తెలంగాణా అభివృద్ధి చెందిందని అన్నారు. పలిమేల మండల అభివృద్ధి పుట్ట మధన్న నాయకత్వంలో కెసిఆర్ ప్రభుత్వంలో జరిగిందని అన్నారు. కొత్తగా పలిమేలా మండలం, మోదేడు నూతన గ్రామ పంచాయతీ, రోడ్డు సౌకర్యాలు, బ్రిడ్జిలు అయినాయని నాయకులు గుర్తు చేశారు. రైతులకు రైతు బందును ఇచ్చిన నాయకుడు కెసిఆర్ అని అన్నారు. నేడు రైతు బంధు కోసం రైతులు వేచి చూసిన ఇప్పటికి ఇవ్వకపోవడం ప్రభుత్వం నిర్లక్ష్యం అని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు దాటినా మహిళలకు ఇస్తామ్మన్న 2500/–రూపాయలు,వికలాంగులకు, వితంతువులకు తదితర పెన్షన్లు పొందే వారికి సహాయం పెంచలేదన్నారు.ఇలా అనేక హామీలు ఇచ్చి అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి ప్రజలు వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ మంథని నియోజకవర్గంలోని అన్ని మండలాలతో పోలిస్తే పలిమేల మండలంలోని అధ్యధిక ఓటర్లు కాంగ్రెస్ పార్టీ కంటే బిఆర్ఎస్ పార్టీనే ఆదరించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షులు లంగారి రవీందర్, కుమ్మరి సారయ్య, గోమాస ఆదినారాయణ, సప్పిడి మాంతయ్య, ఎసయ్య, కలుగూరి సమ్మయ్య,మోతె కిష్టయ్య, పదాల రమేష్,కమ్మల రంజిత్, మడే సత్యనారాయణ, కాల్వపల్లి వెంకటి,జనగామ రామ్మూర్తి, కుమ్మరి పోచమల్లు, యూత్ నాయకులు మోతె ప్రశాంత్, పాగె సంతోష్, బొచ్చు తిరుపతి,దుంప నరేష్, టింగ రాకేష్, గడ్డేమ్ ఉదయ్ కిరణ్, వాసం నవీన్, బాను చందర్, బాపు, రవి, కాల్వపల్లి శ్రీను, రూపేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

# సద్గురు సేవలాల్ మహరాజ్ సేవలు మరువలేనివి

## బంజారా జాతి ఐక్యం కోసం వివిధ రాష్ట్రాల్లో పర్యటన

**నర్సంపేట, వుదయం**



బంజారా జాతి గిరిజనుల కోసం గిరిజనుల ఆరాధ్య దైవం సద్గురు సేవలాల్ మహరాజ్ చేసిన సేవలు మరువలేనివని జగదాంబ సేనా వరంగల్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర యాకుబ్ మహరాజ్ అన్నారు.సద్గురు సేవలాల్ మహరాజ్ 287 వ జయంతిని పురస్కరించుకొని వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని మేడపల్లి గ్రామ పంచాయతీ శివారు లక్ష్మీతండాలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.అలాగే వారి కుల దైవం భోగ్ బండారో వేడుక సాంప్రదాయ పద్ధతిలో వైభవంగా నిర్వహించారు.జగదాంబ సేనా వరంగల్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర యాకుబ్ మహరాజ్తో పాటు కుటుంబ సభ్యులు,ఆయా గ్రామాల గిరిజనులు వారి సాంప్రదాయ దుస్తుల అలంకరణతో ఆ గ్రామం ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకున్నది.బంజారా సమాజ ఆరాధ్య దైవం సద్గురు సేవలాల్ మహరాజ్ విగ్రహానికి వివిధ రకాల పంచామృత అభిషేకాలు ఘనంగా చేపట్టారు.భోగ్ బండారో వేడుక నేపథ్యంలో అజ్మీర యాకుబ్ మహరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.నెయ్యితో చేపట్టిన ప్రత్యేక పూజలో అగ్నిజ్వాలలు ఒక్కసారిగా బారీ ఎత్తున వెలువడంతో సాక్షాత్తు వారి దేవతలు నిజస్వరూపం కనిపించిందని భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బంజారా కులదైవాలు,సద్గురు సేవలాల్ మహరాజ్ నామస్మరణతో లక్ష్మీతండా మారుమ్రోగింది.బంజారా మహిళలు వారి సాంప్రదాయ వేషధారణతో పలు ఆధ్యాత్మిక భజనలు చేస్తూ నృత్యాలు చేపట్టారు.ఈ సందర్భంగా జగదాంబ సేనా వరంగల్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర యాకుబ్ మహరాజ్ మాట్లాడుతూ బంజారా ఆరాధ్య దైవం సద్గురు సేవలాల్ మహరాజ్ బోధనలు సమాజంలో ఐక్యత,సేవాభావాలు,నీతి నియమాలు పెంపొందించాయని పేర్కొన్నారు.ప్రస్తుత ఆధునిక సాంకేతిక వలన బంజారా సంప్రదాయాలు రోజురోజుకు వెనకపడుతున్నాయని,కొందరు సాంప్రాయాలను వదిలేసి ఇతర మతాలను ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.బంజారా జాతి ఆవిర్భావ ప్రాంతాలైన మ హారాష్ట్ర, రాజ స్తాన్, క ర్ణాట క రాష్ట్రాలలో పర్యటనలు చేస్తూ జాతి విశిష్టత ప్రాముఖ్యత తెలుసుకుంటున్నట్లు అజ్మీర యాకుబ్ మహరాజ్ వివరించారు.ఈ నేపధ్యంలో గిరిజన బంజారా జాతి గొప్పతనాన్ని తెలంగాణ రాష్ట్రంలో తెలియపరచడానికి,ఐక్యత పెంపొందించడానికి రాష్ట్ర స్థాయిలో మహా సభలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.బంజారా జాతి సంప్రదాయాల వలన అనేక అద్భుతమైన ఆధ్యాత్మికత కలిగివున్నది అన్నారు.బంజారాలను సన్మార్గంలో నడిపిస్తూ అహింస అహింస సిద్ధాంతాలను ప్రబోధించడమే లక్ష్యమని జగదాంబ సేనా వరంగల్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర యాకుబ్ మహరాజ్ స్పష్టం చేశారు.అనంతరం అన్నదాన వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, అజ్మీర తుల్చ నాయక్,భాస్కర్ నాయక్,మంజుల, అనిల్ నాయక్,వివిధ గ్రామాల ప్రజలు,భక్తులు హాజరయ్యారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోటనీ విభాగం ఆధ్వర్యంలో ఒక రోజు జాతీయ స్థాయి సెమినార్

### కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్

**నర్సంపేట, వుదయం**



ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ నర్సంపేట, బోటనీ విభాగం ఆధ్వర్యంలో ఒక రోజు జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ"రీసెంట్ అడ్వాన్సస్ ఇన్ ప్లాంట్ సైన్స్ ఇష్యూస్ అండ్ ఛాలెంజెస్ ఇన్ క్రాఫ్ట్ ఇంప్రూవ్మెంట్"అనే అంశంపై ఈ జాతీయ సదస్సును మార్చి 17, 2026న రాష్ట్ర ఉచ్ఛరిత శిక్ష అభియాన్ (రూసా) సౌజన్యంతో నిర్వహిస్తున్నామని,సదస్సు నిర్వహించడం కళాశాలకు గర్వకారణమని వెనుకబడిన గ్రామీణ ప్రాంతంలో ఉన్న కళాశాల పరిశోధనలో మాత్రం ఉన్నత స్థానంలో ఉన్నదని ఇందులో భాగంగా దేశంలో ఉన్న వివిధ పరిశోధన ఔత్సాహికుల నుంచి పరిశోధన పత్రాలను కోరుతున్నామని జాతీయ సదస్సు కళాశాల ప్రయాణంలో మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సెమినార్ కన్వీనర్ బోటనీ విభాగాధిపతి డా. ఎం. రాంబాబు మరియు అధ్యాపక బృందంతో కలిసి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ సంబంధిత కళాశాల జాయింట్ డైరెక్టర్లు మరియు ఏజీవో(అసిస్టెంట్ గవర్నమెంట్ ఆఫీసర్) లను మర్యాదపూర్వకంగా కలసి, సెమినార్ వాల్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు జేడీ జోన్ 1ప్రొఫెసర్ డాక్టర్ ఏడీఅర్ రాజేంద్రసింగ్ సెమినార్కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మొక్కలపై పరిశోధన కార్యక్రమాలు చాలా అవసరమని అలాంటి అంశాన్ని ఎంచుకొని ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో ఉన్న కళాశాల గ్రామీణ వాతావరణ పరిస్థితులకు మేలు చేసే విధంగా జాతీయ సదస్సును నిర్వహించడం నిజంగా పుట్టిన నేల రుణం తీర్చుకోవడం లాంటిదే అని మిగిలిన కళాశాలలకు ఆదర్శంగా నిలుస్తుందని కొని ఆడారు. జేడీ జోన్ 2 ప్రొఫెసర్ బాల భాస్కర్ మాట్లాడుతూ పరిశోధన కార్యక్రమాలు ఎప్పుడు నూతన విషయాలను ఆవిష్కరించే విధంగా ఉంటాయని అందులో నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒక్క అడుగు ముందందని తెలుపుతూ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఏజీ ఓ ప్రొఫెసర్ వి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ జాతీయ సదస్సులో విద్యార్థులను కూడా భాగస్వామ్యం చేయడం ద్వారా విద్యార్థులలో పరిశోధనలపై ఆసక్తిని పెంచేలా వారిని పరిశోధనల పత్రాలపై మక్కువ పెంచేలా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సెమినార్కు దేశవ్యాప్తంగా అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు హాజరై తమ పరిశోధన పత్రాలు సమర్పించవచ్చని, పంటల అభివృద్ధిలో ఎదురవుతున్న సవాళ్లు, ఆధునిక వృక్ష శాస్త్ర పరిశోధనల తాజా పురోగతులపై లోతైన చర్చలు జరగనున్నట్లు జాతీయ సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎమ్.రాంబాబు తెలిపారు.

## పదోవ తరగతిలో వంద శాతం ఫలితాలను సాధించాలి



**మహబూబాబాద్, వుదయం:**

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నాయకుల ఆశయం పాఠశాలలో నిర్వహించిన ఆశ్రమ పాఠశాల హెడ్మాస్టర్ మరియు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో డిప్యూటీ డైరెక్టర్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో పా 10వ తరగతి లో 100% ఫలితాలను సాధించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించడం జరిగింది. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు నేను ప్రకారం తప్పకుండా పాటించి విద్యార్థులకు భోజనాలు అందించాలని ఎటిడిఓ లు హెచ్ హెచ్ డబ్ల్యూ ఓ లకు ఆదేశించడం జరిగింది. ఈ సమావేశంలో ఎటిడిఓ లు, భాస్కర్, ఉపేందర్, ఏసిఎంఓ రాములు, డిప్యూటీ ఈఓ సారయ్య, జిసిఎంఓ, విజయ, ఎస్ఓ కొమ్మలు, డిఆర్పి శ్రీకాంత్, అకౌంటెంట్ సుహాసిని హెడ్మాసర్ లు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# నిరంతరం పోరాడి ప్రజల కలలను సాకారం చేసిన మహానేత కేసీఆర్

### బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు

**జయశంకర్ భూపాలపల్లి, వుదయం:**



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరంతరం పోరాడి ప్రజల కలలను సాకారం చేసిన మహానేత కేసీఆర్ అని బిఆర్ఎస్ పార్టీ మహాదేవపూర్ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు అన్నారు మంగళవారం మహాదేవపూర్ మండలకేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్రం సాధించిన యోధుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు దానిలో భాగంగా భారీ కేక్ కటింగ్ చేసి మండల కేంద్రంలో తీపి పంపకాలు జరిపి కేసీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరంతరం పోరాడి ప్రజల కలలను సాకారం చేసిన మహానేత కేసీఆర్ అని కొనియాడారు. తెలంగాణ కోసం చేపట్టిన దీక్షలు, ఉద్యమాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తరువాత కేసీఆర్ దూరదృష్టి నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాలలో విశేష అభివృద్ధి సాధించిందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే కాకుండా, కాళేశ్వరం వంటి మహత్తర ప్రాజెక్టుల ద్వారా వ్యవసాయ రంగానికి కొత్త ఊపునిచ్చారని వివరించారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయని తెలిపారు. కేసీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త బాధ్యత అని స్పష్టం చేశారు. పార్టీ బలోపేతం కోసం అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ ప్రధాన ధ్యేయమని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, మహిళ మంథని నియోజకవర్గ ఇంచార్జి కేదారి గీత, మండల యూత్ అధ్యక్షుడు యండి అలీమ్ ఖాన్, మండల నాయకులు ఆన్కారి ప్రకాష్, పెండ్యాల మనోహర్, తడకల రమేష్, పోత వెంకటస్వామి,కూరతోట రాకేష్,యండి సల్మాన్ ఖాన్, మెసినేని రవీందర్ రావు, కూరతోట శ్రీహరి, కలికోట దేవేందర్, హసీమ్, సతీష్, మహేష్, ఇష్టాయక్ తదితరులు పాల్గొన్నారు

# కెమికల్స్, రియాజెంట్స్ కిట్స్ సరఫరాకు సీల్ టెండర్లు – ప్రిన్సిపాల్

**వరంగల్ టౌన్, వుదయం:**

కాకతీయ మెడికల్ కాలేజ్ హనుమకొండ లో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ల్యాబొరేటరీ కెమికల్స్, రియాజెంట్స్ కిట్స్ సరఫరా చేయుటకు అర్హులైన సరఫరాదారుల నుండి సీల్ చేసిన టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి. టెండర్ దరఖాస్తు ధర రూ: 2,000 (రూపాయలు నాలుగు వేల మాత్రమే) డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో ప్రిన్సిపాల్ కెఎంసి హనుమకొండ వారి పేరిట చెల్లించవలెను. (ఈ మొత్తం తిరిగి చెల్లించబడదు). టెండర్ దరఖాస్తుల విక్రయం తేదీలు 23 నుండి 11 వరకు, ప్రతి రోజు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు. టెండర్ దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ 12 సాయంత్రం 4 గంటల వరకు. టెండర్ తెరవబడే తేదీ 16 ఉదయం 11 గంటలకు ప్రిన్సిపాల్ కార్యాలయం, కెఎంసి, హనుమకొండలో జరుగును. ఈఎండి మొత్తం రూ: 10,000-00 (రూపాయలు పది వేల మాత్రమే) డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో ప్రిన్సిపాల్, కెఎంసి హనుమకొండ వారి పేరిట చెల్లించవలెను. (ఈ మొత్తం తిరిగి చెల్లించబడును).టెండర్ కు సంబంధించిన పూర్తి వివరాలు www.kmcwgl.com వెబ్సైట్లో అందుబాటులో ఉన్నాయి.

# క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం పటిష్టంగా అమలు చేయాలి

### డాక్టర్ వెంకటరమణ జాయింట్ డైరెక్టర్

**హనుమకొండ, వుదయం**



రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ బి రవీంద్ర నాయక్ ఆదేశాలకు అనుగుణంగా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి వెంకటరమణ మంగళవారం రోజున రాష్ట్ర క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ సెల్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో 4 జిల్లాల (హనుమకొండ, వరంగల్ ,ములుగు ,జయశంకర్ భూపాలపల్లి)తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం బృంద సభ్యులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ చట్టం నియమ నిబంధనలను, రిజిస్ట్రేషన్ మరియు రెన్యువల్ కు సంబంధించిన వివిధ అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆసుపత్రులలో ధరల పట్టికను , డాక్టర్ల వివరాలను , అనుమతి పత్రములను అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలనిఅనుమతులేని క్లినిక్లను,ఆసుపత్రులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అలాగే జిల్లా కార్యాలయంలో అన్ని రికార్డులను సరిగ్గా నిర్వహించాలని త్వరలో రిజిస్ట్రేషన్ మరియు రెన్యువల్ ఆన్లైన్ పద్ధతిలో చేపట్టడానికి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, హనుమకొండ, సిద్దిపేట జిల్లాలలో పైలట్ ప్రాతిపదికన చేపట్టడానికి ఏర్పాట్లు చేయడం జరుగుతున్నదని అన్నారు.రాష్ట్ర బృంద సభ్యులు వివిధ అంశములను వివరించడంతోపాటుగా నాలుగు జిల్లాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ డిఎంహెచ్వో డాక్టర్ ఎ అప్పయ్య జయశంకర్ భూపాలపల్లి డి ఎం హెచ్ ఓ డాక్టర్ సిహెచ్ మధుసూదన్ , రాష్ట్ర బృంద సభ్యులు శ్రీ సునీల్ రాజ్, టి వెంకట్రాంరెడ్డి, అనిల్ కుమార్, నాగరాజు , హనుమకొండ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, డాక్టర్ ప్రభుదాస్, ములుగు ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీకాంత్ ,భూపాలపల్లి ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీదేవి, గణాంక అధికారులు ప్రసన్నకుమార్ శ్రీమతి విజయలక్ష్మి , డెమో వి అశోక్ రెడ్డి, HEEO చంద్రశేఖర్,అనిల్ కుమార్హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీదేవి, సంపత్ ఇతరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి ఆరోగ్య శిబిరాన్ని వినియోగించుకోవాలి: డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య

**సుబేదారి, వుదయం:**



ప్రతి విద్యార్థి ఆరోగ్య శిబిరాన్ని వినియోగించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ అప్పయ్య అన్నారు. హసన్ పర్తి ఆర్ బి ఎస్ కే ఎ టీమ్ ఆధ్వర్యంలో మచిలీ బజార్ లోని గవర్నమెంట్ హై స్కూల్ తౌజండ్ పిల్లర్స్ టెంపుల్, ఉర్దూ మీడియం, గవర్నమెంట్ ప్రైమరీ స్కూల్ గవర్నమెంట్ ప్రైమరీ స్కూల్ తౌసండ్ పిల్లర్స్ ,లో నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పర్యవేక్షించారు. ఈ శిబిరములో స్క్రీనింగ్ ,డెంటల్ స్క్రీనింగ్, చిరు వ్యాధులకు చికిత్స, రక్తహీనతతో బాధపడుతున్న టువంటి పిల్లలకు ఐరన్ అండ్ పోలింగ్ యాసిడ్ మాత్రలు ఇవ్వడం జరిగింది. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని ప్రతి ఒక్క విద్యార్థి ఈ ఆరోగ్య శిబిరాన్ని వినియోగించుకునేలా చూడాలని ఉపాధ్యాయులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సూచించారు. డైక్ సెంటర్ కు రిఫర్ చేసిన విద్యార్థులకు తగిన ఫాలోఅప్ సేవలు అందించాలని ఆర్బిఎస్కే బృందాన్ని ఆదేశించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు డాక్టర్ కుమార స్వామి , డాక్టర్. దివ్య, ఫార్మసీ ఆఫీసర్ మాధురి, స్వరూపా సిస్టర్, ఆర్బిఎస్కే టీం సిబ్బంది, ప్రభుత్వ ఉపాధ్యాయులు ఫాతిమా నిస్రత్, పి.అమరావతి, రఫత్ సుల్తానా, అజీజ్ ఫాతిమా, ఎం శ్యాంసుందర్ ప్రాథమిక పాఠశాలల సిబ్బంది పిల్లలు పాల్గొన్నారు.

# పచ్చదనాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత .. సర్పంచ్ హసీనాబానో అక్బర్ ఖాన్

**జయశంకర్ భూపాలపల్లి, వుదయం:**



పచ్చదనాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మహాదేవపూర్ సర్పంచ్ హసీనా బాను అక్బర్ ఖాన్ అన్నారు 2026 2027 వనమహోత్సవం లో భాగంగ గ్రామ పంచాయితీ పరిదిలోని లోని నర్సరీలలో చెట్లు పెంపకం కోసం విత్తనాల మొక్కలను పెంచడానికి కావాల్సిన బ్యాగూలు మొక్కలాను వాడే మట్టి ఎరువులు కలిపి బ్యాగ్లాలో నింపే పనిని మంగళవారం సర్పంచ్ హసీనా బాను అక్బర్ ఖాన్ ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీజ సంతోష్, వార్డు మెంబర్లు పడాల మొగలి గడ్డం స్వామి మొహమ్మద్ బిన్ అలీ రాములు తదితరులు పాల్గొన్నారు.

# స్మశానవాటికలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన సొసైటీ మాజీ చైర్మన్

**బయ్యారం, వుదయం**



ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు బయ్యారం మండల కేంద్రంలోనీ స్మశాన వాటికలో సిసి రోడ్లు నిర్మాణం,పూజా కార్యక్రమాల కోసం ఫ్లాట్ ఫామ్ నిర్మాణం,సోలార్ లైట్,మంచినీటి సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాట్లు చేస్తామని బయ్యారం సొసైటీ మాజీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి తెలిపారు.మంగళవారం స్మశాన వాటికలో నూతన సీసీ రోడ్ల పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. పనులు నాణ్యతతో,వేగంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ కు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు దశలవారీగా అమలు చేస్తున్నామని లింగమంతుల గుడి నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు,అలాగే వెంకట్రాంపురం వైపు నూతన రోడ్ల నిర్మాణం పూర్తి చేయగా,ఆ పనుల్లో మిగిలిన నిధులు,ఎమ్మెల్యే,ఎంపీ నిధులతో ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు ప్రారంభించినట్లు వివరించారు.స్మశాన వాటికకు వెళ్లే మార్గంలో ప్రజలు వర్షాకాలంలోనూ ఇబ్బందులు లేకుండా వెళ్లాలని,పూజా కార్యక్రమాల కోసం ఫ్లాట్ ఫామ్ నిర్మాణంతో ఆచారాలు సక్రమంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుందని,ఎల్ఈడి లైట్ల ద్వారా రాత్రి వేళల్లో భద్రత,వెలుగు సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. బయ్యారం మండల కేంద్రంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనులు ఎమ్మెల్యే,ఎంపీ నిధులతోనే అమలు అవుతోందని,ఇందులో ఎటువంటి సందేహం లేదని స్పష్టం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలపై కొంతమంది కావాలని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని,ప్రజలు వాస్తవాలను గ్రహించాలని వారు కోరారు.మండలాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో తిరుమల ప్రభాకర్ రెడ్డి,సూరం సుధాకర్ రెడ్డి,తిరుమల చంద్రరెడ్డి,చెరుకుపల్లి నర్సయ్య, వెంకటపతి,నంబూరి మధు,కళింగ రెడ్డి, విరబోయిన సంపత్,పగడాల శ్రీనివాస్,పోతుగంటి సుమన్, తిరుమల సుధాకర్ రెడ్డి,తగిర నిర్మల రెడ్డి,సూరం రవీందర్ రెడ్డి,కాంట్రాక్టర్ నాగు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నప్రసాదం ఆత్మ సంతృప్తిని కలిగిస్తుంది



**హనుమకొండ టౌన్, వుదయం:**

పరమశివుని ప్రతిరూపంగా భావించే అన్నప్రసాదం వితరణ మహా శివరాత్రి మరుసటిరోజే చేయడం ఆత్మసంతృప్తిని కల్గించిందని ప్రముఖ న్యాయవాది, సీనియర్ సంఘసేవా సంస్కర్త యరబాటి విశ్వేశ్వర్ రావ్ అన్నారు. మంగళవారం శ్రీ భద్రకాళి వీరభద్ర సేవా సమితి ఆధ్వర్యంలో హనుమకొండలోని బాలసముద్రంలో చేపట్టిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సేవచేయడమనే కార్యం సంకల్పంతోనే సిద్దిస్తుందని మాటలతో రాదని చెప్పారు. సీనియర్ పాత్రికేయులు పిన్నా శివకుమార్ సారథ్యంలో ఇంతమంది కలసి చేస్తున్న శుభకార్యం పలువురి ఆకలి తీరుస్తుందని అన్నారు. ఇలాంటి సేవకార్యక్రమాలు నిరంతరం చేపట్టడం వల్ల సమాజంలో శాంతి ఫరిఢ విల్లుతుందని, నవసమాజ నిర్మాణంలో తొలిమెట్టుగా నిలుస్తుందన్నారు.ఈ సందర్భంగా సుమారు 600 మందికి అన్నదానం చేశారు.వంగర గ్రామస్తులు దివంగత చోల్లేటి భద్రయ్య – కమలమ్మ, గ్గార్ల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు స్వీట్స్ వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ పొడిచెట్టివిష్ణువర్ధన్, ఉల్లేంగులమహేష్, యన్ దిలీప్, సత్యనారాయణ రెడ్డి,నారాయణ రెడ్డి,చోల్లేటి, శ్రీధ ర్, చ ంద్రశేఖ ర్, గౌరిశెట్టి ధనుంజయ,పాములపర్తి కేశవ్ కుమార్, దేవునూరి రాధా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చరిత్ర, పోలీస్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ బుక్స్ వితరణ



**భీమదేవరపల్లి, వుదయం:**

భీమదేవరపల్లి గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి ఇచ్చిన డొనేట్ ఎ బుక్ బిల్డ్ ఎ ఫ్యూచర్ అనే నినాదాన్ని చూసి స్పందించిన భీమదేవరపల్లి గ్రామ వాస్తవ్యులు ధర్మసాగర్ ప్రభుత్వ కళాశాలలో జూనియర్ లెక్చరర్ గా పనిచేస్తున్న సాతురి ప్రభాకర్ మంగళవారం రోజున భీమదేవరపల్లి గ్రామపంచాయతీలో తెలంగాణ చరిత్ర, పోలీస్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కి సంబంధించిన పుస్తకాలని అందించినందుకు వారికి మా హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శనిగరం ఐలయ్య, వార్డు సభ్యులు బొల్లంపల్లి శ్యామ్, ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎలుకపల్లి శ్రీనివాస్, పచ్చునూరి సునీల్, ఎలుకపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## చైర్మన్, వైస్ ఛైర్మన్ లను సన్మానించిన జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాపు



**జయశంకర్ భూపాలపల్లి, వుదయం:**

నూతనంగా ఎన్నికైన భూపాలపల్లి మున్సిపాలిటీ చైర్మన్ బుర్ర కొమురయ్యగౌడ్, వైస్ –ఛైర్మన్ గా ఎన్నికైన అంబాల శ్రీనివాస్ ను భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాపు మంగళవారం వారిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజబాపు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అండదండలతో మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో భూపాలపల్లి పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందు వరుసలో ఉంచడానికి కృషి చేయాలని కోరారు. తోటి కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కలుపుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

# నిద్రలేమికి ఈ తప్పులే కారణం!



ఉదయం నుంచి రాత్రి వరకు కష్టపడి సంపాదించేది తినడానికే.. తిన్నది డైజెస్ట్ కావాలన్నా.. ఆరోగ్యంగా ఉండాలన్నా శరీరానికి తగినంత విశ్రాంతి అవసరం. ఉరుకుల పరుగుల జీవితంలో పడుకోవడానికి సమయం కేటాయించడం కూడా చాలా మందికి కష్టమైపోతోంది. నిద్ర కరువైతే అనారోగ్య సమస్యలు ఒకదాని వెంట ఒకటి శరీరంపై దాడి చేస్తాయి. రోజంతా కష్టపడి పని చేసి రాత్రి ఇంటికి రాగానే హాయిగా నిద్రపోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కానీ చాలామందికి బెడ్ ద పడుకోగానే నిద్ర రాదు. స్మార్ట్‌ఫోన్ తీసి రీల్స్ చూడటం లేదా పాత విషయాలను తలుచుకుంటూ గంటల కొద్దీ మేల్కొనే ఉంటారు. దీనివల్ల మరుసటి రోజు పనిలో ఏకాగ్రత దెబ్బతినడమే కాకుండా, చిరాకు, నీరసం ఆవహిస్తాయి. నిద్ర అనేది మన శరీరానికి ఒక రీఛార్జ్ లాంటిది. అది సరిగ్గా లేకపోతే ఆరోగ్యం దెబ్బతింటుంది. అయితే లైఫ్ స్టైల్ లో కొన్ని చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని నిపుణులు చెబుతున్నారు. మన శరీరంలో ఒక అంతర్గత గడియారం ఉంటుంది, దానినే 'సిర్కాడియన్ రిథమ్' అంటారు. ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకోవడం, ఉదయాన్నే ఒకే మ్‌కి నిద్రలేవడం అలవాటు చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల శరీరానికి ఎప్పుడు నిద్రపోవాలో ఒక పద్ధతి అలవాటు అవుతుంది. సెలవు రోజుల్లో కూడా ఈ సమయాన్ని మార్చకుండా ఉండటం వల్ల గాఢ నిద్ర పట్టే అవకాశం ఉంటుంది. చాలామంది రాత్రి పూట కూడా కాఫీ లేదా టీ తాగుతుంటారు. వీటిలో ఉండే కెఫిన్ మన మెదడును అలెర్ట్ గా ఉంచుతుంది, దీంతో నిద్ర రాదు. నిద్రపోయే ఆరు గంటల ముందే కెఫిన్ ఉన్న పానీయాలను ఆపేయాలి. అలాగే ఆల్కహాల్ తాగితే నిద్ర వస్తుందని కొందరు భావిస్తారు కానీ, అది నిద్ర నాణ్యతను దెబ్బతీస్తుంది. గాఢ నిద్రకు ఆటంకం కలిగించి అర్ధరాత్రి మెలకువ వచ్చేలా చేస్తుంది. మనం నిద్రపోయే గది ఎలా ఉందనేది మన నిద్రను ప్రభావితం చేస్తుంది. బెడ్ రూమ్ ఎప్పుడూ శుభ్రంగా, ప్రశాంతంగా ఉండాలి. గది ఉష్ణోగ్రత కు అనుకూలంగా ఉండేలా చూసుకోండి. లైట్లు డిమ్ గా ఉంటే శరీరంలో నిద్రను ప్రేరేపించే హార్మోన్లు విడుదలవుతాయి. ముఖ్యంగా పడక గదిని కేవలం నిద్రకు, విశ్రాంతికి మాత్రమే పరిమితం చేయాలి. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల నుంచి వచ్చే 'బ్లూ లైట్' మెలటోనిన్ అనే హార్మోన్ ఉత్పత్తిని తగ్గిస్తుంది. దీనివల్ల మన మెదడు అది పగలు అని పొరబడి నిద్రను దూరం చేస్తుంది. నిద్రపోయే ఒక గంట ముందు నుంచే గాడ్జెట్లను దూరంగా పెట్టడం అలవాటు చేసుకోండి. రీల్స్ చూడటం ఒక వ్యసనంలా మారి విలువైన నిద్ర సమయాన్ని హరించేస్తుందని గుర్తించాలి. పడుకునే ముందు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడానికి కొన్ని పద్ధతులు పాటించాలి. ఒక మంచి పుస్తకం చదవడం, మెలోడీ సంగీతం వినడం లేదా గోరువెచ్చని నీటితో స్నానం చేయడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. అలాగే డీప్ బ్రీతింగ్ (లోతైన శ్వాస) లేదా ధ్యానం చేయడం వల్ల మనస్సులోని ఆందోళనలు తొలగిపోయి శరీరం నిద్రకు సిద్ధమవుతుంది.

# ఇప్పపువ్వుతో ఆ జబ్బులన్నీ మాయం!



ఇప్ప పువ్వు కేవలం సారా కోసమే అనే అపోహను వీడి.. దాని అద్భుత ఆరోగ్య ప్రయోజనాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఆయుర్వేదంలో విరివిగా ఉపయోగించే ఇప్ప పువ్వు, కడుపు సమస్యలు, గుండె జబ్బులు, నోటిపూత, కీళ్ల నొప్పులు, చర్మ సమస్యలు వంటి అనేక సమస్యల నుంచి ఉపశమనం లభించేలా చేస్తుంది. ఇప్ప పువ్వులో ఎన్నో పోషకాలతోపాటు.. ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. అందుకే.. విప్ప పువ్వును తీసుకోవాలని సూచిస్తుంటారు ఆయుర్వేద నిపుణులు.. ఇది పోషకాలు, ఔషధ గుణాలతో నిండిన ఒక అద్భుతమైన అటవీ ఉత్పన్నం.. అందుకే.. దీనిని ఆదివాసీలు బలంగా ఉండటానికి అసలు సీక్రెట్ ఇదేనని పేర్కొంటారు. ఇప్ప పూలలో విటమిన్ బి, సి, కాల్షియం, ఐరన్, పొటాషియం పుష్కలంగా ఉన్నాయి. ఈ పువ్వుల సారం రక్తాన్ని శుద్ధి చేస్తుంది.. ఇంకా రోగనిరోధక శక్తిని పెంచుతుంది. వాస్తవానికి.. ఇప్ప పువ్వు అంటే చాలా మందికి కేవలం సారా తయారీకి మాత్రమే ఉపయోగిస్తారనే భ్రమ ఉంటుంది. అయితే, ఇప్ప పువ్వులో దాగి ఉన్న అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు చాలా మందికి తెలియదు. ఆయుర్వేదంలో ఔషధాల తయారీకి ఇప్ప పువ్వును విరివిగా వాడుతారు. దీనిని నేరుగా తీసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు దూరమవుతాయని నిపుణులు చెబుతున్నారు. ఇప్ప పువ్వు కడుపు సంబంధిత సమస్యలకు చక్కటి పరిష్కారం చూపుతుంది. అల్సర్, కడుపు ఉబ్బరం వంటి వాటికి ఇప్ప పువ్వు రసం తక్షణ ఉపశమనాన్ని ఇస్తుంది. అంతే కాకుండా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇందులో ఉండే ఓలిక్ యాసిడ్ గుండె జబ్బులను నివారించడంలో సహాయపడుతుంది. ప్రతిరోజూ ఇప్ప పువ్వును నీటిలో మరిగించి, ఆ నీటితో పుక్కిలించడం వల్ల నోటిపూత, నోటి మంట, పంటి నొప్పి వంటి ఇబ్బందులు తగ్గుతాయి. పాలల్లో ఇప్ప పువ్వు కలుపుకొని తాగడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. ఇప్పపువ్వు తీసుకుంటే తక్షణ శక్తి లభిస్తుంది. ఇంకా బలహీనత తగ్గి.. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.ఇప్ప పువ్వుతో తయారు చేసిన తైలం కీళ్ల నొప్పులకు మంచి ఔషధంగా పనిచేస్తుంది. చర్మంపై వచ్చే దద్దుర్లు, దురదను తగ్గించడంలో ఇప్ప పువ్వు రసం ప్రభావవంతంగా ఉంటుంది. నరాల బలహీనతతో బాధపడేవారు పాలలో ఇప్ప పువ్వును కలుపుకొని తాగితే ఆ సమస్య నుంచి త్వరగా బయటపడవచ్చు.

# గ్లాస్ జామపండు జ్యూస్ తాగితే..



సాధారణంగా మనకు తక్కువ ధరలో, సులభంగా దొరికే పండ్లలో జామపండు ఒకటి. అయితే దీనిని కేవలం ఒక సామాన్యమైన పండుగా తీసిపారేయకండి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. జామపండులో ఉండే పోషకాలు ఖరీదైన బ్లూబెర్రీస్ వంటి పండ్లకు ఏమాత్రం తీసిపోవు. ముఖ్యంగా జామపండును ముక్కలుగా తినడమే కాకుండా రసం రూపంలో తీసుకోవడం వల్ల అద్భుతమైన ఫలితాలు ఉంటాయని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. జామలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. నారింజ పండుతో పోలిస్తే జామలో విటమిన్ సి శాతం ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇది శరీరానికి రక్షణ కవచంలా పనిచేస్తుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా వచ్చే సీజనల్ వ్యాధుల నుండి తప్పించుకోవాలంటే శరీరంలో రోగనిరోధక శక్తి బలంగా ఉండాలి. ప్రతిరోజూ జామ రసాన్ని తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన విటమిన్ సి అందుతుంది. తద్వారా తరచూ అనారోగ్యానికి గురికాకుండా ఉండవచ్చు. జామపండు తీయ్యగా ఉన్నప్పటికీ.. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. లో-గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండటం వల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులు ఎటువంటి భయం లేకుండా జామ రసాన్ని తమ డైట్‌లో చేర్చుకోవచ్చు. జామలో ఉండే మెగ్నీషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది. ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. అధిక రక్తపోటుతో బాధపడేవారు జామ రసాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం మంచిది. జామలో ఫైబర్ అధికంగా ఉంటుంది. కొంతమందికి జామకాయను నేరుగా తింటే కడుపు నొప్పి వచ్చే అవకాశం ఉంటుంది. అలాంటి వారు రసం రూపంలో తీసుకోవడం వల్ల మలబద్ధకం వంటి సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. జామ రసం కేవలం అంతర్గత ఆరోగ్యానికే కాదు, బాహ్య సౌందర్యానికి కూడా మేలు చేస్తుంది. ఇందులో ఉండే పోషకాలు చర్మానికి సహజమైన మెరుపును ఇవ్వడమే కాకుండా జుట్టు కుదుళ్లను బలోపేతం చేస్తాయి.

# అందుకే మాయ చేద్దాం!



రోజూ అరగంటైనా వ్యాయామం చేస్తే మంచిది. కొద్దికొద్దిగా ముందుగా చదువుకుంటేనే ఆఖరి నిమిషంలో ఒత్తిడి ఉండదు. రోజూ కనీసం 2 లీటర్ల మంచి నీళ్లైనా తాగాలి... చెప్పాలే కానీ మనం చేయాల్సిన జాబితా చాలానే! పైగా ఇవన్నీ మనకు మేలు చేసేవే. అయినా పాటిస్తామా? ఈసారి నుంచి తప్పకుండా పాటించాలి అని రెండ్రోజులు ప్రయత్నిస్తామో లేదో... మళ్లీ మొదలు. వాటిని పక్కన పెట్టడానికి మన మెదడు ఎన్నెన్ని సలహాలు ఇస్తుందో! ఒక్కరోజు పడుకుంటే ఏం కాదు... వ్యాయామం వాయిదా వేద్దాం. పదే పదే బాత్రూమ్‌కి వెళ్లాలి. ఆ ఏం నీళ్లు తాగడంలే అంటూ మనల్ని ఆపుతుంటుంది. అలాగని వింటూ కూర్చుంటే ఎలా? అందుకే దాన్నే మాయ చేద్దాం. ఇన్ని గంటలు చదవాలి, ఈ సబ్జెక్టు లేదా ఛాప్టర్ అంతా పూర్తి చేయాలి అంటే కదా... నీరసం వచ్చేది. అలాకాకుండా... ఈ పేజీ చదువుదాం చాలని మొదలుపెట్టండి. ప్రారంభించడమే సమస్య. తరవాత తెలియకుండానే కొనసాగిస్తాం. తీరా బోర్ కొట్టిందనుకోండి అప్పుడే ఆపొచ్చు. ఎంతో కొంత చదువుతాం కాబట్టి, మేలే. రోజూ అరగంట అంటే కదా ఇబ్బంది. ఉదయాన్నే అలా బయటికి వెళ్లొద్దాం అని వెళ్లండి. వేరే వాళ్లని చూసి మీరే కొనసాగుతారు. ఫోన్ పట్టుకున్న ప్రతిసారి మూడు సిప్‌లు నీళ్లు తాగాలి అనుకుంటే సరి. దాన్ని పట్టుకోకుండా ఎలాగూ ఉండం, కాబట్టి, అలాగైనా నీళ్లు తాగుతాం. ఇల్లు సర్దాలన్నా గదంతా అని పెట్టుకోవద్దు. ఎంతోకొంత నిర్ణయించుకుని సర్దుతూ వెళితే సరి. పని పెద్దగా కనిపిస్తుంటేనే దాన్ని పక్కన పెట్టడానికి మన మెదడూ కారణాలు చూపిస్తూ వెళ్తుంది. తీరా అవి పూర్తవకపోతే మనకే ఒత్తిడి. అదే ఇలా ప్రయత్నించండి... పనీ పూర్తవుతుంది. భారంగా తోయదు, మనసుకీ హాయి. ఏమంటారు?


# నల్ల మిరియాలు..

## ఔషధ గుణాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు!




నల్లగా ఉన్నాయి కదా అని తీసిపారేకయండి. వీటి ప్రయోజనాలు తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఇందులో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయంటున్నారు వైద్య నిపుణులు. వీటిని ప్రతి రోజు తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఈ రోజుల్లో బరువు తగ్గడం అనేది ప్రతి ఒక్కరికీ ఒక ప్రధాన కోరికగా మారింది. చాలా మంది గంటల తరబడి వ్యాయామం చేస్తారు. కఠినమైన ఆహారాలను పాటిస్తారు. కానీ ఇప్పటికీ ఆశించిన ఫలితాలు పొందలేకపోతున్నారు. అటువంటి పరిస్థితిలో వంటగదిలో ఉండే నల్ల మిరియాలు వంటి చిన్న మసాలా దినుసును సరిగ్గా ఉపయోగించడం వల్ల బరువు తగ్గడానికి సహాయపడుతుందని కు తెలిస్తే ఆశ్చర్యపోతారు. నల్ల మిరియాలు ఆహారాన్ని కారంగా మార్చడమే కాకుండా, శరీర కొవ్వును కాల్చే సామర్థ్యాన్ని కూడా పెంచుతాయి. ఇందులో ఉండే పైపెరిన్ అనే సమ్మేళనం జీవక్రియను వేగవంతం చేస్తుంది. శరీరంలో నిల్వ ఉన్న కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఉబ్బరాన్ని నివారిస్తుంది. శరీరం థర్మోజెనిక్ కార్యకలాపాలను పెంచుతుంది. నిర్విషీకరణలో సహాయపడుతుంది. అందువల్ల ప్రతిరోజూ సరైన మొత్తంలో నల్ల మిరియాలను తీసుకోవడం వల్ల బరువు తగ్గించే ప్రయాణం సులభం, వేగంగా ఉంటుంది. ఇది థర్మోజెనిక్ కార్యకలాపాలను పెంచుతుంది. ఇది కేలరీలను వేగంగా బర్న్ చేయడానికి సహాయపడుతుంది. ఇది యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది శరీరాన్ని నిర్విషీకరణ చేస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇది ఆహారం బాగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. ఉబ్బరం నివారిస్తుంది.

# మానసిక ఒత్తిడితో మలబద్ధకం సమస్య వస్తుందా?



నేటి కాలంలో తెలియకుండానే మన ఆరోగ్యాన్ని నాశనం చేస్తోంది. ముఖ్యంగా ఒత్తిడి జీర్ణ సమస్యలకు హాని కలిగిస్తుందని కు తెలుసా? అవును.. గట్ ఆరోగ్యానికి, మెదడుకు ఒకదానితో ఒకటి అనుసంధానం ఉంటుందట. అందుకే వాటిని 'గట్-బ్రెయిన్ యాక్సిస్' అని పిలుస్తారు. రెండో మార్గం కమ్యూనికేషన్ వ్యవస్థ. ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరూ తీవ్ర ఒత్తిడితో చిత్తవుతున్నారు. ఇది తెలియకుండానే మన ఆరోగ్యాన్ని నాశనం చేస్తోంది. ముఖ్యంగా ఒత్తిడి జీర్ణ సమస్యలకు హాని కలిగిస్తుందని కు తెలుసా? అవును.. గట్ ఆరోగ్యానికి, మెదడుకు ఒకదానితో ఒకటి అనుసంధానం ఉంటుందట. అందుకే వాటిని 'గట్-బ్రెయిన్ యాక్సిస్' అని పిలుస్తారు. రెండో మార్గం కమ్యూనికేషన్ వ్యవస్థ. నరాలు, హార్మోన్లు, పేగు మైక్రోబయోటా ఈ సంబంధాన్ని నిర్వహిస్తాయి. ఈ గట్-బ్రెయిన్ యాక్సిస్ వ్యవస్థ కారణంగా ఒత్తిడి జీర్ణవ్యవస్థను ప్రత్యక్షంగా, తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఇది మలబద్ధకం, విరేచనాలు, కడుపు నొప్పి వంటి సమస్యలకు దారితీస్తుంది. ఐఓఅ హాస్పిటల్‌లోని మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ అనురాగ్ శెట్టి దీని గురించి మరింత సమాచారాన్ని అందించారు. ఒత్తిడి సమయంలో నాడీ వ్యవస్థ అధిక చురుకుదనం వల్ల ప్రేగు కదలికలు మందగిస్తుంది. దీని వల్ల మలబద్ధకం వస్తుంది. దీనితో పాటు ఒత్తిడి హార్మోన్ల ఉత్పత్తి పెరగడం, పేగు పారగమ్యత పెరగడం, గట్ మైక్రోబయోటాలో మార్పులు సంభవిస్తాయి. ఇవన్నీ మలబద్ధకానికి దోహదం చేస్తాయి. ఒత్తిడి సమయంలో తినే విధానాలు కూడా మారుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఎక్కువ స్వీట్లు తినడం, ఎక్కువ కెఫిన్ తీసుకోవడం, ఎక్కువ ప్రాసెస్ చేసిన ఆహారాలు తీసుకోవడం, ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు తినకపోవడం ఇవన్నీ జీర్ణక్రియను ప్రభావితం చేస్తాయి. ఇది ఒక విష చక్రం మాదిరి పని చేస్తుంది. ఇక్కడ ఒత్తిడి మలబద్ధకానికి కారణమవుతుంది. మలబద్ధకం ఒత్తిడిని పెంచుతుంది. ఒత్తిడిని తగ్గించడం చాలా ముఖ్యం. ఇది మానసిక, శరీరక ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుంది. అలాగే ఫైబర్ అధికంగా ఉండే పండ్లు, కూరగాయలను తినాలి. మొలకలు తినడం, తగినంత నీళ్లు తాగడం చేయాలి. రోజువారీ వ్యాయామం, తగినంత శారీరక శ్రమ అవసరం. మలవిసర్జన సంకేతాలను విస్మరించవద్దు. శరీరాన్ని శుభ్రంగా ఉంచడానికి ఇది అవసరమని గుర్తుంచుకోండి. మలబద్ధకం సమస్య సాధారణ పద్ధతుల ద్వారా పరిష్కరించబడకపోతే, సమస్య చాలా కాలం పాటు కొనసాగితే బరువు తగ్గడం, హిమోగ్లోబిన్ స్థాయిలు తగ్గితే, మలంలో రక్తం కనిపిస్తే, కుటుంబంలో ఎవరికైనా పెద్దప్రేగు క్యాన్సర్ చరిత్ర ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించడం మర్చిపోకూడదు.

# కళ్ల కింద డార్క్ సర్కిల్స్, వెనుక అసలు రహస్యం ఇదే!



చాలా మంది కళ్ల కింద నల్లటి వలయాలు రాగానే ఖరీదైన క్రీములు వాడుతూ ఉంటారు. కనురెప్పలు అదురుతూ ఉంటే ఏదో కీడు జరుగుతుందని భయపడతారు. కానీ ఇవన్నీ శరీరంలో ఒక ముఖ్యమైన పోషకాహారం తగ్గిందని చెప్పే హెచ్చరికలు కావొచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ముఖం పాలిపోవడం, దవడ కండరాలు బిగుసుకుపోవడం వంటి చిన్న చిన్న మార్పుల వెనుక పెద్ద ఆరోగ్య సమస్యే ఉండవచ్చు. సాధారణంగా అలసట, ఒత్తిడి లేదా ఎక్కువ కాఫీ తాగడం వల్ల కళ్లు అదురుతుంటాయి. కానీ ఇది తరచుగా జరుగుతుంటే మెగ్నీషియం లోపం కారణం కావచ్చు. మెగ్నీషియం నరాలు మరియు కండరాల మధ్య సంబంధాన్ని స్థిరంగా ఉంచుతుంది. ఇది తగ్గినప్పుడు కళ్ల చుట్టూ ఉండే చిన్న చిన్న కండరాలు స్పేమ్స్ కు గురవుతాయి.ఎంత నిద్రపోయినా కళ్ల కింద నలుపు తగ్గడం లేదంటే అది కేవలం కాస్మెటిక్ సమస్య కాదు. మెగ్నీషియం లోపం వల్ల నిద్ర సరిగ్గా పట్టదు, దీనివల్ల కళ్ల కింద చర్మం పల్చబడి రక్తనాళాలు బయటకు కనిపిస్తాయి. ఫలితంగా డార్క్ సర్కిల్స్ ఏర్పడతాయి. కేవలం క్రీములు రాస్తే ఇది తగ్గదు, ఆహారంలో మార్పులు చేసుకోవాల్సిందే. ఉదయాన్నే నిద్రలేవగానే ముఖం, కళ్లు ఉబ్బినట్లు అనిపిస్తున్నాయా? అయితే శరీరంలో ఫ్లూయిడ్ బ్యాలెన్స్ తప్పిందని అర్థం. మెగ్నీషియం వాపును తగ్గిస్తుంది. ఇది లోపించినప్పుడు ముఖం ఉబ్బుగా, చర్మం పొడిగా మరియు నిర్జీవంగా కనిపిస్తుంది. అలాగే దవడ కండరాలు బిగుసుకుపోవడం, పెదవుల దగ్గర అదురు రావడం వంటివి కూడా దీని లక్షణాలే.డెర్మటాలజీ నిపుణులు చెబుతున్న ప్రకారం.. మెగ్నీషియం, నిద్ర, జీర్ణక్రియ కలిస్తేనే అందమైన చర్మం సాధ్యం. మెగ్నీషియం వల్ల గాఢ నిద్ర పడుతుంది, ఆ సమయంలోనే చర్మం తనను తాను బాగు చేసుకుని కొల్లాజెన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది లోపిస్తే చర్మం త్వరగా ముడతలు పడటం, మొటిమలు రావడం వంటి సమస్యలు తలెత్తుతాయి. మెగ్నీషియం లోపాన్ని అధిగమించడానికి మన భారతీయ ఆహారంలో లభించే పాలకూర, గుమ్మడి గింజలు, బాదం, అరటిపండ్లు, తృణధాన్యాలు మరియు పప్పు దినుసులను డైట్‌లో చేర్చుకోవాలి. సమస్య తీవ్రంగా ఉంటే డాక్టర్ సలహాతో మెగ్నీషియం గ్లైసినేట్ వంటి సప్లిమెంట్లు వాడవచ్చు. మెగ్నీషియం లోపం అనేది నిశ్శబ్దంగా వచ్చే సమస్య. ముఖం ఇచ్చే ఈ చిన్న చిన్న సంకేతాలను గమనించడం ద్వారా పెద్ద ఆరోగ్య సమస్యలను ముందే నివారించవచ్చు.




# మూడో నెలలోనూ పెరిగిన టోకు ధరలు



దేశంలో టోకు ధరల ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) వరుసగా మూడో నెలలోనూ పెరిగింది. కేంద్ర పరిశ్రమల శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది జనవరి నెలలో టోకు ద్రవ్యోల్బణం 1.81 శాతానికి చేరింది. ప్రధానంగా ఆహార పదార్థాలు, ఆహారేతర వస్తువులు, తయారీ రంగ ఉత్పత్తుల ధరలు పెరగడమే ఇందుకు కారణమని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇంతక్రితం డిసెంబర్‌లో డబ్ల్యూపీఐ 0.83 శాతంగా ఉంది. డిసెంబర్‌లో మైనస్ 0.43 శాతంగా ఉన్న ఆహార ద్రవ్యోల్బణం.. జనవరిలో ఒక్కసారిగా 1.55 శాతానికి ఎగబాకింది. ముఖ్యంగా కూరగాయల ధరలు ఎగిసిపడ్డాయి. డిసెంబర్‌లో మైనస్ 3.50 శాతంగా ఉన్న కూరగాయల ధరలు అమాంతం జనవరిలో 6.78 శాతం ప్రియమయ్యాయి. ప్రాథమిక లోహాలు, వస్త్రాలు, ఇతర తయారీ ఉత్పత్తుల ధరలు పెరగడంతో ఈ విభాగంలో ద్రవ్యోల్బణం 1.82 శాతం నుంచి 2.86 శాతానికి పెరిగింది. ఆహారేతర వస్తువుల ద్రవ్యోల్బణం జనవరిలో అత్యధికంగా 7.58 శాతానికి ఎగిసింది. ఇంతక్రితం నెలలో ఇది కేవలం 2.95 శాతంగా ఉండటం విశేషం. కాగా.. ఇంధనం, విద్యుత్ రంగం సూచీ మాత్రం డిసెంబర్‌లో మైనస్ 2.31 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం జనవరిలో మరింత తగ్గి మైనస్ 4.01 శాతానికి చేరాయి. గత వారం విడుదలైన గణాంకాల ప్రకారం రిల్ ద్రవ్యోల్బణం కూడా జనవరిలో స్వల్పంగా పెరిగి 2.75 శాతానికి చేరింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధానంగా రిల్ ద్రవ్యోల్బణం ఆధారంగానే వడ్డీ రేట్లను నిర్ణయిస్తుంది. ప్రస్తుతం ధరలు నెమ్మదిగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ నెల ప్రారంభంలో జరిగిన సక్షలో ఆర్బీఐ కీలక వడ్డీ రేట్లను 5.25 శాతం వద్ద యథాతథంగా కొనసాగించింది. ముందుముందు ఆహార పదార్థాల ధరలు మరింత పెరిగితే.. ఆర్బీఐ తన పరపతి విధానంలో కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.

# మళ్లీ దిగొచ్చిన బంగారం ధర



వివాహాలు, శుభకార్యాల సీజన్ మొదలైన వేళ బంగారం ధరలు ఒక్కసారిగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకున్న పరిణామాల ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు వరుసగా రెండో రోజు కూడా తగ్గుముఖం పట్టాయి. ఇవాళ హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధరపై ఏకంగా రూ.1,530 తగ్గి రూ.1,54,910 వద్ద కొనసాగుతోంది. గడచిన రెండు రోజుల్లో రూ.2,840 మేర ధర తగ్గడం విశేషం. ఇక ఆభరణాల తయారీలో వినియోగించే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధరపై రూ.1,400 తగ్గి రూ.1,42,000కు చేరింది. బంగారంతో పాటే వెండి ధర కూడా భారీగా పతనమై కేజీ ధర రూ.2,65,000 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు 5 వేల డాలర్ల మార్కు నుంచి 4,930 డాలర్ల స్థాయికి పడిపోవడంతో దేశీయంగా కూడా ధరలు దిగొచ్చాయి. దానికి తోడు డాలర్ విలువలో మార్పులు కూడా బులియన్ మార్కెట్‌పై ప్రభావం చూపాయి.

# ఎప్‌స్టీన్ ఫైల్స్ ఎఫెక్ట్..

## హయత్ హోటల్స్ చైర్మన్ థామస్ ప్రిట్జ్కర్ రాజీనామా

ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోన్న విషయం తెలిసిందే. ఇప్పటికే చాలామంది ప్రముఖుల పేర్లు ఇందులో బహిర్గతమయ్యాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హయత్ హోటల్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, బిలియనీర్ థామస్ ప్రిట్జ్కర్ పేరుకు కూడా బయటకు వచ్చింది. దీంతో ఆయన తన పదవికి, బోర్డు సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లుగా ప్రకటించారు. లైంగిక నేరస్థుడు జెఫ్రీ



ఎప్‌స్టీన్‌తో తనకు ఉన్న సంబంధాలపై వస్తున్న వరుస కథనాల నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా జెఫ్రీ ఎప్‌స్టీన్ అతడి గర్ల్‌ఫ్రెండ్ గిస్లెన్ మాక్స్‌వెల్‌తో పరిచయాలు పెంచుకుని తాను తప్పు చేశానని థామస్ ప్రిట్జ్కర్ అంగీకరించారు. 2008లో జెఫ్రీ ఎప్‌స్టీన్ లైంగిక నేరస్థుడిగా నిర్ధారణ అయిన తర్వాత కూడా అతడితో ప్రిట్జ్కర్ ఈ-మెయిల్ ద్వారా సంభాషణలు జరిపినట్లుగా ఇటీవల బయటపడిన 'ఎప్‌స్టీన్ ఫైల్స్'లో వెల్లడైం ది. కాగా, జెఫ్రీ ఎప్‌స్టీన్ బాధితురాలైన వర్జీనియా గిఫ్రే 2016లో ఇచ్చిన ఒక డిపాజిషన్‌లో ప్రిట్జ్కర్‌పై సంచలన ఆరోపణలు చేశా రు. ఎప్‌స్టీన్ తనను ప్రిట్జ్కర్ వద్దకు పంపించాడని ఆమె పేర్కొన్నారు. అయితే, ఈ లైంగిక వేధింపుల ఆరోపణలను ప్రిట్జ్కర్ మొదటి నుంచీ తీవ్రంగా ఖండి స్తూనే ఉన్నా రు. రాజీనామా సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జెఫ్రీ ఎప్‌స్టీన్, మాక్స్‌వెల్ వల్ల బాధితులకు జరిగిన అన్యాయానికి తాను ఎంతగానో విచారిస్తున్నానని అన్నారు. వారితో సంబంధాలు కొనసాగించినందుకు ఎటువంటి సాకులు చెప్పనని పేర్కొన్నారు. హయత్ హోటల్స్ ప్రయోజనాల దృష్ట్యా తాను అన్ని బాధ్యతల నుంచి తప్పుకుంటున్నానని థామస్ ప్రిట్జ్కర్ స్పష్టం చేశారు.

# 'ఎక్స్' సేవల్లో భారీ అంతరాయం..

ప్రముఖ సోషల్ డియా దిగ్గజ ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (ట్విట్టర్) సేవలు సాయంత్రం ప్రపంచవ్యాప్తంగా స్తంభించింది. భారత్‌తో పాటు అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో వేలాది మంది వినియోగదారులు తీవ్ర సాంకేతిక సమస్యలను ఎదుర్కొ



న్నారు. యాప్, వెబ్‌సైట్.. రెండింటిలోనూ ఈ అంతరాయం కలగడంతో యూజర్లు గందరగోళానికి గురయ్యారు. ప్రముఖ వెబ్‌సైట్ 'డౌన్‌డెటెక్టర్' గణాంకాల ప్రకారం.. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 6:40 గంటల సమయంలో ఈ సమస్య మొదలైంది. కేవలం కొద్ది నిమిషాల్లోనే 25,000కు పైగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్లాట్‌ఫామ్‌ను యాక్సెస్ చేయడంలోనూ, కొత్త పోస్టులను లోడ్ చేయడంలోనూ సమస్యలు తలెత్తుతున్నట్లు వినియోగదారులు ఫిర్యాదు చేశారు. మరికొందరు లాగిన్ క్రెడెన్షియల్స్ పనిచేయడం లేదని పేర్కొన్నారు. అంతరాయానికి గల ఖచ్చితమైన కారణాలు ఇప్పటి వరకు తెలియరాలేదు. సాంకేతిక సమస్యపై 'ఎక్స్' సంస్థ ప్రతినిధుల నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఒకేసారి ఈ సమస్య తలెత్తడం చూస్తుంటే, ఇది కేంద్రీకృత సర్వర్ సమస్య అయి ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నట్లు జాతీయ డియా చెబుతోంది. 'ఎక్స్' ప్లాట్‌ఫామ్‌కు అంతరాయం కలగడం ఇదే మొదటిసారి కాదు. గత మార్చి 2025 లో కూడా ఇలాగే భారీ స్థాయిలో సేవలు నిలిచిపోయాయి. గతేడాది 2024 నవంబర్‌లో క్లౌడ్‌ఫ్లేర్ సర్వీసుల్లో తలెత్తిన సమస్య వల్ల 'ఎక్స్' సహా పలు వెబ్‌సైట్లు మొరాయించాయి. ప్రస్తుతం సేవలు నెమ్మదిగా పునరుద్ధరించబడిన్నట్లు జాతీయ డియా సమాచారం అందుతోంది.

# 'టాటా సన్స్' కీలక నిర్ణయం..




ఎయిరిండియా యాజమాన్యం టాటా సన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. సంస్థ ఎదుర్కొంటున్న నియంత్రణ పరమైన అడ్డంకులను అధిగమించేందుకు మాజీ పౌర విమానయాన శాఖ కార్య దర్శి ప్రదీప్ సింగ్ ఖరోలాను సీనియర్ అడ్వైజర్‌గా నియమించింది. 1988 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన ప్రదీప్ సింగ్ ఖరోలా గతంలో పౌర విమానయాన శాఖ కార్యదర్శిగా పనిచేశారు. అంతేకాకుండా, ఎయిరిండియా ప్రభుత్వ హయాంలో ఉన్నప్పుడు దాని విక్రయ ప్రక్రియలో కీలక పాత్ర పోషించారు. అయితే, ప్రస్తుతం ఎయిరిండి యా, విస్తారా ఎయిర్‌లైన్స్ విలీన ప్రక్రియ తుది దశలో ఉంది. ఈ క్రమంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్, పౌర విమానయాన శాఖ నుంచి వచ్చే నిబంధనలు, అనుమతులు, వ్యూహాత్మక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో ఖరోలా అనుభవం టాటా గ్రూప్‌కు ఎంతగానో తోడ్పడనుంది. ఎయిరిండియా కార్యకలాపాలను మరింత మెరుగుపరచడం, ప్రభుత్వ విభాగాలతో సమన్వయం పెంచుకోవడంలో ప్రదీప్ సింగ్ ఖరోలా నియామకంలో కీలక కానుంది.

# 2035కు రూ.215 లక్షల కోట్ల రిటెయిల్ విపణి



మన దేశ భారత రిటెయిల్ రంగ విపణి పరిమాణం 2035 నాటికి రూ.210-215 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని ఓ నివేదిక తెలిపింది. 2025లోని రూ.90- 95 లక్షల కోట్ల స్థాయితో పోలిస్తే, ఈ విలువ రెట్టింపు కంటే ఎక్కువ. దిగ్గజ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలకు మించి భారత్ రాణిస్తుండటం, మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశలో సాగుతుండటం ఇందుకు కారణమవుతుందని ఆ నివేదిక వివరించింది. 'రిటెయిల్ లీడర్‌షిప్ సదస్సు- 2026'లో బోస్టన్ కన్సల్టింగ్ గ్రూపు (బీసీజీ), రిటెయిలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (రాయ్) సంయుక్తంగా ఈ నివేదికను విడుదల చేశాయి. మలివిడత వృద్ధి పథంలో భారత రిటెయిల్ రంగం సాగుతోందని నివేదిక తెలిపింది. క్రమశిక్షణతో వ్యూహాల అమలుపై దృష్టి సారించే కంపెనీలు విజయం సాధిస్తాయని, కృత్రిమ మేధ సాంకేతికతను అందిపుచ్చుకోవడమూ ముఖ్యమేనని పేర్కొంది. వినియోగదారులతో సత్సంబంధాలు, కార్యకలాపాల విధానాలు, నైపుణ్యం లాంటి విభాగాల్లో వ్యవస్థాగత మార్పులకు ప్రాధాన్యమిచ్చే రిటెయిల్ సంస్థలు.. అత్యధిక మార్కెట్ వాటా సొంతం చేసుకోగలిగే స్థితిలో ఉంటాయని వివరించింది.



## భారత్ చేతిలో ఓటమి సిగ్గుచేటు

టీ20 వరల్డ్‌కప్ 2026లో భాగంగా ఆదివారం జరిగిన భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌లో భారత్ 61 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ ఓటమి తమ జట్టుకు సిగ్గుచేటు, అవమానకరం అని పాక్ స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్ పేర్కొన్నాడు. బ్యాటింగ్ యూనిట్‌గా మేము మంచి ప్రదర్శన చేయలేకపోయాము. నేను తక్కువ పరుగులకే పెవిలియన్ చేరడం బాధగా ఉంది. కీలక మ్యాచ్‌లో జట్టు ఆశించిన స్థాయిలో ఆడకపోవడం నిరాశ కలిగించింది. ఈ మ్యాచ్‌లో చేసిన తప్పులను గుర్తించి.. సరిదిద్దుకోవాలి. తదుపరి మ్యాచ్‌లో మెరుగైన ఆటతీరును ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తాము. ప్రస్తుతం మా పూర్తి దృష్టి నబియాతో జరగబోయే మ్యాచ్‌పైనే ఉంది. ఆ మ్యాచ్ గెలిచి సూపర్ 8 దశకు అర్హత సాదించాలి. ఇదే ఇప్పుడు మా టార్గెట్. మేము ఇక్కడకు వచ్చింది కేవలం ఆడేందుకు కాదు, ట్రోఫీ గెలవడానికే. వరల్డ్‌కప్‌ను గెలిచి పాకిస్థాన్ ప్రజలను గర్వపడేలా చేయాలనే సంకల్పంతో ఉన్నాం' అని చెప్పాడు.

## కంగారులకు టెన్షన్..

# నేడు తేలనున్న భవితవ్యం



టీ20 వరల్డ్ కప్ లో ఇవాళ మరో మూడు కీలక మ్యాచ్ లు జరగనున్నాయి. ఉదయం 11 గంటల సమయంలో న్యూజిలాండ్, కెనడా మధ్య కీలక ఫైట్ ఉంటుంది. ఆ తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు జింబాబ్వే, ఐర్లాండ్ తలపడతాయి. ఈ మ్యాచ్ ఆస్ట్రేలియాకు చాలా కీలకం కానుంది. అలాగే సాయంత్రం ఏడు గంటలకు స్కాట్లాండ్, నేపాల్ జట్ల మధ్య మ్యాచ్ ఉంటుంది. ఈ మేరకు ఇప్పటికే షెడ్యూల్ కూడా ఖరారు అయింది. ఇవాళ మధ్యాహ్నం 3 గంటలకు ఐర్లాండ్, జింబాబ్వే మధ్య మ్యాచ్ ఉన్న సంగతి తెలిసిందే. ఇందులో జింబాబ్వే విక్టరీ కొడితే, ఆస్ట్రేలియాకు షాక్ తప్పదు. జింబాబ్వే గెలిస్తే ఆస్ట్రేలియా టోర్నమెంట్ నుంచి నిష్క్రమిస్తుంది. ఒకవేళ ఐర్లాండ్ గెలిస్తే, ఆస్ట్రేలియాకు కాస్త ఊరట లభిస్తుంది. కానీ జింబాబ్వేకు మరో మ్యాచ్ కూడా ఉంది. అందులో అయినా జింబాబ్వే గెలిస్తే, ఆస్ట్రేలియాకు ఎలిమినేషన్ తప్పదు. ఇక ఇవాళ కెనడాపై న్యూజిలాండ్ గెలిస్తే సూపర్ 8 కు వెళ్లనుంది. అటు స్కాట్లాండ్, నేపాల్ రెండు జట్లు కూడా ఎలిమినేట్ అయిన సంగతి తెలిసిందే. శ్రీలంక, భారత జట్టు, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా ఇప్పటి వరకు సూపర్ 8 లోకి వచ్చాయి. సూపర్ 8 లో భాగంగా ఇండియా మొత్తం మూడు మ్యాచ్ లు ఆడే ఛాన్స్ ఉంది.

## టీ20 ప్రపంచకప్‌లో ఇటలీపై 24 పరుగుల తేడాతో గెలిచిన ఇంగ్లండ్

టీ20 ప్రపంచకప్‌లో భాగంగా కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఇటలీపై ఇంగ్లండ్ 24 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో గ్రూప్ సి నుంచి సూపర్ 8 దశకు అర్హత సాధించింది.భారీ లక్ష్య ఛేదనలో ఇటలీ బ్యాటర్లు బెన్ మనెంటీ, గ్రాంట్ స్టీవర్ట్‌లు అద్భుతంగా పోరాడినా, చివరికి ఇంగ్లండ్ అనుభవం ముందు నిలవలేకపోయారు.ఇంగ్లండ్ నిర్దేశించిన 203 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇటలీకి ఆరంభంలోనే భారీ షాక్ తగిలింది. జోఫ్రా ఆర్చర్ వేసిన తొలి ఓవర్‌లోనే రెండు వికెట్లు కోల్పోయి 1 పరుగుకే 2 వికెట్ల కష్టాల్లో పడింది. కొద్దిసేపటికే మరో వికెట్ పడటంతో 22 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ఓటమి దిశగా సాగింది. ఈ దశలో జస్టిన్



మోస్కా (43), బెన్ మనెంటీ (60) అద్భుతమైన భాగస్వామ్యంతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. ముఖ్యంగా మనెంటీ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. కేవలం 22 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి రికార్డు సృష్టించాడు. టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఒక పూర్తిస్థాయి సభ్య దేశంపై అసోసియేట్ జట్టు బ్యాటర్ సాధించిన వేగవంతమైన అర్ధశతకం ఇదే. తన ఇన్నింగ్స్‌లో మనెంటీ 6 భారీ సిక్సర్లు, 4 ఫోర్లు బాదడంతో ఇంగ్లండ్ శిబిరంలో ఆందోళన మొదలైంది. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని విల్ జాక్స్ విడదీశాడు. మనెంటీ ఔటయ్యాక ఇంగ్లండ్ బౌలర్లు సామ్ కరన్ (3/22), ఆదిల్ రషీద్‌లు వరుసగా వికెట్లు తీసి మ్యాచ్‌పై పట్టు సాధించారు. అయితే, చివర్లో గ్రాంట్ స్టీవర్ట్ (23 బంతుల్లో 45) మరోసారి మెరుపులు మెరిపించడంతో మ్యాచ్ చివరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగింది. స్టీవర్ట్ ఐదు సిక్సర్లతో విరుచుకుపడటంతో సకరణం 12 బంతుల్లో 30 పరుగులుగా మారింది. కానీ, కీలకమైన 19వ ఓవర్‌లో సామ్ కరన్.. స్టీవర్ట్‌ను ఔట్ చేయడంతో ఇటలీ ఆశలు ఆవిరయ్యాయి.

## జింబాబ్వే చేతిలో మా పరువు..

ఒకప్పుడు ప్రపంచ దేశాలను గడ గడలాడించిన ఆస్ట్రేలియా పరిస్థితి ఇప్పుడు దారుణంగా తయారైంది. జింబాబ్వే లాంటి చిన్న జట్టు చేతిలో కూడా ఓడిపోతున్న ఆస్ట్రేలియా, ఇప్పుడు టీ20 వరల్డ్ కప్ నుంచి ఎలిమినేట్ అయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఈ మేరకు తాజాగా ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు. తమ భవిష్యత్తు జింబాబ్వే చేతిలో ఉందని.. ఒకవేళ టీ20 వరల్డ్ కప్ నుంచి తమ జట్టు ఓడిపోతే ఘోర అవమానాన్ని ఎదుర్కొంటుందని ఎమోషనల్ అయ్యారు ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్. టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా సోమవారం ఆస్ట్రేలియా, శ్రీలంక మధ్య కీలక మ్యాచ్ జరిగింది. శ్రీలంకలోని పల్లెకెలె స్టేడియం వేదికగా ఈ రెండు జట్లు తలపడ్డాయి. ఇక ఇది హోమ్ గ్రౌండ్ కావడంతో శ్రీలంక రెచ్చిపోయి ఆడింది. దానికి తగ్గట్టుగానే ఆస్ట్రేలియాను చిత్తు చేసి ఏకంగా ఎనిమిది వికెట్ల తేడాతో విక్టరీ అందుకుంది శ్రీలంక. ఈ విజయంతో సూపర్ 8 నాకౌట్ లోకి ఎంట్రీ ఇచ్చింది. అయితే ఆస్ట్రేలియా మాత్రం గడ్డు పరిస్థితిలోకి వెళ్ళింది. సోమవారం జరిగిన మ్యాచ్ లో ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లు ఆడి, 181 పరుగుల వద్ద కుప్పకూలింది. ట్రావిస్ హెడ్ 56 పరుగులు సాధించగా కెప్టెన్ మిచెల్ మార్ష్ 54 పరుగులతో ఇరగదీశారు. ఈ ఇద్దరు మినహా ఎవరు కూడా ఆస్ట్రేలియాలో రాణించలేదు. దీంతో 181 పరుగుల వద్ద ఆగిపోయింది ఆస్ట్రేలియా. అయితే ఈ లక్ష్యాన్ని శ్రీలంక టీం అత్యంత వేగంగా ఛేదించింది. 18 ఓవర్లలోనే రెండు వికెట్లు నష్టపోయి కొట్టేసింది. ఇందులో నిస్సాంక సెంచరీతో రెచ్చిపోయాడు. కేవలం 52 బంతుల్లో సెంచరీ కొట్టాడు. ఈ దెబ్బకు ఆస్ట్రేలియా ఓడిపోయి శ్రీలంక విజయం సాధించింది.



## అల్లుడు షాహిన్‌కే వార్నింగ్!

# బాబర్, షాదాబ్‌పై అఫ్రిది ఘాటు వ్యాఖ్యలు



గెలుపు, ఓటములు క్రీడల్లో సహజమే. ప్రతి మ్యాచ్‌లోనూ ఆటగాళ్లు అనుకున్నట్టుగా రాణించకపోవచ్చు. ఇందుకు అనేక కారణాలు ఉంటాయి. ప్రపంచ క్రికెట్‌లో ఏ జట్టుతోనైనా ఓడిపోతే ఒక స్థాయిలో మాత్రమే విమర్శలు వస్తాయి. ప్రస్తుతం అదే దృశ్యం కనిపిస్తోంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 61 పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను చిత్తుచేసింది. పాకిస్తాన్ జట్టు కేవలం 114 పరుగులకే కుప్పకూలింది.ఈ నేపథ్యంలో పాకిస్తాన్ మాజీ కెప్టెజట్టు సభ్యులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ప్రదర్శనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పేలవంగా ఆడితే జట్టులో చోటు ఉండకూడదని ఘాటుగా వ్యాఖ్యానించాడు. తాను పాకిస్తాన్ క్రికెట్ బోర్డులో ఉంటే ఇప్పటికే కఠిన నిర్ణయాలు తీసుకునేవాడినని కూడా చెప్పాడు.ముఖ్యమైన టోర్నీల్లో సీనియర్ ఆటగాళ్లు బాధ్యతతో ఆడాలని, కానీ ఆ జాగ్రత్త ఎక్కడా కనిపించలేదని అఫ్రిది అభిప్రాయపడ్డాడు. వారి నిర్లక్ష్యమైన ఆటతీరుతో అభిమానులు తీవ్రంగా నిరాశ చెందారని పేర్కొన్నాడు. ఇక యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇవ్వాల్సిన సమయం వచ్చిందని, వారికి ఛాన్స్ ఇస్తే తమ ప్రతిభను నిరూపించుకునే వీలుంటుందని సూచించాడు. చివరికి, చేతులారా నబియా వంటి జట్టుపై తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితిని తెచ్చుకున్నారని మండిపడ్డాడు.

## వ్యూస్‌లో ఇండియా

# పాకిస్తాన్ మ్యాచ్ సరికొత్త రికార్డు



ఐసీసీ మెన్స్ టీ20 వరల్డ్ కప్ లో ఇండియా - పాకిస్తాన్ మధ్య జరిగిన హై ఓల్టేజ్ మ్యాచ్.. ఈసారి డిజిటల్ వేదికలపై కూడా కొత్త రికార్డును నమోదుచేసింది. భారీ వ్యూయర్ షిప్ సాధించి.. గత రికార్డులను బ్రేక్ చేసింది. తాజాగా వచ్చిన లెక్కల ప్రకారం.. జియో హాట్ స్టార్ యాప్, వెబ్‌సైట్లో ఈ హై ఓల్టేజ్ మ్యాచ్ ను 454 మిలియన్ల మంది.. అంటే 45.4 కోట్ల మంది వీక్షించారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ టీవీల ద్వారా దేశవ్యాప్తంగా అభిమానులు ఈ బ్లాక్‌బస్టర్ పోరును ప్రత్యక్షంగా వీక్షించడం ఈ దాయాదుల పోరుకు ఉన్న ఆదరణను మరోసారి నిరూపించింది. అంతకుముందు ఫిబ్రవరి 7, 2026న అమెరికాతో జరిగిన మ్యాచ్‌కు 260 మిలియన్ల వ్యూస్ రాగా, నబియాతో జరిగిన పోరుకు 240 మిలియన్ల వ్యూస్ లభించాయి. అయితే, పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్ సాధించిన గణాంకాలతో పోలిస్తే ఇవి చాలా తక్కువ. కొలంబో వేదికగా ఫిబ్రవరి 15, 2026న జరిగిన గ్రూప్-ఎ మ్యాచ్‌లో భారత్ 61 పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ కేవలం 40 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 77 పరుగులు చేసి టీమ్ ఇండియా విజయంలో కీలక పాత్ర పోషించారు. అనంతరం 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ .. భారత బౌలర్ల ధాటికి 18 ఓవర్లలోనే 114 పరుగులకు ఆలౌట్ అయింది. హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తిలతో కూడిన భారత బౌలింగ్ విభాగం పాక్ బ్యాటర్లను కట్టడి చేసింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల్లో ఆరు పాయింట్లు సాధించిన భారత్.. ఈ టోర్నమెంట్‌లో సూపర్-8 దశకు అర్హత సాధించిన తొలి జట్టుగా నిలిచింది.



# వుదయం సినిమా



# తారల అసలు పేర్లు !

## కన్నడ రాజ్ కుమార్

కన్నడ కంఠీరవగా కన్నడ మ్యాటిని ఐడల్ గా గుర్తింపు పొందిన రాజ్ కుమార్ అసలు పేరు సింగనల్లూరు పుట్ట స్వామయ్య ముత్తురాజ్. 2441929న దొడ్డ గాజనూర్ లో పుట్టారు.ప్రముఖ రంగస్థల నటుడు గుబ్బి వీరన్న యొక్క గుబ్బి డ్రామా కంపెనీలో 8వ ఏట చేరి నటిస్తూ క్లాసికల్ సంగీతంలోను శిక్షణ పొందారు. బాల నటుడుగా భక్త ప్రహ్లాదలో 1942లో, శ్రీనివాస కల్యాణలో 1952లో నటించారు. టైటిల్ పాత్రని 'బేదర కన్నప్ప' లో దర్శకుడు హెచ్.ఎల్. సిన్హా అవకాశమిస్తూ రాజ్ కుమార్ అని పేరు పెట్టారు.751954న విడుదలై హిట్ అయింది. ఇది 'కాళహస్తి మహాత్మ్యం' గా తెలుగులో ఆ దర్శక నిర్మాతలే తీయగా 12111954న విడుదలై విజయం సాధించింది. ఇది తప్ప ఏ ఇతర భాషలోనూ ఆయన నటించక పోవడం విశేషమే! ఎన్.టి.ఆర్. అంటే ఎంత అభిమానం అంటే ఒక దేవుడుగ భావించే వ్యక్తి.

హైదరాబాద్ పద్మాలయ స్టూడియోలో తన సినిమా షూటింగుకు 1986లో వస్తే పరిచ యం చేసుకుని ఇంటర్వ్యూ అనగానే లేచి నిలబడి భుజంపై చెయ్యి వేసి పక్కన కుర్చీలో కూర్చోబెట్టాక తను కూర్చొని ఒక అతి సామాన్య జర్నలిస్టుతో ఎన్నో విషయాలు ముచ్చటించడం ఆయన గొప్ప దనమే! ఈయన,ఎన్.టి.ఆర్, కె.ఆర్. విజయ మాత్రమే నాకు తెలిసి సాధారణ జర్నలిస్టులకింత గౌరవాభిమానాలు ఇచ్చినవారు. అందుకే వారు అందని ఎత్తుకు ఎదిగారు!

బేదర కన్నప్పకు తన పారితోషికం ఎంతో చెప్పమన్నారు. ₹20000అన్నాను. పడీ పడి నవ్వుతూ కేవలం 45 పైసలు మాత్రమే అని చెప్పారు. ఏవో పాటలు పాడుకుంటూ గడిపే నన్ను గుబ్బి డ్రామా సంస్థ పైకి తీసుకుని వచ్చిందన్నారు. 'ఇపుడవన్నీ చెప్పడం అవసరమా' అని భార్య పార్వతమ్మ వారించబోతే 'చెప్పాలి. ఆందరికి తెలియాలి మన ఎదుగుదల' అన్నారు నవ్వుతూ. బెంగుళూరు వస్తే ఫోన్ చేయమని తన ఆతిధ్యం తీసుకోవాలంటూ ఫోన్ నంబర్ రాసి ఇచ్చిన మహానుభావుడు.

రాజ్ కుమార్ నటించిన 39 సినిమాలను 63 సార్లు 9 భాషల్లో 34 మంది పేరున్న నటులు నటించడం కూడా రికార్డు. కన్నడ చిత్ర సీమలో ఏ నటుడు పొందని అనేక అవార్డులు ఇచ్చి గౌరవించారు.సినీ గాయకుడుగా జాతీయ స్థాయిలో అవార్డు పొందిన ఒకే ఒక్క నటుడీయన. 1983లో పద్మ భూషణ్ 1995లో దాదా సాహెబ్ ఫాల్కె అవార్డు స్వీకరించారు. 2002లో ఎన్.టి.ఆర్ అవార్డు లభించింది.205 చిత్రాల్లో సాంఘిక, పౌరాణిక, చారిత్రిక, జానపద, రాజకీయ చిత్రాల్లో విభిన్న పాత్ర లతో మెప్పించారు. బెంగళూరులో కంఠీరవ ఫిలిం స్టూడియో నెలకొల్పారు. ఎందరినో ఆదుకున్న మనసున్న వ్యక్తి.1242006న మృతి చెందారు. ఏ సమయంలో హెచ్. ఎల్. సిన్హా రాజ్ కుమార్ అని పేరు పెట్టారో గాని కన్నడ చిత్ర సీమలో రాజ్ కుమారుడు గానే వెలుగుతున్నారు.

## జయంతి



బళ్లారిలో ప్రొఫెసర్ బాల సుబ్రహ్మణ్యం సంతాన లక్ష్మి దంపతులకు 611945న తొలి సంతానంగ కమల కుమారి పుట్టింది. పిల్లలతో మద్రాసు చేరిన తల్లి, కమలకు నృత్యం నేర్పించింది. చిన్న పిల్లగా వున్నపు డే తను అభిమాన హీరో ఎన్టీ ఆర్ ని చూడ డానికి తల్లితో స్టూడియోకి వెళ్లి ఆయన ఒడిలో కూర్చొంది. నాతో హీరోయిన్ గా నటిస్తావా అని ఆయన అడిగితే ఓ ఎస్ అంది. తరువాత కాలంలో 'జగదేక వీరుని కథ' లో ఒక నాయికగా నటించి పలు చిత్రాలు చేసింది.కన్నడ దర్శకుడు వై.ఆర్.స్వామి కమల నాట్యం చూసి జేను గూడు లో 1963లో నటిగా అవకాశమిస్తూ జయంతి అని పేరు పెడితే ఆ సినిమా హిట్ అవడంతో జాతకం మారింది. కన్నడ రాజ్ కుమార్ తో 1964లో 'చందయవాళ్లీయ తోట నుంచి దేవరు కూట్ట తంగి' వరకు 35 సినిమాలకు పైగా నటిస్తే చాలా సూపర్ హిట్టయి అద్భుత వెండి తెర జోడీ అనే పేరొచ్చింది. వీటిలో జయంతి భర్త తెలుగు నటుడు పేకేటి శివరాం( తరువాత విడిపోయింది)డైరెక్టుచేసినవివున్నాయి.కన్నడంలో అభినయ శారద అని అందాల సాహస నటి అనే పేరు గడించింది. కర్ణాటక ప్రభుత్వ ఫిల్మ్ అవార్డులు ఏడు, ఉత్తమ నటిగా రాష్ట్రపతి మెడల్ వచ్చాయి.భార్యాభర్తలు,డాక్టర్ చక్రవర్తి, కుల గౌరవం, భలే కోడళ్ళు,కమలమ్మ కమతం, బొబ్బిలి యుద్ధం,శారద,మాయదారి మల్లిగాడు, కొండవీటి సింహం, జస్టిస్ చౌదరి, స్వాతి కిరణం ఇలా పలు తెలుగు సినిమాలు, మలయాళ, తమిళ, హిందీ చిత్రాలు మొత్తం మీద 301కి పైగా చేసి 2672021న బెంగళూరులో నిద్ర లో మృతి చెందింది.

## నగేష్



హాస్య నటుడుగా తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో వెయ్యికి పైగా సినిమాల్లో రాణించిన నగేష్ అసలు పేరు చెయూర్ కృష్ణారావు నాగేశ్వరన్. కోయం బత్తూరు దగ్గర ధారా పురంలో కన్నడిగుడైన కృష్ణారావు, తమిళ మహిళ రుక్మిణి అమ్మాళ్ దంప తులకు 2791933నపుట్టారు. మద్రాసులో రైల్వే క్లార్క్ గా చేస్తూ వేసిన నాటకం చూసి ఎంజిఆర్ పొగిడాక నిర్మాత బాలాజీ 1958 లో మానుముల్ల మరదరంలో చిన్న వేష మిచ్చారు. 1961లో తాయిల్ల పిల్లయ్, నెంజిల్ ఒరు ఆలయం, సర్వర్ సుందరం సినిమాల తో గుర్తింపు వచ్చింది. ఎమ్ జి ఆర్, శివాజీ గణేషన్ ల మధ్య కొన్ని విభేదాలున్నా వారిద్దరి చిత్రాల్లో నటించడం గొప్ప విషయం! సర్వర్ సుందరం, డాక్టర్ బాబు, సోగ్గాడు, తూర్పు పడమర, వేటగాడు, ఇంద్రుడు చంద్రుడు, శత్రువు, తొలి ప్రేమ, శుభాకాం క్షలు, బృ ందావనం, కిష్కింద కాండ, ఇలా పలు సినిమాల్లో తన హాస్యంతో అలరిం చారు. 3112009న మృతి చెందారు. నగేష్ పేరున ₹500ల పోస్టల్ స్టాంపు కూడా విడుదలైంది.

## మౌసమీ చటర్జీ



కలకత్తాలో ఆర్మీ అధికారి ప్రంతోష్ చటో పాధ్యాయ కామినీ దేవి దంపతులకు 2641954న జన్మించిన మౌసమీ చటర్జీ అసలుపేరు ఇందిరా చటోపాధ్యాయ. తరుణ్ మజుందార్ దర్శకత్వం వహించిన 'బాలికా వధు' బెంగాలి సినిమాలో తన చిన్న వయసులో 1967లో అవకాశం లభించింది. అసలు పేరుతో నటించిన ఆ సినిమా హిట్ కావడంతో ఎక్కువ సిని మాలు వస్తుంటే చదువు పూర్తి చేయాలను కుంది.10వ తరగతిలో ఉండగా తను ఇష్టపడే అత్త చనిపోయే దశలో పెళ్లి చేసుకోమన్న కోరిక తీర్చడానికి సంగీత దర్శకుడు హేమంత్ కుమార్ కొడుకు జయంత్ ముఖర్జీని (అప్పటికే ఇద్దరూ ప్రేమికులు)పెళ్లాడింది. "మావగారు భర్త బాగా ప్రోత్సహిస్తుంటే తప్పనిసరిగా అంధురాలిగా శక్తి సామంత్ సాబ్ దర్శకత్వంలో 1972లో 'అనురాగ్ ' లో చేసాను. నిజానికి ఈ పాత్ర చేయడం ఇష్టం లేకపోతే దర్శకుడు నాకు శిక్షణ ఇప్పించి చేయించారు.దర్శకుడే నా పేరు మౌసమీ చటర్జీగా మార్చారు.ముహూర్తం షాట్ వద్ద రాజేష్ ఖన్నా, అశోక్ కుమార్, నూతన్ వగైరా ప్రముఖులను చూసి భయం వేసినా వాళ్ళ ముందు గుర్తింపు కోసం ధైర్యంగా చేసి మెప్పు పొందాను. నా తొలి హిందీ సినిమాకి ప్రశంసలు, ఫిలిమ్ ఫేర్ అవార్డు వచ్చాయి " అని చెప్పారామె 1985లో. నయన,బేనామ్ హమ్ షకల్, ప్రేమ్ బంధన్, రోటి కపడా మకాన్, మంజిల్, దాసి,స్వర్గ్ నరక్ ఇలా పలు సినిమాల్లో చక్కని నటిగా నాయికగా ప్రశంసలు పొందింది. హిందీ బెంగాలి చిత్రాల్లో అధిక పారితోషికం పొందిన తారగా పేరుంది. 1985 నుంచి ఆగ్ హి ఆగ్ తో కేరక్టర్ నటి అయింది. తొలుత కాంగ్రెస్ పార్టీలో చేరి 2019 నుంచి బి జె పి లో కొనసాగుతోంది.



- వి.ఎస్.ఆర్. కేశవరావు
సెల్: 9989235320

# బుకీ అందరూ రిలేట్ అయ్యే సినిమా



అజయ్ దిషన్, ధనుషా హీరో హీరోయిన్స్ గా గణేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన యూత్ ఫుల్ ఎంటర్టైనర్ 'బుకీ'. విజయ్ ఆంటోనీ సమర్పణలో శరవంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్స్ పై రామంజేయులు జవ్వాజీ నిర్మించారు. సునీల్, లక్ష్మి మంచు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే తమిల్ లో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ ని అందుకుంది.తెలుగులో ఈ సినిమా ఫిబ్రవరి 20న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు.

ప్రెస్ మీట్ లో మూవీ ప్రజెంటర్, మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఈ వేడుకకు మంచు లక్ష్మి గారు రావడం చాలా ఆనందంగా ఉంది. వారితో కలిసి మరిన్ని చిత్రాలు చేయాలని కోరుకుంటున్నాను.గణేష్ అద్భుతమైన డిఓపీ, దర్శకుడు. ఈ సినిమా మ్యాసీవ్ హైబడ్జెట్ మూవీలా కనిపించదానికి కారణం కూడా తన విజన్. ఈ సినిమా తర్వాత కచ్చితంగా మీరందరూ ఆయన్ని సపోర్ట్ చేస్తారు. భాష్యశ్రీ గారితో బిచ్చగాడు నుంచి జర్నీ కొనసాగుతోంది. ఈ సినిమాకి ఇచ్చిన అద్భుతమైన మాటలు రాశారు. అజయ్ మార్గన్ తో చాలా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. బుకీ కూడా తన నటన మీ అందరినీ అలరిస్తుంది. తెలుగు ఆడియన్స్ ఒక మంచి టాలెంట్ ని సపోర్ట్ చేస్తారు. తనని కూడా సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. ధనుషా స్క్రీన్ పై చాలా క్యూట్ గా ఉంటుంది. ఈ సినిమాలో లక్ష్మి గారు, సునీల్ గారి పెర్ఫార్మెన్స్ అదిరిపోతుంది. ఈ సినిమా క్లైమాక్స్ చూస్తున్నప్పుడు ఖచ్చితంగా కన్నీళ్లు వస్తాయి. అంతా రిలేట్ చేసుకునేలా ఉంటుంది. నిర్మాత రామ్ గారితో మార్గన్ నుంచి అసోసియేషన్ ఉంది. సురేష్ ప్రొడక్షన్స్ కి కృతజ్ఞతలు. వారితో మా అసోసియేషన్ కొనసాగుతుంది. చాలా మంచి సినిమా. ఫిబ్రవరి 20న థియేటర్స్ లో చూసి తప్పకుండా మీరందరూ సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను.

యాక్ట్రెస్ మంచు లక్ష్మి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. గత శుక్రవారం ఈ సినిమా తమిళ్లో రిలీజ్ అయ్యి అద్భుతమైన రెస్పాన్స్ ని అందుకుంది. ఇది యూనివర్సల్ గా కరెక్ట్ అయ్యే సిని.మా అజయ్ ధనుషా ఇలా మంచి టీం తో కలిసి చేసిన సినిమా ఇది. విజయ్ గారు ఒక సినిమాకి మ్యూజిక్ ఇస్తున్నారంటే ఆ కంటెంట్ అద్భుతంగా ఉంటుంది. డైరెక్టర్ గణేష్ కి చాలా మంచి ఫ్యూచర్ ఉంటుంది. ఈ సినిమాలో చాలా ఆసక్తికరమైన క్యారెక్టర్ చేశాను. ఇందులో క్యారెక్టర్ ఎక్స్ప్రెషన్స్ చాలా గమ్మత్తుగా ఉంటాయి. ఈ సినిమా తమిళ్లో అద్భుతమైన పేరు సంపాదించుకుంది. ఇది యూత్ ఫుల్ సినిమా. తెలుగులో కూడా సినిమా మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను.

# సైలెంట్ హిట్‌గా నిలవే



సౌమిత్ పోలాడి హీరోగా నటిస్తూ సాయి కే వెన్నంతో కలిసి దర్శకత్వం వహించిన చిత్రం నిలవే. శ్రేయాసి సేన్ హీరోయిన్ గా నటించగా, హర్ష చెముడు, సుప్రియా ఐసోలా మరో జంటగా నటించారు. పీఓవీ ఆర్ట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్ అల్లాడ, గిరిధర్ రావు పోలాడి, సాయి కే వెన్నం నిర్మించారు. ఈ చిత్రం ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 13న విడుదలై అద్భుతమైన రెస్పాన్స్ ను తెచ్చుకుంది. బిగ్గెస్ట్ మ్యూజికల్ లవ్ డ్రామాగా అందరి ఆదరణ అందుకుంది. ఈ సందర్భంగా మంగళవారం రామానాయుడు స్టూడియోలో సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఆస్కార్ అవార్డు గ్రహీత, గీత రచయిత చంద్రబోస్ వీడియో బైట్ ద్వారా స్పందిస్తూ బిగ్గెస్ట్ మ్యూజికల్ హిట్‌గా నిలిచిందని చెబుతూ టీమ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్ కు ముఖ్య అతిథిగా హాజరైన దర్శకులు వి సముద్ర మాట్లాడుతూ.. ''ఈ వాలెంటైన్స్ డేకి విడుదలైన ఆరేడు చిత్రాల్లో 'నిలవే' సక్సెస్‌ఫుల్ టాక్ తెచ్చుకుంది. డీసెంట్ కలెక్షన్స్‌తో సైలెంట్ హిట్‌గా నిలిచింది. ఇందులోని హీరో హీరోయిన్ భవిష్యత్తులో కచ్చితంగా సూపర్ స్టార్స్ అవుతారు. డైరెక్టర్ సాయి కే వెన్నం గారితోపాటు టీమ్ అందరికీ నా శుభాభినందనలు తెలియజేస్తున్నా''అని అన్నారు.

మరో అతిథిగా హాజరైన జెమిని సురేష్ మాట్లాడుతూ..'' చాలా రోజుల తర్వాత చాలా మంచి సినిమా చూశాననే ఫీలింగ్ మనసుకు కలిగింది. బాపు గారు గీసిన బొమ్మలా, విశ్వనాథ సత్యనారాయణ గారి కవితలా, నేటి జనరేషన్ 'గీతాంజలి'లా 'నిలవే' చిత్రం నిలుస్తుంది. ఇంత మంచి చిత్రాన్ని నిర్మించిన రాజ్ అల్లాడ గారికి థ్యాంక్స్. డైరెక్టర్ సాయి విజన్, దిలీప్ విజువల్స్, కళ్యాణ్ మ్యూజిక్ అద్భుతంగా కుదిరాయి. మా కరీంనగర్ కుర్రాడు సౌమిత్ ఈ సినిమాతో హిట్ కొట్టాడు''అని అన్నారు.



నేచురల్ స్టార్ నాని ప్రస్తుతం తన పాన్ వరల్డ్ సినిమా 'ది ప్యారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, SLV సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి భారీ కాన్వాస్ పై నిర్మిస్తున్నారు. టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ లుక్ పోస్టర్లు ఇప్పటికే సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. ఇప్పుడు, మేకర్స్ బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. ఫిబ్రవరి 24న నాని పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక వేడుకలకు టీమ్ సిద్ధమవుతోంది. అదే రోజున చిత్రంలోని ఫస్ట్ సింగిల్ "ఆయా షేర్"ను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. గూస్‌బంప్స్ తెప్పించే ఈ ఇంట్రడక్షన్ ట్రాక్‌తో సినిమా ప్రమోషన్స్‌కు ఘనమైన ఆరంభం ఇవ్వబోతున్నారు మేకర్స్. ఈ పాటను వందలాది డ్యాన్సర్లతో భారీ సెట్లో చిత్రీకరించారు. నాని ఫియర్స్, మాస్సీ అవతార్‌లో కనిపించే ఈ సాంగ్ కోసం రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ పవర్‌ఫుల్ మాస్ ట్యూన్ అందించారు. సుధన్ మాస్టర్ రూపొందించిన డైనమిక్ కొరియోగ్రఫీ ఈ ట్రాక్‌ను విజువల్ స్పెక్టకిల్‌గా అలరించబోతోంది. అభిమానులకు ఇది బర్త్‌డే ట్రీట్‌గా మారనుంది.

# 24న ది ప్యారడైజ్ ఫస్ట్ సింగిల్ రిలీజ్

# 'ప్రత్యూష' సంఘటనపై సినిమా



ప్రత్యూష కన్నతల్లి పట్టు వదలని వంటరి పోరాటాల ఫలితంగా 24 సంవత్సరాల తర్వాత నేడు సుప్రీంకోర్ట్ శిక్షలు విధించిన నిందితులను నిలదీస్తూ వర్ధమాన నటి ప్రత్యూష మరణంపై ఆనాడే డైరెక్ట్ గా ప్రత్యూష అనే పేరు పెట్టి సినిమా తీయడం సామాన్యమైన విషయం కాదు. దానికి గట్స్ ఉండాలి.ఎంతో గుండె ధైర్యం,తెగింపు కావాలి. ప్రత్యూష మరణం వెనుక నాటి మంత్రుల కొడుకులు పోలీస్ అధికారుల కుమారులు,పెద్ద పెద్ద బడా బాబులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల పిల్లలు ఉన్నారని తెలిసి కూడా అన్నింటికీ తెగించి కళామతల్లి నమ్మకంతో నూ నూగు మీసాల వయస్సులో ఉన్న సత్యారెడ్డి అనే ఒక యువ నిర్మాత ఒక ముందుకు వచ్చి అన్నపూర్ణ స్టూడియోలో నాటి ప్రముఖ యువ హీరో ప్రముఖ విలన్ అంకుశం రామిరెడ్డి, తెలంగాణ శకుంతల, కాస్టమ్స్ కృష్ణ, ఏవీఎస్, రమ్యశ్రీ ఐరన్ లెగ్ శాస్త్రి,కళ్ళు చిదంబరం,తిరుపతి ప్రకాష్తో పాటు భారీ తారగానం పెట్టి పెద్ద స్థాయిలో సినిమా ఓపెన్ చేయడం జరిగింది.



# కాన్ఫిడెంట్‌గా ఉన్నా



ఇటీవల లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి, ఈషా వంటి బ్లాక్‌బస్టర్స్ చిత్రాలను అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం తాజాగా నందిపాటి ఎంటర్ టైన్మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై 'హే బల్‌వంత్' (హే భగవాన్ చిత్రం టైటిల్ మార్పు) అనే ఫుల్‌లెంగ్త్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ చిత్రంలో సుహాస్, శివానీ నగరం, సీనియర్ నటుడు నరేష్, యాంకర్ స్రవంతి ప్రముఖ పాత్రల్ని పోషించారు. గోపీ అచ్చర దర్శకత్వంలో త్రిశుల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి.నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీని ఫిబ్రవరి 20న రిలీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హీరో సుహాస్ మంగళవారం పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి.

**'హే భగవాన్' నుండి హే బల్‌వంత్ టైటిల్ మార్చడానికి కారణమేమిటి?**

భగవాన్ అంటే భగవంతుడు అనే అర్థం వస్తుంది కాబట్టి టైటిల్ మార్చాలని సెన్సారు వారు సూచించడంతో హేబల్‌వంత్‌గా మార్చాం. సినిమాలో నరేష్ క్యారెక్టర్ పేరు మార్చాం. సినిమా టైటిల్‌తో పాటు సినిమా కాన్సెప్ట్ ను కూడా సెన్సారు వాళ్లు పరిగణనలోకి తీసుకున్నారు.

**ఈ సినిమాలో మీ పాత్ర ఎలా ఉంటుంది?**

చిన్నప్పటి నుంచి బిజినెస్ చేయాలని ఆలోచించే కుర్రాడు, నాన్న బిజినెస్‌ను టేకప్ చేయాలని అనుకుంటాడు. అప్పుడు అతనికి ఎదురైన పరిణామాలు ఏమిటి? నాన్న బిజినెస్ ఏమిటి? ఇలా సినిమా పూర్తి ఎంటర్‌టైన్‌మెంట్‌గా, నా పాత్ర కూడా వినోదాత్మకంగా ఉంటుంది.

**సినిమా ఓకే చేయడానికి కారణం?**

కథ వినగానే నచ్చింది. ముఖ్యంగా ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఎమోషన్‌గా కనెక్ట్ అయ్యాను. సినిమా మేము అనుకున్నదాని కంటే వందరెట్లు బెటర్‌గా ఉంది.

**ఈ సినిమా సుహాస్ 2.0 అనుకోవచ్చా?**

అంత పెద్ద పదాలు వాడకండి. కాకపోతే ఈ సినిమా అయితే నాకు విజయాన్ని అందిస్తుందనే నమ్మకం ఉంది.

**హే బల్‌వంత్ పట్ల ఎలాంటి అంచనాలు ఉన్నాయి?**

ఈ సినిమాపై అందరికి నమ్మకం ఉంది. వంశీ నందిపాటి గారు మాకు ఈ సినిమాకు ఎంతో ధైర్యం ఇస్తున్నారు. వరుస ఫెయిల్యూర్స్ తరువాత అందరూ కంట్రోల్‌గా ఆలోచించి చేయమని అన్నారు., ఇంట్లో మా శ్రీమతి కూడా చెప్పింది. అందుకే మంచి సినిమాలు చేయాలని కొంత బ్రేక్ ఇచ్చి హేబల్‌వంత్ చేశాను. ఈ సినిమాపై చాలా నమ్మకం ఉంది.

**తమిళ్ సినిమా మందాడిలో మీ పాత్ర ఎలా ఉండబోతుంది.**

మందాడిలో మెయిన్ విలన్ తమిళ్ సినిమా. సినిమా రిజల్ట్ తరువాత తమిళంలో బిజీ అయ్యే అవకాశం ఉంది. నేను వెయిట్ చేసిన లుక్ అండ్ క్యారెక్టర్. అంబాజీ పేట సినిమా చూసి ఈ సినిమా కోసం నన్ను అప్రోచ్ అయ్యారు.

**కెరీర్ ఎలా అనిపిస్తుంది?**

నేను పూర్తి శాటిస్‌ఫాక్షన్‌గా ఉన్నాను. ఈ సినిమా హిట్ అయితే అది ఇంకా పెరుగుతుంది. అందరూ సినిమా మీద ఫుల్ కాన్ఫిడెంట్‌గా ఉన్నాను. పెద్ద విజయం రాబోతుంది. ఈ సినిమా మా వైఫ్ కూడా చూసి ఫుల్ ఎంజాయ్ చేసింది. ఇలాంటి సినిమాలు కదా నువ్వు చేయాల్సింది అంది.

# మరకతమణి 2 ప్రారంభం

2017లో విడుదలై తన మ్యాజికల్ కాన్సెప్ట్, కామెడీతో ఫాంటసీ కామెడీ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్న చిత్రం మరకతమణి. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా సీక్వెల్ 'మరకతమణి 2' అధికారికంగా ప్రారంభమైంది. శివరాత్రి శుభ సందర్భంగా ఈ చిత్రం షూటింగ్ నిన్న (ఫిబ్రవరి 16, 2026) చెన్నైలో జరిగిన పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. హీరో కార్తీ క్లాప్ కొట్టగా, హీరో ఆర్య, దర్శకుడు వెంకట్ ప్రభు "కెమెరా రోలింగ్, యాక్షన్" అంటూ షూటింగ్ ప్రారంభించారు. యాక్సెస్ ఫిల్మ్ ఫ్యాక్టరీతో అనుబంధం వున్న అనేక మంది ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ప్యాషన్ స్టూడియోస్, దంగల్ టీవీ, ఆర్‌డిసి మీడియా, యాక్సెస్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, గుడ్ షో బ్యానర్‌లపై సుధన్ సుందరం, మనీష్ సింఘాల్, దుర్గారం చౌదరి, దేవ్ & కెవి దురై నిర్మిస్తున్న ఈ చిత్రానికి గత బ్లాక్ బస్టర్ 'మరకత మణి'కి దర్శకత్వం వహించిన ఎఆర్‌కె శరవణ్ దర్శకత్వం వహిస్తున్నారు. మరకతమణి 2లో ఆది పినిశెట్టి, సత్యరాజ్, ప్రియా భవాని శంకర్, నిక్కి గల్రానీ పినిశెట్టి, మునిష్కాంత్, ఆనందరాజ్, డానీ, అరుణ్‌రాజా కామరాజ్, మురుగానందం కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సాంకేతిక విభాగంలో ధిబు నినన్ థామస్ సంగీతాన్ని అందిస్తుండగా, పీవీ శంకర్ సినిమాటోగ్రఫీ, ఎన్‌కే రాహుల్ ఆర్ట్ డైరెక్షన్, తిరుమలై రాజన్ ఆర్ ఎడిటింగ్, రాజేష్ కన్నన్ డైలాగ్స్, పీసీ స్టంట్స్ యాక్షన్ నిర్వహిస్తున్నారు. అనౌన్స్మెంట్ నుంచి అంచనాలు భారీగా పెరగడంతో, మరకతమణి 2 మరింత వినోదం, మ్యాజిక్, థ్రిల్లింగ్ అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది. చిత్రీకరణ విరామం లేకుండా కొనసాగనుండగా, త్వరలోనే మరిన్ని ఆసక్తికరమైన అప్డేట్స్ రివిల్ చేయబోతున్నారు.



Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.